# సన్మార్గ దర్శనము

(ఆత్మజ్ఞానమునకాధారము)



శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ



రచయిత్రి శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

పతిదేవులు (పరమపదవాసులు) శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట రాఘవాచార్యులు అయ్యవార్లతో

అంతర్జాల మాధ్యమం

www.pravachanam.com

# సన్మార్గ దర్శనము

(ఆత్మజ్ఞానమునకాధారము)

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి వారి

మంగళాశాసనములతో



పరిష్కర్త

శ్రీ మొలుగు రంగాచార్యులు

భాగవత కైంకర్యం

శ్రీమతి కామాండూరి సీతాలక్ష్మిగారు, తిరుపతి

# సన్మార్గదర్శనము

శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

© రచయిత్రి

డిజిటల్ వెర్షన్

**జనవరి, 2021**

శ్రీమతి కొమాండూరి సీతాలక్ష్మిగారు, తిరుపతి

వెల

**అమూల్యం**

సంప్రదించుటకు

శ్రీ ఎస్.టి.పి.ఎస్.వి. రాఘవాచార్యులు

9490942884

# సన్మార్గ దర్శనము

# వైదికము - అవైదికము

శ్రీమతి ఎస్.టి.పి.వి. సీతమ్మ గారు, అయ్యావారి రుద్రవరం.

అది ప్రశాంతమైన రమణీయ దృశ్యము. ఉదయభానుని అరుణకిరణజాలములచే భూమి – ఆకాశము – ప్రకృతి అంతయును బంగరుమయముగా గోచరించుచున్నది. అది లోపలి చీకటిని పోగొట్టజాలినది మాత్రము గాదని తోచుచున్నది.

కాని! మనసును రంజింప జేయుచున్న చిత్రచిత్రములగు దృశ్యములను తిలకించిన కొలదియు నామనస్సేలనో యాలోచనలతో మునింగినది. ఈ సుప్రభాత రహస్యమేమియో తెలిసికొన వలెనను తలంపు కలుగు చున్నది. దాని నెటుల తెలుసుకోగలను? దాని నెటుల తెలియగలనను సందేహములును, ప్రశ్నలును దప్ప సమాధానములు స్ఫురింపకున్న వేలనో? అందు ముఖ్యముగా నేనెవరు? దేవుడెవరు? జీవుడెవరు? అను ప్రశ్నలుత్పన్నములగుచున్నవి. ఈ ప్రశ్నలిదివరకెందులకు తట్టలేదో? ఇట్టి ప్రశ్నలు నాకు మాత్రమే దోచినవా? నాకు దోచినట్లే శ్రేయస్సుగోరు యితరులందరకును గూడ ఇట్టి ప్రశ్నలు తట్టునా? ఎందులకని? వారందరును నావంటి సంసారులే కద?

ప్రశ్నలుదయించినవి గాని వీనికి తగిన సమాధానములు ఏవియో తెలియుట లేదు. దీనిని తెలియనుపాయమెద్ది? ఈ విచారణకు పూర్వము ఇట్టి ప్రశ్నలున్నవని తెలియదే! నే నిట్టి ప్రశ్నలను వేయ గలనని కూడ తెలియదే! ఈ ప్రశ్నల వెనుక ఇంతగాథ యున్నదని చూడనేరకున్నాను. కాని వీని విచారణ వీలుచూచుకొని నెమ్మదిగా సాగింతము.

"నేనెవరు? దేవుడెవరు? జీవుడెవరు" అను ప్రశ్నలు కలిగినవను కొందము. ఈ విచారణకు పూనుకొనుట సమంజసమే కద! అంత తీవ్రభావము కలిగినను మనస్సు వాని యందు నిమగ్నమైనను వ్రాయను చదువను విశ్రాంతి యేది? ఇంత మాత్రమైనను వీలు దొరకినది గనుక నాకు దోచినది, ఇతరులకు తెలియజేయు చున్నాను.

1. నేను స్వయముగా చదివి నేర్చుకొన్న విషయములు.
2. నే నాలోచించి తేల్చుకొన్న సంగతులు.
3. నా పూర్వ సంస్కారము వలననో మరి యెందువలననో కలుగుచున్న భావములు.
4. నేను పెద్దల ముఖత్త గ్రహించిన ఉపదేశ సారాంశములు.
5. నా యనుభవములు.
6. నేనాశ్రయించిన పరమాత్మ కటాక్షించిన జ్ఞాన, వైశద్య ప్రభావములో అయియుండ వచ్చును.

ఈ మొదలగునవన్నియును నాకొక తృప్తిని గలిగించుటచే, నాబోటి వారీ లోకమున మరికొందరుందురనియు, నాకితరుల గ్రంథముల వలనను, తలంపుల వలనను లాభము కలిగినట్లే, ఈ గ్రంథము వలన ఇతరులకు లాభము కలుగవచ్చునని భావించుటయే ఈ గ్రంథ రచనకాధారము.

నేనెవరు? అను సంశయ విచారణకు నాకు గల సామాన్య బుద్ధినే తీసికొందము. అంతియే గాని ప్రమాణములను, వేదవాక్యములను తీసికొనరాదు. 'నేనెవరిని' యని ప్రశ్నించు కొన్నప్పుడు నాకన్ని విధముల యనుభవమున్ను ఈ లోకము అందు భిన్నభిన్నముగా నున్న అనంతకోటి జీవరాశులు వానివాని వ్యవహారములు – చావు పుట్టుకలు.

ఒకదానినొకటి చంపి తినుచున్న జీవరాశులలో నేనొక్క తినేననియా, ఇదేమిటనియా? ఆలోచించి చూతము. విచారించుటెట్లు? నాకు రెండు మార్గములు దోచుచున్నవి. ఒకటి తెలిసిన వారినెవరినైన యడుగుట – రెండవది నేనే తెలిసికొనగలగుదునని పట్టుపట్టుట.

ఇతరుల నడగుదమన్న నా సంగతి ఇతరుల కెట్లు తెలియగలదు? ఐతే ఇక మార్గమేది యని కల్లోలపడుట తెలియని తనమేగదా! ఇంత తెలియనితనమేమిటని ఇంతవరకు తట్టని ప్రశ్న ఇప్పుడు నాకెట్లు తట్టినదో అట్లే పరుల సహాయము అనునది లేకనే ఈ ప్రశ్నలకు తగు సమాధానములు తట్టునేమో చూతము?

లోక సంగ్రహణార్థమునకై వెనుకటివారు వారికి తోచిన విధముగా గ్రంథములను వ్రాసిరని యనుకొందము. వారు వ్రాసినవి మనకు ప్రమాణమైనప్పుడు వారికిని అవి ప్రమాణములే గదా? అటులనే మనకు దోచినట్టివి మనకును ప్రమాణములని దోచుచున్నవి.

నేనెవరిని? యని మనలోనొకరు ఇంకొకరిని అడిగినప్పుడు అడిగిన దాని సంగతి అడుగబడిన వాని కెట్లు తెలియను? అను ప్రశ్న రాదా! నేనే తెలిసికొందునని నిర్ధారించుకొన్నచో కొంత ప్రయోజన మున్నది.

ఆహార – భయ – నిద్రాదులు గలిగిన నాకు, పశుసామాన్య బుద్ధి కలిగిన నాకు 'నేనెవరిని' అను ప్రశ్న తట్టనే తట్టదు. ఒకవేళ తట్టినను సరియైన సమాధానము ఎప్పటికిని రాదు. ఒకవేళ తోచినను అయ్యది సర్వ అవలక్షణములతో నుండును. ఎందుకన మానవబుద్ధి సంకుచితము. అనేకాభిమానములతో గూడి యుండును. అది కొంత పరిమితి గలది. ఆ హద్దుల మధ్యనైతే అది ప్రచండముగ విహరించగలదు. ఐన ఈ ప్రశ్నల వలన ప్రయోజనమేమి? అప్రయోజనములైన

ప్రయోజనములు బుద్ధి హీనములు. కాని అవి అట్టివిగా దోచుట లేదు ప్రతి జీవియందును కాలానుసరణముగ ఇట్టి సందేహములు తీవ్రరూపమును దాల్చును. అట్టి సమయమున నతడు తీవ్రమైన విచారణమున మునంగక తప్పదు. ఏ పనియైనను తరచి తరచి తీసిన నవనీతము వలె మదించి చూడవలెను. ఎందువలననో నాకీ జ్ఞాన తృష్ణ గలిగినది. జ్ఞానమును అమృతముచే తడుపబడితేగాని, నీ తృష్ణ తీరు సాధన మింకొకటి లేనేలేదు. నాకు గావలిసినవన్నియు విజ్ఞానముచే గాని యితర సాధనలచేతగాని, సంపాదించుకొనుచు, జీవయాత్ర సాగించుకొనుచుండ, నీయసంతృప్తి గలిగినది. ఇదియే లోటువలన గలిగినదో? నా జీవితమున నీలోటు ఎట్లు తీరునో? ఏ సాధన వలన తీరునో? ఎట్టి తృప్తిని పొందుదునో విచారింతును గాక!

---

# ప్రమాణములు

నా జీవితములో నీ లోటు వలన నీప్రశ్న లుదయించినవో, ఇవి తేలిన నాకీ లోటు తీరునో? లోక వ్యవహారమంతయు ప్రతిఫలాపేక్ష పూరితమే గాని నిష్కామము కాదే! అట్టి యెడల నీ విషయము తెలిసిన నాకు కలుగు లాభమెద్ది! తెలియకున్న ననర్థమెద్ది? నేను స్థిరముగ హాయిగా సర్వమును తెలిసియుండవలెను. ఇదియే నా మనోవాంఛితము. ఇట్టి కోరిక మానవకోటి కందరకును గలుగదనుట నిర్వివాదాంశము.

పుట్టినవన్నియును గిట్ట వలయునను నియమము ననుసరించి చచ్చుట యనునది తప్పదు. ఇది నా కోరికకు వ్యతిరేకముగ నున్నది. ఈ చిత్రమైన సంఘటన నుండి తప్పించుకొని బయట పడుదునా! ఐన ధన్యనగుదును. శాంతి లభించును. దానిని పొందుటెట్లు? ఎప్పుడును తెలియని విషయమును గురించియే విచారణ ప్రారంభమగును. "పగలు సూర్యుడు ప్రకాశించు కాంతిచే సర్వము గనపడుచున్నవని తెలిసి కొందము. మేము కంటితో చూచుచున్నా మందుము. తెలిసిన దన్నచో నెట్లు తెలిసినదని ప్రశ్న వచ్చును. ఇందుకు కారణము అజ్ఞానము. దేనిచేతను పుట్టబడకపోవుటే "జ్ఞానము". అట్టి జ్ఞానము సహజముగ మనకున్నట్లు కనబడుచున్నది. "నేనెవరు? దేవుడెవరు? జీవుడెవరు?" అను ప్రశ్నలకు జవాబులు తెలియక, తెలిసికొనుటకు కావలసిన ప్రమాణములను విచారించి, తన్మూలమున తేలగల దానిని చూతము.

అంతేగాని యెవరికేది దోచిననదే సిద్ధాంతమని చెప్పుట భావ్యము కాదు. తనకు తెలియనది, ఊహించినది, వేద ప్రమాణములను గూర్చి విన్నది, చదివినది, వీనిని తనకు తెలిసినట్లుగా భ్రమింపగూడదు. వీని

భావములను విడమరచి ఒకొక్కదానిని విమర్శించిన గాని తెలియుట అను స్థితికి రాజాలము. మానవ జీవిత విధానములో ఎన్ని లోపములున్నను, చక్కగా నున్నటులనే గనిపించును. ఈ తప్పుడు సిద్ధాంతములతో అనేక జన్మలు కలుగ వచ్చును. ఇవి తప్పులను విషయమును కొన్ని జన్మల తరువాత గాని తెలియరాదు. అజ్ఞానము, పూర్వజన్మ సంస్కారము ఇందులకు కారణములు. అజ్ఞానమనిన తెలియని స్థితి, జ్ఞానమనిన తెలిసిన స్థితి. వికారములను పొందుట మనస్సు యొక్క స్వభావము. మనస్సు తెలిసిన స్థితియందైనను, తెలియని స్థితియందైనను హాయిగా నుండగలదు. అంతేగాని తెలిసి తెలియని స్థితియందు మాత్రము నిలువజాలదు. మనస్సు తెలియకపోయిన తెలియని ఆకారమును బొందును. తెలిసినచో తెలిసిన యాకారమును బొందుచుండును. ఆ రూప విషయమునే "కామ, క్రోధ, లోభ, సుఖదుఃఖ, ధర్మాదులు". మనో వ్యాపారమునకు విషయ సత్యాసత్యములతో నిమిత్తము లేదు. సందిగ్ధ స్థితియందు ఏ మాత్రముండ జాలదు. సందియములు కలుగగనే, మనస్సు విచారణకు దిగును. కాని, సవ్యమా, అపసవ్యమా యనుదానితో నిమిత్తము లేదు. అదియే సందిగ్ధావస్థ నుండి బయటకు రావలెను. ఇది మనస్సు యొక్క ఒకానొక స్వభావము. కాన మన విచారణ సవ్యముగ జరుగవలెను. ఇట్లు జరుగవలెనన్న ఏదో యొక ప్రమాణమునకు కట్టుబడవలయును. ప్రమాణము లేని విచారణ అప్రమాణముగనే యుండును. మనస్సు ప్రత్యక్ష విషయములను చేరదీసి ఆలోచించి విచారించుట యందు గడు నేర్పరి. కాని ఆ ప్రత్యక్ష విషయములగు ఆత్మ, దేవుడు, దేవతలు, స్వర్గ నరకాది విషయముల యందు మనకు గల విజ్ఞత పనికి వచ్చు నటుల దోచుట లేదు. కాని యొక్క మార్గము గోచరించుచున్నది. ఆ మనస్సునే ఇట్టి అప్రత్యక్ష విషయ విచారణ యందుపయోగపడునటుల సంస్కరింప వలయును.

అట్లు చేసుకొను ఉపాయ ప్రక్రియనే ఆధ్యాత్మిక విద్యా విధాన మందురు. ఈ విద్యా విధానము వలన మనస్సు రాగాది మలిన వాసనలు తొలగించుకొని శుద్ధసత్వ ప్రధానముగా గలదగును. ఇట్లు వస్తు యదార్థ జ్ఞానము, ప్రమాణముల వలన పొందనగును.

ఎవరేది చెప్పినను "నీ కెట్లు తెలిసినది?" అను ప్రశ్న బయలుదేరును. కాని, విషయములు తెలియకున్న "నీ కెందుకు తెలియదు" అను ప్రశ్న లేనేలేదు. నా సంగతి గాని, దేవుని సంగతిగాని, లోకము సంగతి గాని నాకు తెలియదనినచో తెలుసుకొనుమని కొందరు బోధింతురు.

ప్రమాణమనగా నేమి? దీనికేది ప్రమాణము? ఆ విషయమును గ్రహించుటకు ముఖ్యము – ప్రత్యక్షముగా జూచుటయే. వీనికి ఆరు ప్రమాణములు ఆధారములు.

1. ప్రత్యక్షము 2. అనుమానము

3. ఉపమానము 4. శబ్దము

5. అర్థాపత్తి 6. అనుపలబ్ధి

ఇందు శబ్ద ప్రమాణము ముఖ్యము. ప్రమాణములనగా కొలుచు పనిముట్లు. గజము, మూర, కుంచము, మరకము, శేరు, తులాదులు అటులనే ద్రవ్య ప్రమాణములను – ఆత్మ, దేవుడు, జీవుడు, స్వర్గము, నరకము, భూతము, ధర్మము జననము, మృత్యువు అను శబ్దములను తెలియజేయునదియగు గ్రంథములను ప్రమాణములనవలయును. విషయ సత్యా సత్వములరయుట కొరకు ప్రమాణము లావశ్యకములని గ్రహించనగును. అందు శబ్దమే ముఖ్య ప్రమాణము.

# కొన్ని సందేహములు

జ్ఞానమునకు శబ్దమొక ప్రమాణమని తెలినది. కాని కొన్ని శబ్దములు మాత్రము బహుసందేహములలో బడవైచుచున్నవి. "నిత్యము" అను ప్రమాణమును తీసుకొందము. మనకందరకును నిత్యముండవలయునను కోరిక గలదు. "నిత్యము" అనగా ఎల్లప్పుడు నుండునది. త్రికాలముల యందును గలదు. అట్టి వస్తువును నిత్య వస్తువనదగును. మన యనుభవములో నిట్టి వస్తు వెచ్చటను గానరాకున్నది. ఇంకొంచము విచారించినచో "సర్వమును అనిత్యము" అని తేలుచున్నది. నిత్య వస్తువును మన మెరుగమే!

ప్రతి జీవికిని శాశ్వతముగా నుండవలెనను కోరిక యున్నది. పుట్టి పెరిగి చచ్చుచున్న భూతకోటిలో మనమును నొకరమేయై యుంటిమి. నియతి నియమ విరుద్ధముగా మనకు నిత్యముండ వలయునను కోరిక ఎందుకుండ వలయును. అది (ఎందులకు) ఎట్లు కలిగినది. ఇందు కనుగుణముగా "నీవు నిత్యుడవు. మృత్యు రహితుడవు" అను శబ్దములు కొన్ని వినబడు చున్నవే? వాతావరణమున అనేక శబ్దములు గలవు. కాని అన్నియు నందరకు వినబడవు. ఎవరికి కావలసినవి వారికి వినబడుచున్నవని సమాధానము పొందవచ్చును.

నా కోరికకు భిన్నముగ మృత్యువొకటి నన్ను తీసికొని పోవనున్నదే. నాకు చావవలయునని లేదే! ఇటువంటి సందేహములలో నన్ను బడవేయు చున్నదే! చచ్చునది నేనేనా? కాదా? నేను కాని యెడల చచ్చునదేది? నేను చచ్చిన పిమ్మట నుందునా? ఉన్న నెట్లుందును? చచ్చుటనగా నేమి? ఏది చచ్చును? మొదలగు సందేహములు

దయించుచున్నవి. జ్ఞాన, అజ్ఞానములు పూర్తిగా తెలియపోవుట వలననే గద ఇంతటి విమర్శ కలిగినది. శాస్త్ర శబ్దార్థము నా యజ్ఞనమును బారద్రొలి యదార్థ జ్ఞానమును నొసగ నభయమిచ్చుచున్నట్లు దోచుచున్నది. ఇందలి సత్యాసత్యములు చక్కగా విచారించిన గాని తెలియబడవు అంతట గాని నా సందేహములు వీడవు.

# నా సందేహములు

'నేనెవరిని' అను ప్రశ్నకు మూలకారణము నా కోరికయే యని తెలినది (తెలియవచ్చినది) ఈ సృష్టిలో ననేక విషయములుండగా ఈ నేనును గూర్చియే ప్రశ్నింపనేలను. ఆత్మానాత్మలు బ్రహ్మము దేవుడు (జీవుడు) ప్రకృతి మాయ యను విషయములుండగా రాజమార్గమగు శాస్త్రములను పఠించి జ్ఞానము నార్జింపుము అనునవి యెన్నియో యుండగా ఈ నేను అను ప్రశ్నయుదయించుటేమి? నిన్ను నీవు తెలిసికొనుము. ఆత్మను గురించి వినుము. ఆత్మానుభావము గలిగిన మోక్షము గల్గును.

అనుటనుబట్టి ఆత్మ విచారణమే ముఖ్యమని తేలుచున్నది. "సర్వం విజ్ఞానం భవతి'' యను మహావాక్యముల చేత నన్ను నేను విచారించుకొనుట యనివార్యమని తోచుచున్నది.

జన్మ కర్మచమే దివ్యం క్షేత్రజ్ఞంచాపిమాంవిద్ధి అహం త్వా సర్వపాపేభ్యో మోక్ష ఇష్యామి ఇత్యాది భగవద్వాక్యములలో గూడ నేను అనియే సంబోధించిరి. నేను సీతను, నేను పార్వతిని అని ప్రతి జీవియు తన్ను నేను నేనయే వ్యవహరించు చున్నారు. ఇంద్రాది దేవతలు గూడ నేనింద్రుడను. నేను వాయువును, నేనగ్నిని అని వ్యవహారికములు గలిగినట్లు శాస్త్ర ప్రమాణములు సూచించు చున్నవి. నామ రూపములలో భేదమున్నను నేననునది మాత్రము మారుట లేదు. నేనెవరిని అని విచారించుచున్నప్పుడు అందరిలోనున్న నేనును గురించియే తలంచు యత్నమని తేలుచున్నది.

తేజస్సు నేను. శబ్దము, ఆకాశము త్రిమూర్తులు, సూర్యుడు,

చంద్రుడు, వృక్షములు, పక్షులు, కాలము, దేశము, మృత్యువు నేనే. సర్వమును నేనేయని తెలుపుచున్న పరమాత్మను గురించి విచారించుచుంటిమన్న మాట.

అదియే నీవు అని చూపించుచున్న విధమున తత్త్వమసి యను మహోపదేశ శబ్దము ఒకటి వినపడుచున్నది. యేనేనను స్వానుభవమును బొందినచో నేనెవరినను ప్రశ్నయు తద్విచారణయు సార్ధకమగును. అట్టి యనుభవమును బొందిన వ్యక్తి ధన్యత్వమును బొందునే కాని మరేమగును?

"స్వవిమర్శో మోక్ష" అనునట్లు తన్నుతాను విచారించు కొనుటయే మోక్షమార్గమని పెద్దలు చెప్పుదురు. ఎంతటి శాస్త్రజ్ఞుడైనను స్వతంత్రముగా బ్రహ్మజ్ఞాన అన్వేషణకు బూనుకొనరాదు. గురు పరంపరగా ఆచార్యు నాశ్రయించి, నమస్కరించి సేవచేయుచు ప్రశ్న పై ప్రశ్నను వేసి విజ్ఞానమును తెలిసికొన వలెను. ఇదే శ్రుతిస్మృతుల ప్రబోధము.

నేనెవరు, దేవుడెవరు, జీవుడెవరు యను అంశము లందును సర్వసందేహములు నిబిడీకృతమై యున్నవి. సౌకర్యార్థము వానిని రెండు భాగములుగా విభజించు కొనవచ్చును. అదెట్లనిన ఒకటి నేనెవరు అను దానికి సంబంధించిన విషయము. రెండవది నేనుకాని దానికి సంబంధించినది. మొదటిది ఆత్మ, రెండవది అనాత్మ అని శాస్త్ర పరిభాష.

నేను పగటి యందు సంచరింతును రాత్రులందు నిదురింతును. నిద్రలో కలలను కందును. ఇదే చర్విత చర్వణముగా సాగుచు చివరకు చనిపోదును. నాకు గల జ్ఞానమును బట్టి చూడగా నేను పుట్టిన పిమ్మట నుంచే వ్యవహారము ప్రారంభమగునని తోచుచున్నది. నేను పుట్టక పూర్వముంటినా, ఎచట నుంటిని? చచ్చిన పిమ్మట నేనుంటినా? ఈ దేహమున్నదా? దేహాదులకు భిన్నముగా నేనుంటినా? మనస్సనగా నేమి?

తెలియుట తెలియకపోవుట ననేమి? యను సందేహము లనేకములు గలవు.

ఈ సృష్టి యెందులకు? నేనెవరు? ఎందులకు సృష్టించిరి? దేశము వస్తువులు, ద్రవ్యము లనగనేమి? కర్మయన నేమి? ఇవన్నియు నశించిన నేనుందునా? యను ప్రశ్నలు రెండవ భాగమునకు చెందినవి. ఇట్లుగా రెండు భాగములనుట సౌకర్యార్థమే.

నేను నిశ్చయముగ నున్నానా? ఉన్నానా? లేనా? అను సంశయము లేదు. నేను లేని యడల ఈ సంశయించుచున్న దెవరు? కాబట్టి ఎట్టి సంశయము లేక తేలినదేమనగా ఇట్టి సంశయములు కలుగుటకు కారణముగా నేనొకడనున్నాను. ఉన్నాను. ఉన్నాననునది మాత్రము నిజము. ఇదియే జీవస్వరూపము. జీవుడనగా నితడే. నేనున్నాను యని యనుట ప్రతిజీవియు నమ్మును. నమ్ముచున్నారు. తాను లేనని యెవరును అనరు. ఇది స్వయం సిద్ధము. అన్య ప్రమాణాధారము మాత్రము కాదు. కావున నేనున్నాను.

ఈ ప్రశ్నలన్నియు నా యజ్ఞానము వలన కలిగినవియే గాన నాకజ్ఞానము సహజముగా గలదని యొప్పుకొనక తీరదు. అట్టి అజ్ఞాన మూలముననే సందేహములు జనించుచున్నవి. వాని నివారణోపాయము మనమన్వేషించ వలయును. ఈ చిక్కునుండి మొదట బుద్ధిని విడదీయుట నా ప్రధమ కర్తవ్యము. ఇందుకు బుద్ధియే సాధనము, యుక్తి ఖడ్గము. శాస్త్రము యొకపిడిరాయి. బుద్ధితో విచారించుచు యుక్తి యను ఖడ్గముతో సంశయములను భేదించుచు శబ్ద ప్రమాణముల ననుసరించి భావముల నేర్పరచుకొనునది సరియగు విచారణ మార్గము.

విచారణకు ముందు పెద్ద అభ్యంతరములు గలవు. అందు మొదటిది మన యహంకారము. "ఈ ప్రపంచమెంత? మన బుద్ధి

యెంత?" యను భావము మనలను విమర్శలకు బూనుకొన నివ్వదు. లోకములందలి బుద్ధులను నడుపుచున్న యొక గొప్ప బుద్ధి గలదని యనునదియే శాస్త్రమని స్ఫురింపజేయకున్నది. ఈ యడ్డంకియే "అభిమానము'. ఇది యెందులకు గలదు? ఎటుల కలిగినదో? యను విచారణకు బూనుకొనలేకున్నాము. ఇక రెండవ యడ్డంకి. మన భావములపై మనకు గల యభిమానము మొదటిదియగు "సహంకారము" ఇట్టి వానినన్నిటినీ మూఢ విశ్వాసములని మన బుద్ధితో నావలకు నెట్టి ఆహార భయ నిద్రాదులే పరమావధిగా భావించి తాపత్రయ పడుదుము. మానవుడు చచ్చుటకైన నిష్టపడును గాని, తత్వ విచారణకు మాత్రము దిగడు. ఇందులకు గారణము జీవుడు కామమే స్వరూపముగా గలవాడు. అన్నమయ కోశమే తానని నమ్ము చున్నాడు. ఆ కోశము నుండి తెప్పరిల్లి మనోమయ కోశదాదాత్యము చెందియున్న యెడల నెంతయో కొంతయైన దయ, శ్రద్ధ, విశ్వాసము లతనిని జేరును.

మనోమయ కోశమును దాటుటనునది బహుకష్టము. ఎందువలనన, మానవుడు ఏదో యొక దేహముతో నున్నగాని తానున్నటుల భావింపలేడు. ఇది అతని నైసర్గిక లక్షణము. అందువలన మానవుడు లౌకికముగనో వైదికముగనో కర్మప్రవృత్తి ననుసరించును. గాని విచారణోన్ముఖుడు కాజాలడు. మన బుద్ధిని విచారణాగ్నిలో బడవేసిన గాని సరియైన విచారణకు రాజాలము. విచారణ యనునది అభిమాన రహితము. నిష్పక్షపాతము నయిన గాని సత్యాసత్యములు తెలియబడజాలవు. ఇందుకు నా వ్యవహారము పరస్పర విరుద్ధముగా నున్నది. ఇంతకన్న నాత్మ వంచన ఇంకొకటి గలదా? వీనిని సవరించుటెట్లు? ఇతరుల ఆలోచనలేమైనా ఉపయోగపడునేమో చూతము.

---

# త్రిమత సిద్ధాంతములు

ఇట్టి సిద్ధాంతముల నివారణార్థముగా ఇతరుల భావములు గూడ విలోకింతము. వీనినన్నిటినీ సమకూర్చి చూచినచో మూడు విధములుగా విభజింప బడినది. అవి ఇవియే.

1) చార్వాక సిద్దాంతము.

2) వైదిక సిద్ధాంతము.

3) అవైదిక వైదిక మిశ్రమ సిద్ధాంతము.

మొదటిదగు చార్వాక సిద్ధాంతము మనకు ప్రత్యక్ష ప్రమాణమే.

## చార్వాక సిద్ధాంతము

జీవుడు – దేవుడు – జననము – మరణము – స్వర్గము – నరకములు వట్టి భ్రమయే. మనమెచ్చట నుండి వచ్చితిమి యనునది కూడ వట్టి భ్రమయే. ఎట్లు వచ్చినను ప్రస్తుతమున్నాము ఇది సత్యము. చచ్చిన వెనుక నేమగుదము? చచ్చినవారెవరును తిరిగివచ్చి తమ యనుభవములను చెప్పి యుండలేదు. ఇప్పుడున్నామను దానిని త్రోసివేయ జాలము. ముందు సంగతి మనకు తెలియదు. వర్తమాన కాలమే మన దృష్టి పథమున నున్న విషయము. మనము వాంఛించునది సుఖము. సుఖము అసంభవము. మన యాదర్శము – ఆహారము – నిద్ర – మైధునము – అనునవి నివారింపరానివి. ఏ విధముగా నైనను వీనిననుభవించుటే జీవిత ప్రయోజనము. ఇందులకు యెట్టి శాస్త్రోపదేశము గాని, సిద్ధాంతములు గాని నిమిత్తము గాని లేదు. మానవుడు భూత సంఘాత జనితుడు. ఈ భూతముల సంకలము

వలననే బుద్ధియను తత్వము ఒకటి ఏర్పడినది. ఇదియే 'ఆత్మ'. దీనిని తృప్తి పరచవలెను. మానవుడు చచ్చిబూడిదయైన తరువాత మిగులునదేది? అట్లు మిగులు ననుటకు సాక్ష్యము లేవి? చచ్చిన పిమ్మట జీవుడుండుననిన, బ్రతికినంత వరకును ప్రేమతో జూచుకొనిన పుత్ర మిత్రాదులను జూచుటకు ఒక్కసారైనా రారేమి? అట్లు జరుగుట లేనందున చచ్చిన పిమ్మట సర్వము శూన్యమగు నని తోచుచున్నది. వీనికి భిన్నములగు (కారణములు) ఊహా నిర్మితములై యున్నవి. ఈ కనబడు దేహమే ఆత్మయను ఇట్టి సిద్ధాంతమే కొందరి మతము. అందువలననే బ్రతికి యున్నంత వరకును ఋణమైనను జేసి భోజన పానములు సాగించవలయునన్నదే మానవ ధర్మము. ఇదే చార్వాక సిద్ధాంతము.

## రెండవది - అవైదికము.

ఇది మానవుడు కేవలము ఆహార భయ నిద్రాదులే గలవాడు కాదు. కామ క్రోధములు - సుఖదుఃఖాదులు - మంచి చెడులు - బుద్ధి యాలోచనలు అనుభవములు గూడ గలవాడు. లోకమునందు కాలముతో సమానమైన విలువ గల వస్తువు ఇంకొకటి లేదు. ధనాదులు పోయిన తిరిగి సంపాదించుకొనవచ్చును. కాని కడచిన క్షణము తిరిగి సంపాదించుకొనలేడు. అట్టి కాలమే విలువైన ధనము. దానిని శంకలతో గూడియున్న విషయములందు దుర్వినియోగము చేయరాదు. మానవుడు జవ సత్వములను నిర్వీర్య మొనర్చుకొని ప్రతి విషయమునకు 'ప్రారబ్ధము నొకదాని నంటగట్టి పురుష ప్రయత్నమును విడచి సోమరుడగుట చిత్రము. మనకు కష్టములను త్రోసివేసి, సుఖముల ననుభవించ వలెనను కోరిక యున్నది.

సృష్టిలో కష్టసుఖములు రెండును గలవు. గులాబి చెట్లకు ముండ్లు

గలవని పుష్పముల నేవగింతమా? కష్టపడి ఆహారాదులు సంపాదించి అనుభవించ వలెను. ఎన్ని వేదాంతములు చదివినను, వినినను (భోజనము చేసినగాని) ఆహారము తీసికొన్నగాని ఆకలిబాధ నివారింప బడదు. 'కష్టేఫలీ' అనునట్లు కష్టపడి ఫలము ననుభవించవలెను. ఇతరుల కష్టములపై ఆధారపడరాదు. అందుకే మానవులు అల్ప జీవులని కష్టపడకుండా సుఖమును కోరుదురని జీవకోటికి కొన్ని నియమములు ఏర్పాటై యున్నవని గమనింపుడు. యితరాహార జీవులుగా జీవింపరాదు.

ఇంకొక విషయము ప్రాణికోటి కంతటికి జీవించడానికి ఆహారం కావాలి. ఆయా ప్రాణులు తాముండే పరిస్థితులను వాతావరణ స్థితుల ననుసరించి వానికి తగినట్లు ఆహారాన్ని పొందే యేర్పాట్లను భగవానుడేనాడో చేసి పెట్టాడు. అయినను భగవానుడిచ్చిన దానితో మనకు తృప్తి లేదు. ఎవరికి తగ్గ ఆహారం భగవానుడే కేటాయించినా తృప్తి తీరక అన్యజీవుల ఆహారాన్ని కూడ అన్యాయంగా ఆక్రమించి అనుభవించడం మానవులు చేస్తున్న 'దౌర్జన్యం'. పోనీ తనకి తగినంత తిని వదలితే ఫరవాలేదుగాని అంతా ప్రోగుచేసి కూడ బెట్టి తను తినక ఇతరులకు బెట్టక, చివరకు చిటుక్కున గుటుక్కు మంటాడు. ఎంతమంది ఆహారాన్ని తానపహరించినా, శాశ్వతంగా బ్రతికిపోవడం అసంభవమని తెలుసును. అయినా ఉన్న కాస్త కాలంలో ఎందుకో యింత ఆశ! తెలియదు.

జీవులు – దేవ, మనుష్య, తిర్యక్, స్థావరాలని నాలుగు రకాల శరీరాలతో ఉంటాయి. ప్రకృతిలో ఈ నలుగురికి బ్రతకడానికి ఆహార నియమాలున్నాయి. దేవతలు తేజ శ్శరీరులు కనుక వారికి తేజో ద్రవ్యాలైన ఘృతము ఆఘృతాల వల్ల వర్ధిల్లే వాక్, తద్వారా వెలువడే మంత్రములు వారికాహారము. మనుష్యులు తిర్యక్కులు = జంగమములు అని పిలువబడతాయి. ఇవి నిలువుగానో, అడ్డముగానో తిరుగుతుంటాయి.

కనుక స్థావరములలో కూడ ప్రాణము కలిగియు తిరుగలేనివి కొన్ని ఉన్నాయి. అవి లతలు, పొదలు మొదలైనవి.

ప్రాణమే లేక కదలక పడి యుండేవి రాళ్ళు – కొండలు – గుట్టలు ఇత్యాదివి. వీనిలో తిరిగే ప్రాణులకు తిరగని ప్రాణులలో కొన్ని ఆహారమని నిర్ణయం. అంటే మనుష్యులకు, జంతువులకు కూడ చెట్లనుండి లభించే కాయలు, కూరలు, ఆకులు (ధాన్యం దినుసులు) ఇత్యాదులన్న మాట. తిరగని ప్రాణులైన చెట్లు మొక్కలు మొదలైనవాటికి ప్రాణంలేని నీరు–గాలి – వేడి మొదలైన ప్రకృతి ద్రవ్యాలు ఆహారం. ఈ నియమాన్ని దేవతలు పాటిస్తున్నారనే అనవచ్చు. వారు మనకు కనుపించరు గనుక వదిలేద్దాం.

చెట్లు మొదలైన స్థావరాలు తమకాహారమైన నీరు, గాలి, వేడి ఇత్యాదులనే గ్రహిస్తున్నాయి అని మనకు తెలుసు. తన ప్రక్కనే యున్న మ్రొక్క మరో మ్రొక్కను ఎప్పుడూ హింసించదు. ఒకవేళ ఆహారం దొరక్కపోతే అలానే ఎండి పోతుంది గాని బలవంతంగా మరొకరి ఆహారాన్ని ఆశించదు. పోతే ఈ జంగమములలో అందులో 'తిర్యక్' (జంతువు)లను చూస్తే వారి ఆహార నియమాలకి అవి కట్టుబడి, ఆకులలములు తినే మేకనుండి ప్రారంభిస్తే పెద్దదైన ఏనుగో, రినో అనే జంతువులు కూడ సాధు జంతువులని పిలుస్తారు. సింహం మొదలైన వానిని క్రూర జంతువులంటారు. వానిని దగ్గరకు రానీయ్యం. అలానే మనుష్యులలో కూడ నియమానుసారంగ ఆకుకూరలు, కాయధాన్యాలు తినేవారిని శాకాహారులంటాము. (సాధుజంతువు లన్నట్లుగా) మరో జీవులను హింసించి నియమ విరుద్ధంగా ఆహారాన్ని ఆర్జించి తినే మాంసాహారులను ఏమని పిలవాలి? సింహం మొదలైన పై వాటినన్నట్లే, వీరిని కూడ క్రూర మృగాలు అనవచ్చా? లేక వీరు జంతువుల కన్న కాస్త ఎక్కువ స్థితిలో నున్నారు కనుక 'రాక్షసులు' అనడం ఉచితం –

సమంజసం, అని భావిస్తాను.

మరొక ముఖ్య విషయం. కొందరు చెట్లనుండి ఆకులు, పూవులు, కాయలు కోయడం మాత్రము హింసకాదా? అనుచున్నారు. కాని అది హింస కాదనే సత్యాన్ని తెలుసుకొందాము. చెట్లు ఆకులను పూవ్వులను – కాయలను కూడ యిస్తున్నాయంటే తమలో ఉండే అధిక భాగాన్ని విడుదల చేసి పంపేస్తున్నాయన్నమాట. మనిషి తనలో తయారైన ఆహారంలోని సారాన్ని గ్రహించి, చెత్త వ్యర్థ పదార్థాలను మల – మూత్ర – స్వేద రూపంలో విసర్జించి వేస్తున్నట్లే చెట్లని తమలోని అధిక భాగాన్ని ఆకులుగా, పూవులుగా కాయలుగ బయటకు పంపేస్తాయి. వాటిని మనం కోసివేస్తే అవి మరింత ఆరోగ్యంగా పెరుగుతాయి. అట్లు కోయక పోయినా రెండు మూడు దినాలలో క్రమంగా పండివాడి, ఎండి రాలిపోతాయి గూడ! కనుక మనుష్యులు తినే శాకాహారాన్ని వృక్షాదులు విసర్జించే వ్యర్థ అధిక భాగాలేనని జ్ఞాపకముంచు కోవలెను. మనకు అది హింసలో చేరదు అని గ్రహించవలెను.

ఎన్ని వేదాంతములు చదివినను ఒకరి నొకరు ప్రేమించుకోగలిగిన మానవులందరు సమానులు. వీరిలో హెచ్చు తగ్గు లుండరాదు. కామాదులను తగ్గించుకోవలెను. ఒకరి ఆస్తిని ఇంకొకరు హరించరాదు. సమాజ జీవనమున కనువగు, సిద్ధాంతములను కొందరు సిద్ధాంత కర్తలు నిర్మించిరి. ఈ సిద్ధాంతములు మానవ బుద్ధినే ప్రమాణముగా ఉ పయోగించుట వలనను, ఆ సిద్ధాంతములు (బుద్ధి) దైవాది, సంబంధ రహితముగ నుండుట చేతను, దీనిని "అవైదికము" అని చెప్ప నొప్పును. ఏలనననిది మానవ నిర్మితము. నిన్నగనబడిన భావములు ఈ రోజున తప్పుగా గనిపించును. భౌతిక శాస్త్రమునకెట్లు నిలకడలేదో అట్లే బుద్ధి ప్రమాణమునకును మన భావములే నిలకడలేనట్లు ఋజువగు చున్నది. ఈ బుద్ధి మార్పులే మానవాభివృద్ధిగ భావించుటయు. ఇదే విశాల

భావముగ నెంచుటయు మున్నగునవి గలదగుట చేతనే. రెండవది యగు "అవైదిక సిద్ధాంతము".

ఈ పైన ఉదహరించిన రెండు సిద్ధాంతములను పరిష్కరించుకొని వాని లోపాలను సరిదిద్ది దైవాది సంబోధనలను జత పరచి వ్యవహరించునది మూడవ సిద్ధాంతము.

ఈ సిద్ధాంతము సమంజస మగును. యుక్తి సిద్ధముగను - యదార్థముగను బాహ్యామునకు గోచరించును. మానవుడు మాంస- చర్మ- అస్థి (రక్త) నిర్మితుడు మాత్రమే గాడు. సునిసితమైన బుద్ధియును గలవాడు. దానిని ఉపయోగపరచి, ఎంతటి కార్యమునైనను చేయుచున్నాడు. ఐనను లవలేశమైనను తృప్తి పొందలేకున్నాడు. అతని హృదయము అశాంతికి సరియగుచున్నది. సుఖమును ఎంత మాత్రమును పొందుట లేదు. పౌరుషమొక్కటే తన కోర్కెల దీర్చ జాలదనియు తన అహంకారము మమకారములు తన వాంఛితములను తీర్చక ఇంకను ఆపదల బడవేయున వనియు, ఇదంతయు తన నిస్సహాయత వలన ననియు, స్ఫురించుట వలనను ఘటమునకు కుమ్మరియు, పటమునకు తంతువాయుడును నున్నటుల ఈ జగత్తునకు కారకుడొకడుండి తీరుననియు నాతనిని ఆశ్రయించిన తన మనోభీష్టము నెరవేరునేమో యని తలచుచున్నాడు. ఈ చిత్ర విచిత్ర నిర్మాణమును చేయ సృష్టికర్త యొకడు కలడు. ఆ దయామయుడు సర్వజ్ఞుడు - సర్వశక్తి మంతుడునై యున్నాడని ఆతనినే పలు విధముల పేర్కొనుచున్నారు. కృష్ణుడని, శివుడని - అల్లాయని, క్రీస్తని కొందరనుచున్నారు. ఇది నామ బేధమేగాని, వస్తు బేధము కానేకాదు. ఏ మతము చెప్పినను దేవుడొక్కడే యనియు ఏకోనారాయణ్ణ ఆ దేవుని ప్రార్థింపుమనియు - సత్యము అహింస దయా గుణములు గలిగి యుండవలెననియు, కర్మకాండలు, అర్ధ రహితము లనియు, సోమరి తనమును విడువవలె ననియు దేశసేవ

ముఖ్యముగ చేయవలయు ననియు చెప్పబడినట్టి "ఈ సిద్ధాంతము"నే నిజమైన విజ్ఞాన మనియు కొందరు నిశ్చయించి, మనోజ్ఞమగు హేతుభూతముగ సిద్ధాంతీకరించిరి.

ఈ సిద్ధాంతమునకు పూర్వపర జన్మల ప్రసక్తి లేదు. అందుచే "అవైదికమనియు" కొంత దైవాది సంబంధ ముండుటచే "వైదికమనియు" వైదిక అవైదిక మిశ్రమ మని పేర్కొనబడినది. ఇది మహాలౌక్య సిద్ధాంతము. ఇట్టి వివాదములకు లోబడకుండా సౌకర్యము కొరకు సత్యమును మరుగు పరచుట తటస్థించినది. అందుచే దీనిని "ద్వైత సిద్దాంతము" అనవచ్చును (మిశ్రమము).

# ధర్మము - (వివేకము)

మానవ జీవితము ఐహిక ఆముష్మికముల మిళితము. అందు అముష్మికమును విస్మరించి కేవలమైహికములనే మానవ బుద్ధితో నుపయోగించు నంతకాలము తనకుగాని, సంఘమునకు గాని శాంతి భద్రతలు చేకూర జాలవు. సృష్టితంత్రము ధర్మాధర్మ, సుఖద్ణుఖాది పుణ్యపాప శీతోష్ణాది ద్వంద సమన్వితము. సృష్టి నుండి అధర్మమును పూర్తిగా నిర్మూలించుట సాధ్యము కాని పని. మానవ ధర్మము యొక్క యుత్కృష్టతననుసరించి యధర్మము సన్నగిల్లును. ధర్మాభివృద్ధి పొందు చుండును. కాన 'ధర్మమును' విసర్జించరాదు. ధర్మాభివృద్ధికై మానవుడు తన ధర్మమును తాను మొదట గ్రహించవలెను. ఆ ధర్మము ననుసరించియే ధర్మ స్థాపన యేర్పడును. స్థానభేదము ననుసరించి ధర్మము మారుచుండును. కావున మొదట నేను "మనుష్యుడను" అని తెలియుట సగము సత్యము. అప్పుడు పశుధర్మము లేవియో మానవ ధర్మము లేవియో తెలిసికొను నవకాశమేర్పడును. నేను స్త్రీని కాను, పురుషుడను అని తెలియవలెను.

అహింసా భూత దయాది నియమములు (ధర్మములు) సర్వ వర్ణ సామాన్య నియమములు. ఇవి కేవలము మానవుని జంతు సముదాయము నుండి కేటాయింపుచేయు సూత్రములని గ్రహించవలెను. ఇటులనే మానవజాతి ఏక రూపమైనను వర్ణాది బేధముల మీద నాధారపడి యున్నదని గ్రహించుటయు యుక్తము. ఇంక "వివేకము". ఈ జన్మకు పూర్వమునే పొందిన నరకబాధగాని తల్లిదండ్రులకు జననమగు వరకు నేబడిన బాధ (పాట్లు)గాని అనుభవించిన బాధలు గాని నామమాత్రమైనను గుర్తుండక పోవుటయే నాయధేచ్ఛా

వర్తనమునకు హేతువగుచున్నది. నాకవి గుర్తు లేవని కూడ తెలియదు. ఇది జన సామాన్యము. ఇక నాకా విషయము తెలియుటెట్లు? విజ్ఞానము కలుగ జేయుటకు ఇక "కులకక్షి" శాస్త్ర మెయ్యది అలవడ దెవ్వనికి వాడెయంధుండు జగతిన్" అనునట్లుగా శాస్త్రము ఈ విషయములో నేమి చెప్పు చున్నదో తిలకింతము. "క్షీణేపుణ్యేమర్త్య లోకే విశంతి" చేసిన పుణ్యము తరగిపోగా నా జీవుడు తిరిగి మనుష్య లోకమును పొందుచున్నా "ముందాతడు స్వర్గము నుండి ద్యులోకము పొందును. అచ్చటి నుండి పర్జన్యుని ఆశ్రయించి వర్షముల ద్వారా భూమిని చేరును. భూమి నుండి ఔషధుల ద్వారా పండిన మనము తినుచున్న ఆహార పదార్థముల ద్వారా పురుషుని యందు ప్రవేశించును. పిమ్మట పురుషుని నుండి "జీవుడు" "రేతో" రూపమున స్త్రీయందు ప్రవేశించును. అట్లు ప్రవేశించి మాతృ గర్భము నందాతడు నవమాసములుండి బయట పడుచున్న శ్రమ జననమందలి కష్టము వర్ణనాతీతము. గర్భమునందున్నప్పుడు జీవునకు దివ్యజ్ఞానము కలిగి వెనుకటి జన్మల యందు తాను చేసిన విషయము లన్నియు గోచరింపగా తాను జనన మందిన పిదప, ఇక పాపములను జేయను. చేయరాదు యని తలంచును. భగవంతుని ప్రార్థించి బయట భూమిపై పడును. ఈ గాలి సోకినంతనే పాపమతడు సర్వమును మరచును. ఇట్టి మరపే కాబోలును నా యథేచ్ఛాచరణమునకు సకలకారణము. ఎంత చిత్రము.

జాతస్యహిధ్రువోమృత్యుః అను న్యాయము ననుసరించి పుట్టినవన్నియును చచ్చితీరును గద! కావున పుట్టుట ఎంత సహజమో చచ్చుట కూడ అంత సత్యము. కాని చావు పుట్టుక లేక సుఖముగా నుండవలయునన్నీ కోరిక బలవత్తరముగ నున్నదే! ఇదెట్లు జరుగును? ఒక్క యుపాయము తోచుచున్నది. నేను పుట్టుట వలనగదా మృత్యువు వెన్నంటుచున్నది. కాన మృత్యువు నుండి తప్పించుకొనవలయునన్న

నేను పుట్టుకనే తప్పించుకోవలయును. మృత్యువు నుండి విడుదల చేయు మార్గోపదేశము "నీవు నిత్యుడవు" అను బోధనమిదియే గదా!

భారతము నందు "ప్రపంచమున విచిత్రము అగు విషయమేది" యను ప్రశ్నకు ధర్మరాజు ఇట్లు చెప్పియున్నాడు. "మనుజుడు మరణించిన పిమ్మట నుండడని విందుము నిత్యమును మనము మృత్యువును జూతము. మనమును చత్తుము. ఇంతకన్న చిత్రమేమి కలదు. అని చెప్పెను.

"కఠోపనిషత్తునందు" నచికేతుడు యముని ప్రార్థించిన మూడవ వరము మృత్యు విషయమే.

ప్ర. మనుజుడు మరణించిన పిమ్మట నుండునా! కొందరుందురని యందురే? ఇందు సత్యమెయ్యది? ఉండుటయా లేక పోవుటయా? ఈ రహస్యమును నాకుపదేశింపుమని" నచికేతుడు యముని ప్రార్థించెను.

జ. యముడు : నాయనా! ఈ రహస్యము అభేద్యము. శాస్త్రములా సూక్ష్మాతి సూక్ష్మములు. దేవతలకు గూడ తెలియరాని విషయమడిగితివి. ఇట్టి కోరిక వలదు. నీకు మహదైశ్వర్యము నొసంగెదను. సుఖింపుమనెను.

ప్ర. అంత నచికేతుడు : ఎన్ని సంపదలు, ఎన్ని భోగములైనను తమ సంపర్కము లేనివి సృష్టిలో లేవుగదా! అట్టి మృత్యువుతో మిళితమైన "సంపదలు" నాకేల? నే కోరిన వరమునే నాకు ప్రసాదింపుడు" అని ప్రార్థించెనని యున్నది.

యోగ వాసిష్ఠమున శ్రీరాముడు వసిష్ఠునడిగిన ప్రశ్నయు నిట్టిదేను. "గురుదేవా! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులంతటి మహనీయులే కాలగర్భమున గలసిపోయిరి గద! మా బోట్ల గతియేమి? మృత్యు బారి

నుండి తప్పించుకొను మార్గమున్నదేని దానిని నాకు తెలియజెప్పుడు" అని ప్రార్థించినట్లున్నది. ఇంకొక యుదాహరణ. ఒకపరి భక్తాగ్రేసరుడగు ప్రహ్లాదుడు తోటి బాలురకు జ్ఞాన బోధ చేయనెంచి ప్రారంభముననే "బాలకులారా! రండు. మన ప్రాయపు బాలురు కొందరుర్విపై గూలుట గంటిరే? అనుచు ముందుగా మృత్యు ఘట్టమునే వారల దృష్టి పథమున నుంచెను. ఈ పైన చెప్పబడిన యుదాహరణములన్నియును మన కండ్లను దెరువ జాలినట్టి దివ్య జ్యోతులేగదా?

"నెనెవరిని" అను ప్రశ్నయుదయించుటకు ఈ మృత్యువిషయమే గద మూలము. కావున దీనిని విస్మరించుటెట్లు గలుగ గలదు. ఇట్టి వివేకము గలుగుటకు పరమేశ్వరానుగ్రహమే తప్ప వేరు గతి లేనే లేదు. ఆ దయామయుని కటాక్షము చేతనే మనకు నిత్యా నిత్య వివేకముదయించును. ఈ వివేక సూర్యోదయము చేతనే ఐహిక ఆముష్మికములను చీకటి తొలగిపోవును. అందులకే "శ్రీకృష్ణ భగవానుడు అనిత్యమ సుఖం లోకమినుం ప్రాప్య భజస్వమాం" అని పరమేశ్వరు నారాధించుమని, భక్తి ప్రపత్తుల ద్వారానే భగవంతుని జేరి నిత్యమైన ముముక్షు స్థానమును సంపాదింపుమని . మనల నాదేశించినాడు ఆ వివేక సాధన సంపత్తి గలిగిన పురుషుడే ధన్యుడు.

# మార్గాన్వేషణము - సర్వ వేద సారము

## మార్గాన్వేషణము

"చివరకు చెప్పవలసిన దొకటి కలదు" నీ ఉత్తమ సత్త్వగుణుడవు కావచ్చును. ఫలాసక్తిని వదలవచ్చును. ఐనను శరీర మున్నంత వరకు రజస్తమముల దాడి నీపై జరుగుచునే యుండును. ఈ గుణములను జయించినట్లే కొంత సేపు తోచును. కాని తిరిగి వాని తీవ్రత పెరుగుచునే ఉండును. ఇవి ప్రవాహము వలే, మనోభూమిలో ప్రవేశించి "ఘాతములను" కలుగజేయును. అందువలన నీలో యేమాత్రము తూట్లు పడకుండునట్లు గట్టి బందోబస్తును చేసికొనుము.

అన్ని విధములుగా ప్రయత్నించి ఆత్మ జ్ఞానము సంపాదింపుము, మెలకువతో మెలగినంత మాత్రమున ఆత్మజ్ఞానము కలుగదు. మరదెట్లు కలుగును? దాని కొక్కటే యుపాయము. అది నిజమైన హృదయముతో "భగవత్ భక్తి కలిగి యుండుట" ఫలాసక్తిని గూడ వదలిపెట్టుట. కాని ఇంత మాత్రమున ఆత్మ జ్ఞానము కలుగనేరదు. అది కలుగనంత వరకును "జీవితమునకు సార్థకత లేనట్లు తెలిసికొనవలెను. చివరకు కావలసినది భగవత్కృపయే." సత్య హృదయముతో చేయు భక్తి సాధన ద్వారా భగవంతుని కృపకు పాత్రులు కావలెను.

ఇది తినాలేరు మార్గమే కనబడదు. 'గీతయందు అర్జునుడు ఇదే ప్రశ్న నడుగగా భగవానుడిట్లు సమాధానము చెప్పియున్నాడు. ఏకాగ్ర బుద్ధితో, నిష్కామ భావముతో నా భక్తుడవు కమ్ము. నా సేవ చేయుము. ఈ ప్రకారము నా సేవ చేసినవాడు మాయ యొక్క అవతలి ఒడ్డును అవలీలగ చేరగలడు. లేని యెడల దుర్భేద్యమైన ఈ మాయను దాటుట

సులభము కాదు." అని చెప్పియున్నాడు. ఇది భక్తి యొక్క "సరళ మార్గము" ఏకైక మార్గము గూడాను.

## సర్వ వేద సారము

ఇదంతయు వేదముల సారమే? వేదము లనంతములు. ఈ వేదములు ఎక్కడ నున్నవి? వేదముల చరిత్ర చాల చిత్రము. ఏది వేద వృక్షమో? దేని పత్రములు వేదములో? అవన్నియు తెలియవలెనన్న చాల కష్టము. ఏ గ్రంథములలోను – సంహితలలోను వేదములు దాగి యుండలేదు. అవి విశ్వమునెల్లవ్యాపించి యున్నవి. ప్రవహించు సేలయేరులలోను సద్గ్రంథములు లభించును. రాయి రప్పలలో ప్రవచనములు వినబడుచున్నవి అని షేక్స్పియర్ చెప్పి యున్నాడు. వేదములు సంస్కృతములో గాక సృష్టిలో కూడ నున్నవని దీని భావము. సేవ చేసిన వారికవి గోచరించును. "ప్రభాతేకర దర్శనం" అనునట్లు వేదములన్నియు నీ చేతిలోననే యున్నవి. వేదములు సేవ చేయుమని చెప్పుచున్నవి. సేవ చేసి చేయి అరిగినప్పుడు "బ్రహ్మ లిఖితము" గ్రాహ్యమగును. స్వచ్ఛమైన మనస్సుతో విలోకించిన "ప్రభాతేకర దర్శనమనగా అర్ధమిదియే. జ్ఞానము, సేవ, ప్రేమ అను పునాదుల మీద "జీవిత సౌధమును" నిర్మించు కొనవలెను. అప్పుడు నీవేది చెప్పినను అదియే వేదమగును. వేదము బయటనెక్కడను లేదు. తరచి చూచిన మన ఆత్మలోననే యున్నది. అందు వలననే మహాత్ములు "వేదార్థమును గ్రహించిన వారముమేమే" యని అందురు. "వేదములన్నియు నన్నెరిగి యున్నవి. సమస్త వేదసార రూపుడను నేనే" అని గీతాచార్యులు చెప్పి యున్నారు. వేదసారమైన భక్తి యోగము"తో మన జీవితము నేకరూపముగా చేసికొన గలిగినచో ఎంత బాగుగా నుండును. దానిని మన జీవితములో ననుష్ఠించుటకు "అహర్నిశలు" ప్రయత్నించ వలెను.

ఇంతకంటె చెప్పవలసినదే మున్నది?

ఇంక రెండవ మార్గము ననుసరింతము" కర్మయే జ్ఞానము. జ్ఞానమే భక్తి. భక్తియే ముక్తి యను ననుభవమును పొందవలెనని నా కోరిక. ఉదాహరణ : బర్ఫీ ముక్క యొక్క యాకారము. బరువు, మాధుర్యము మూడును వేరు వేరు గావు. మనమా ముక్కను నోటిలో వేసికొన్న వెంటనే దాని యాకారమును తినివేసినాము. దాని బరువును జీర్ణము చేసికొన్నాము. దాని మాధుర్యమును కూడ రుచి చూచినాము. ఈ మూడు పనులను కలసియే యున్నవి. వేరు వేరుగా నుండలేదు. ఆ పనులన్నియు కలసియే ఒకేసారి జరుగును. ఆ విధముగనే జీవితములోని ప్రతి క్రియ యందును పరమార్థము నిండి యుండవలెను. ప్రతి కార్యము సేవా మయము ప్రేమమయము జ్ఞానమయము కావలెను.

"జీవితము నెల్ల పరమార్థమయము చేయుటన చాల సులభము కాని ఈ భావము ఆచరణలోనికి రావలెనన్న శుద్ధమైన భక్తి జ్ఞానములతో హృదయమును వికసింప జేసికొను సాధన చేయవలెను. అందుచే కర్మ జ్ఞానము, భక్తి యొక్క రూపములు. "అక్షరశ్ణ ఒక్కటియే. ఈ యుత్కృష్ట స్థితి లోనే "యోగము" అందురు. దీనితో జీవితము చరమదశను పొందును. పూర్ణ యోగము జీవితాకాశములో నుదయించుటకు ముందు సద్గుణముల ప్రభ బహిర్గతమగును. పూర్ణ జీవితమును సూచించుచు ముందు కానవచ్చు. ఈ ప్రభ యొక్క వర్ణనము వేదములలో చెప్పబడినది. ఒక విషయమును ఋజువు చేయుట కొరకు మరికొన్నిటి సహాయము అవసరమగును.

ప్రశ్న. ప్రేమ-జ్ఞానము-భక్తులు - మన జీవితము లోనికి వచ్చినట్లు మనము తెలుసుకొనుటెట్లు?

జ. ఈ విధముగ మనము చేసిన సాధనలేవో, వాని నుండి మనకు కలిగిన అనుభవములేవో, ఎన్ని సద్వృత్తులు మనలో లోతుగా నాటుకొన్నవో, జీవితము నిజముగ ఎంత సేవామయమైనదో! నీకు పై వాని వలన గలిగిన జ్ఞానమో! భక్తియో! నిశ్చలతమో! పరిశీలించుటయే ఇందుకు దారి చూపును. ఇందుకు విరుద్ధమైన వృత్తులును "ఆసురీ సంపద అందురు". కాని అహింస – సత్యము అను పదములందు సద్గుణములన్నియు ఇమిడి యున్నవి. సద్గుణములను సంక్షిప్తపరచినచో చివరకు – సత్యా – అహింసలు రెండే మిగులును. తక్కిన సద్గుణములన్నియును ఈ రెండింటి యందే యిమిడి యుండును. కాని నిర్భయము – నమ్రత ఈ రెండింటి విషయము వేరు – నిర్భయము వలన "ప్రగతి" కలుగును. "నమ్రత" వలన రక్షణ కలుగును. నిర్భయము – సత్యము – యొక్క చిహ్నములైన సత్యా అహింసలను మూల ధనముగా బెట్టుకొని నిర్ణీతితో పురోగమింపవలెను. జీవితము విశాలమైనది. దాని యందు మనము నిరాటంకముగా సాగిపోవలెను. నమ్రతనంటి యున్నచో అడుగు అటునటు చెరగనేరదు. ఇంక సంతోషముతో సర్వత్ర, సత్యా అహింసల ప్రయోగములను జరుపుచు ముందునకు సాగిపొందు' దీని తాత్పర్యమేగా?

"సృష్టినెల్ల గూర్చిన చింత నీవు బెట్టుకొనకు" నీనైతిక శక్తిని పెంచుకొనుము. నిన్నాశ్రయించిన కామ క్రోధములను వదలివేయుము. నీ కంఠమున చుట్టుకొన్న ఉరిత్రాటిని మొదట విడిపించుకొనుము. ఇంతవరకు సాగించ గలిగినచో చాల వరకు నెగ్గినట్లే. అసుర సంపదను తొలగించుకొని దైవ సంపదను లభింప జేసుకొనుము" అని భగవానుడే నొక్కి చెప్పియున్నాడు. మనమట్లే యత్నింతము గాక.

---

# పరతత్వ విచారణ

## పరతత్వ విచారణ

"సన్మార్గోపదేశమును" ఆచార్యుడొక్కడే చేయగలడు. శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠ కలవాడు నగు గురువును జేరుము అని శ్రుతులు చెప్పుచున్నవి. శ్రోత్రియుడనగా సదాచార సంపత్తి గలిగి శ్రుత్యుక్త్యాచరణమున సంప్రదాయాను సారముగ నడచినవాడు. బ్రహ్మ నిష్ఠ గలవా(డనియు) డగుటచే సంశయ విపర్యయరహిత నిర్మలాత్మ జ్ఞాన నిష్ఠ గలవాడనియు సంపన్నుడనియు తెలియును. ఈ సద్గుణ లక్షణములు గలవాడే గురువుగ నుండవలెనని "శ్రుతులు" బోధించుచున్నవి. బ్రహ్మ జ్ఞాన మననేమి? బంధమనగనేమి? బ్రహ్మ విద్య యెట్టిది? ఇత్యాది ప్రశ్నల చేతను తెలియవలెనన్న గురువులకు నమస్కరించి గురుశుశ్రూష చేసి తెలిసికొనుము. తత్వవేత్తలగు జ్ఞానులు మాత్రమే నీకు తత్వోపదేశమును చేయగలరని గ్రహింపుము. కాన తత్త్వజ్ఞానము దెలిసిన సద్గురువును జేరి తత్వ జ్ఞానము పొందవలయును గాని లెక్కకు మిగిలిన పొత్తములుండగ గురువెందుకనరాదు. అనాది నుండి నేటి వరకును గురుముఖముననే మానవులు నేర్చుకొనుచున్నారనునది మనకు విశదమే. విద్యలలో కెల్ల "వరిష్టా" అను విద్య మేటిదన తగియున్నది. దీనిని గ్రహించుటయే 'వివేకము' ఆచార్యుని వలనను శాస్త్రముల వలనను తప్ప అన్య విధమున తెలియబడదని గ్రహించుట వివేకము. "గురువు" తత్వములను అరటిపండు వలిచి చేత బెట్టినట్లు బోధించ గలడు. అట్టి హెచ్చరికను గ్రహించి మనము మెలగుట "మహా వివేకము". ఇంతవరకు నేచేసిన కృషివలన వలయు, నుపపత్తిని సాధించ గలిగితిని,

ఇక దీనిని మధించి సారమును పొందవలెను.

## మధన - ఏకాగ్రత - నమ్రత

గంగా ప్రవాహము అన్ని ప్రదేశములలోను పవిత్రమైనదే! కాని హరిద్వారము - కాశి - ప్రయాగ వంటిచోట్ల మిక్కిలి పవిత్రమై అవి ప్రపంచము నెల్ల పవిత్రము చేయ మిగుల పవిత్రములైన తీర్ధ క్షేత్రములుగా మారినవి. వీనికే "అమృతధారలు" యని ప్రతీతి. ఇవి అమృతధారవలె మధురమైనవి. యని స్వయముగ భగవానుడే తీర్థక్షేత్రముల శక్తిని రసమహిమలను, దాని తత్త్వములను, గానము చేసినాడు. చివరకు జీవశాస్త్రమనుభూతము సర్వధర్మాచరణ రూపములైన "కర్మలను" దానికి సహకారియైన "వికర్మ"యు మానసిక సాధనల వలన సమస్త కర్మలను, "భస్మము చేయును" అంతిమ సోపానమైన కర్మ–అకర్మల యొక్క విచారణ ఇది వరకే జరిగినది. దీనితో జీవశాస్త్రము పూర్తియైనది.

ఒక విధముగ "భక్తి తత్త్వము" ప్రారంభమైనది. ఇది ఏకాగ్రతతో చిత్తైకాగ్రత యెట్లు కలుగును. దానికి ఏయే సాధనలున్నవో, వాని యావశ్యకమేమియో! సమగ్రముగ ఏకాగ్రత మొదలు, నమ్రత వరకు గల ఈ పెద్ద పెద్ద మజిలీలను మనమెట్లుదాట గలమో? ఇప్పుడు చూడవలెను.

చిత్తైకాగ్రతతో ప్రారంభమైనది. ఏకాగ్రత సిద్ధించిన మీదట మనుష్యుడు ఏ విధమున నైనను ఆలోచించ గలుగును. చిత్తైకాగ్రత, గణిత శాస్త్రమునందు గనబడునని యభిమానముతో చెప్పగలను. కాని ఇది చిత్తైకాగ్రతకు సర్వోత్కృష్టమైన లక్ష్యము గాదు. ఏకాగ్రతకు గణిత శాస్త్రము "యెరపిడిరాయి". అందుచే మనదృష్టి భగవంతుని చరణముల వైపు మరల వలెనని చెప్పుచున్నారు. భగవంతుని చరణముల యందు ఏకాగ్రదృష్టి నిరంతరమును మనస్సు నిలుపవలెనని, దీనికై మరణ

పర్యంతము ప్రయత్నించవలెనని శాస్త్రములు (చెప్పుచున్నవి) బోధించుచున్నవి.

ఇక సగుణోపాసనకు. ఇంద్రియములు సాధన భూతములు, ఇంద్రియములన పరమేశ్వరునికర్పించు పుష్పములు, కనులతో శ్రీహరిని దర్శించుచు, చెవులతో శ్రీహరి కథలను వినుచు, జిహ్వాతో హరినామ స్మరణ చేయుచు, పాదములతో తీర్ధ యాత్రాదులు చేయుచు, చేతులతో సేవాకార్యములు చేయుచు "సగుణోపాసకుడు" సమస్తేంద్రియములను పరమేశ్వరునికి అర్పించును. ఇది సగుణోపాసకుని దృష్టి. ఇక నిర్గుణోపాసకునకు ఇంద్రియములు విఘ్నకారకములుగాతోచును. అందువలన నాతడు వానినదుపులోననే యుంచును. (లేక బంధించును). నిరాహారముగా వానిపై "పహరా" పేట్టును. కాని సగుణోపాసకున కట్టిపని లేదు. అతడు సర్వేంద్రియములను 'శ్రీహరి చరణముల కర్పించును. ఏ మార్గము ననుసరించినను, ''ఇంద్రియ నిగ్రహవే'' ఏకైక లక్ష్యము. ఇందొక మార్గము సులభము. రెండవది కఠినము. నిర్గుణోపాసకుడు సర్వభూతహితుడు కాని ఇది సామాన్య విషయము గాదు. "విశ్వకల్యాణమును" సాధించుటనునది చెప్పుట తేలికయే. ఆచరించుట చాల కష్టము. సగుణోపాసన తమ శక్తి ననుసరించి, అనేక విధములుగా, అందరును చేయవచ్చును చేయు "సేవ ఎంత స్వల్పమైనదైనను, ఇతరుల క్షేమమున కది భంగకరముగాకున్న, భక్తి మార్గమున కదియొక మెట్టు. ఆ సేవ అందరికీ. అంకిత భావముతో గూడినదగును. తల్లితండ్రులు, పీడితులైన బందుగులు, సాధువులు, మహాత్ములు. వీరందరినీ ఈశ్వర స్వరూపులుగ భావించి సేవింపవలెను. 'సగుణ పూజ' సులభమైనది. నిర్గుణ పూజ కఠినమైనది. రెంటి యొక్క ప్రయోజనము నొక్కటియే. సౌలభ్యమును బట్టి చూచినచో "సగుణ"యే శ్రేష్ఠమును, శ్రేయస్కరమును

నేనొకప్పుడు జ్ఞానము మీద ఆధారపడి యుండుదానను. కాని అనుభవము వలన ఇప్పుడు తెలిసికొన్న విషయము, జ్ఞానము వలన మనస్సులోని 'అజ్ఞానము' అనుమాలిన్యము కాలి భస్మమై పోవును, గాని, సూక్ష్మ మాలిన్యము నశించదు. భక్తి యను నీరు లేకుండా ఈ మాలిన్యమును కడిగివేయ లేము. ఆ శక్తి, భక్తి యను నీటికే యున్నది. దీనిని మీరు పరావలంబన మని యందురు గాక! కాని పరమాత్మయే శ్రేష్ఠుడనుకొని, ఆతని మీద ఆధారపడి యుండుడు స్వావలంబన మనగా హృద్గతమైన 'ఆత్మ జ్ఞానమే. ఆత్మ జ్ఞానము వలన "శుద్ధజ్ఞానము" లభించును. సారాంశమేమనగా 'నిర్గుణభక్తుని' స్వాలంబనలో కూడ, ఆత్మపై ఆధారము కలదు. ప్రపంచములో నెవరికిని, నెవ్వరితోను శత్రుత్వము లేదు. ఎవ్వడు తటస్థుడై ప్రపంచమునకు 'నిష్కామకర్మతో" సేవ చేయునో, తాను చేయు కర్మఫలము నంతయును నాకెవ్వడర్పించు చున్నాడో, ఎవ్వడు నా భక్తుడో, క్రియాశీలుడో నిస్సంగుడో విరక్తుడో అట్టివాడు నా కెంతయో 'ముఖ్యుడు' అని గీతాచార్యులు చెప్పియున్నారు.

ఇన్నిటితో నా హృదయమునిండి ఎనెన్నియో రాత్రులు గడచిపోయినవి. నిర్గుణోపాసన మెట్లు "వోతప్రోతము" అయి యుండునో. ఇప్పుడు నాకర్థమైనది. నిర్గుణములో గూడ సగుణము యొక్క సారము పూర్తిగా నిండి యుండును. సద్గుణ–నిర్గుణ రూపములు ఈ రెండును నొక్కటియే. ఒకటి ప్రత్యక్షమూర్తిని పూజించుట రెండు ప్రకట రూపమున పూజను సేవాకార్యమును వెలువరించక పోయినను, లోక కల్యాణము కొరకు నిరంతరమును, హృదయములో చింతన చేయుట.

ఈ రెంటి విలువ యోగ్యత సమానము 'అమృతము' మధురముగా నుండు నందున గాని దానిని మనము చవిచూడలేదు. భక్తుని లక్షణములు ప్రత్యక్ష మధురములు. దీనిని మనము ఆలోచించ

పనిలేదు. ఈ విధముగ మన జీవితమును మెల్లగ "పరమేశ్వరుని" వైపునకు నడుపుకొని పోదము.

## జగత్తు – బ్రహ్మము – ఈశ్వరుడు – జీవుడు – మాయ

1) జగత్తు :– బ్రహ్మాండమునందు జీవుడొక పిండాండము. ఈ రెంటి యొక్క మూల సత్యమొక్కటియే. ఈ యాత్మకు భిన్నముగా దోచునదంతయును మిద్యా స్వరూపమే విచారించనంత వరకు సత్యము వలె దోచును. విచారించిన అసత్యమని – మిద్యయని తెలియబడును.

2 బ్రహ్మము : బ్రహ్మమునే పరమాత్మ యందురు. ఆది మద్యాంత రహితము : భూమము– ఏకము– అద్వితీయము – నిత్య శుద్ధ బద్ధముక్త స్వరూపము అనగా అవాఙ్మనస గోచరము కేవల మనుభవైక వేద్యము. విభూతులకధికారియు సృష్టికర్తయు సర్వోపాధి రహితుడు.

3) ఈశ్వరుడు : బ్రహ్మమే ప్రకృతియను శక్తి వలన లోకములను సృజించి పెంచునట్టి కర్తగా అందు నిగూఢముగా నుండి బ్రహ్మ – విష్ణు – మహేంద్రాది సకల జీవరాసులను పాలించు ప్రభువు.

4) జీవుడు : ఈశ్వరుని ప్రేరణ వలన అద్యాసకులోనై నేనీ స్థూల శరీరము కలవాడను. బ్రహ్మము – విష్ణువు – రుద్రుడు – ఇంద్రుడు మొదలగు వాని నన్నిటినీ తానని తాద్యపము చెందువాడు. తానెవరో నెరుగక!యైనను కర్మవలన జనించెడి వివిధ దేహములందు పుట్టి అనేక జీవుల వలె కన్పట్టును.

5) ప్రకృతి : బ్రహ్మము యొక్క శక్తియే ప్రకృతి. అనబడును. (అనగా నడచుచున్నది). అది బుద్ధి రూపమున బ్రహ్మ యొక్క సన్నిధానమున నుండి 'ఆ బ్రహ్మ' సంకల్పము మాత్రమున సృష్టి

పరంపరలను చేయుచు ఆనందించును.

6) మాయ : అజ్ఞానము = (అనాత్మ) యొక్క మూలము. ఆకాశము నందు మేఘము వలె బ్రహ్మము నందును గాన వచ్చును. దీనికి ఆది లేదు – అంతము గలదు. ఉన్నదని గాని, లేనిదని గాని చెప్ప వీలులేనిది, కానిది అనిర్వచనమైన స్థానము గలది. ఇదియే జగత్తునందు విశ్వరూపముగ పరిణమించి తన స్వరూపముచే మోహింపజేసి జగత్తునంతను, తన విశ్వరూపముగ పరిణమింప జేయునది.

7) ప్రత్యగాత్మ : దేహేంద్రియ మనోబుద్ధ్యాదుల కన్నిటికిని వెనుక – లోన – నున్నవాడు. అట్లుగనుపింపడు. ప్రజ్ఞాన ఘనుడు. జ్ఞానమే స్వరూపముగా గలిగిన వాడు. జ్ఞానమే స్వరూపముగా గలవాడు.

ఈ ప్రపంచమంత

యు జీవ– ఈశ్వర – భూతములనెడి మూడు తత్త్వముల పరిమాణమేను. జీవుని భోగార్థముగా ఈశ్వరేచ్ఛగా సృష్టి యేర్పడినది. మాయతన్నాశ్రయించి యుండుట వలన (అనగా స్వాధీనము గలవాడు) మాయ – శక్తి ప్రభావములకు దానే ప్రభువు. జీవేశ్వర భూతములకు మూల తత్త్వము. మన బుద్ధి కందనిది. "ఈశ్వరాజ్ఞ"యే ఎన్ని జన్మములెత్తినను కర్మ ఫలము ననుభవింపక తీరదు. కర్మఫలము అనేక జన్మల అనంతరము గూడ రాగలదు. అందువలన, "సర్వకర్మాధ్యక్షుడు" సర్వసాక్షి యునగు వాడు. "పరమేశ్వరు"డొక్కడే. కావున జీవుల కర్మభోగార్థమే పరమేశ్వరుడు సృష్టిరచనకు బూనుకొన్నాడు. అనునది యుక్తి సిద్ధము. నేనెవరు? దేవుడెవరు? జీవుడెవరు? మొదలగు ప్రశ్నలకు శాస్త్రము లందలివియు (ప్రకృతి నుండియు) జవాబులను గ్రహించితిమి (తిలకించితిమి).

## అనుభవము - అనుకొనుట

ఇప్పటి వరకును, అద్వైత ద్వైత సిద్ధాంతమును నారికేళ పాకములో చవి చూచితిమి. ప్రస్తుతము దానిని మన యనుభవములో మిళితము చేసి ద్రాక్షా పాకములో చవి చూతము గాక. సృష్టి కలదు. యని అనుకొనుట వలననే కలిగినది అని మన మనుకొనుట అను విషయమును గురించి లోతుగ, తరచి చూడవలసి యున్నది. కావున అనుకొనుటలో సృజింపులు - వినాశములు జరుగవచ్చును. సిద్ధాంతములపై యుదాహరణ మూలమున, కొంత సులభము కాగలదు. నేనట్లనుకొంటిని అను వాక్యార్థము నేనట్లు తలంచితిననియే కద! కావున అనుకొనుట యనినను - తలంచుటయనినను నొక్కటియే యని చెప్పనగును. లేక తలంచుట, అనుకొనుట యనునది బుద్ధి వికాసమే. యద్దాని వెలుపలి స్వరూపము, అనుకొనుట, తలంచుట, బుద్ధి, కోరిక. భావము - సంకల్పము - భావన - చింతన మొదలగు పదములన్నియు, సందర్భము ననుసరించి, ప్రయోగములేమైనను మనోవికార జాతములే యగుట వలన స్థూలముగ తలంపులుగ పరిణమించినవి. ఎందుకు ఎచ్చట నుండి బయలు దేరినవి. నాకీ తలంపు కలిగినది. అనుట చేత నాలో నుండియే బయలు దేరినదనుట సత్యము. నా మనస్సునకు దోచినది అను ప్రయోగము చేత నాలో అనుట, నా మనస్సు నందుండియని తెలియుచున్నందున మొదటి ప్రశ్నకు జవాబు కుదిరినది. మొదటి ప్రశ్నగడు గడ్డు ప్రశ్న. ఇట్టి తలంపులు స్వతంత్రముగా పుట్టినవా? లేక ఇతరుల ప్రేరేపణ వలననా? యను ప్రశ్నకు సూక్ష్మముగా విలోకించిన మన తలంపులకు కారణములు వాని యందే గోచరించును.

సర్వ జీవరాసుల యొక్క ప్రవృత్తి సుఖానుభూతులే గాని గోరుట

లేదని తెలిసికొనుము. ఇట్టి తలంపునకు కారణము ప్రస్తుతము నాకు సుఖము లేదు అనియే తోచుచున్నది. కాని సుఖము కావలెనని నంత మాత్రమున సుఖము కలుగునా? మానవ కల్యాణమునకు గాని వినాశనమునకు గాని తలంపులే కారణభూతములు. దీని వలన తలంపు మహాద్భుత విషయమని తోచక మానదు. అన్ని కోరికలు, సంకల్పము వలన కలుగునని "మనువు" తెల్పియున్నాడు.

కోరిక వలన "ప్రవృత్తి" కలుగుచున్నది యని ఈ విధముగ శ్రుతి స్మృతులు సంకల్ప ప్రభావములను గూర్చియే తెలుపుచున్నవి. ఈ సృష్టి యందలి చరా చరములన్నియు నొకొక్క "భౌతిక రూపమే" యనుట నిరాక్షేపణీయము.

"యమంవాసి స్మరన్భాంవం, త్యజం తేతే కళేబరం తంతం వేతి కౌంతేయ సదసద్భావ భావితం".

జీవిత కాలమున మానవుడు సదాభావించు విషయమే మృత్యు సమయమున స్మరణకు వచ్చుననియు, ఆ భావము ననుసరించియే ఉత్తర జన్మ కలుగుననియు గీతావాక్యము.

ఇందులకు భ్రమర కీట న్యాయమే యొక నిదర్శనము. తేనెటీగ గూటియందు. అన్యజాతి కీటకమును బంధించును. అట్లుగా బంధింపబడిన కీటకము "ఝుంకారము"ల నిరంతర స్మరణతో (తుమ్మెద) తేనెటీగల వలె బయల్వెడలుట భావనా దారుఢ్య ఫలితమును ఋజువు చేయుచున్నది. ఇది ప్రత్యక్ష ప్రమాణము.

ఒక జాతికి చెందిన వస్తువు "భావనాశక్తిచే, అన్యజాతిని బొందదగిన సామర్థ్యము గలిగియున్నది గదా! అసలు తాను "సత్యజ్ఞానానంద స్వరూపడయ్యును, భ్రాంతి వలన (అనుకొనుట వలన)

మర్త్యుడనని తలంచు జీవుడు తాన సమర్థుడనని తెలిసికొనిన (అనుకొనిన) యెడల తన స్వస్వరూపమును బొందు ననుట యందు విపరీతమే మున్నది. సర్వము సంకల్ప మూలములని శాస్త్రములు చెప్పుచున్నవి. సంకల్పము లేనిదే ప్రవృత్తి కలుగనేరదు. దేహము నుండి నేను వేరు అని గ్రహించి నప్పుడే సంస్కరణ కలుగును. తనలో శారీరక – మానసిక – దోషములున్నట్లు మానవుడు గుర్తుంచుకొనుట తప్పుకాదు. ఈ దోషము, దోషములను తొలగించుకొనుటకు సాయపడును. కాని నేను దేహమును కాను. ఈ దేహము నుండి పూర్తిగా భిన్నమును, అత్యంత సుందరము, ఉజ్వలము – దోష రహితము అయిన 'ఆత్మవస్తువును' అని మానవుడు స్పష్టముగా గ్రహించవలెను. తాను నిర్దోషియగుటకు, చేసుకొను ఆత్మ పరీక్ష కూడ దేహిభావమును తొలగించుకొనియే చేసుకొనవలెను. అట్టివాడు, ఎవరైనను తన దోషములను బట్టి, ఎత్తి చూపించినచో యేమియునను కొనరాదు. మీదు మిక్కిలి శరీరముతో, మనస్సుతో గూడిన ఈ యంత్రములోని దోషములను పరిసేవించుకొనవలెను. అట్లు తొలగించుకొని దేహము నుండి 'నేను వేరు' అని వేరుగ జూచుకొన లేనివాడు తానై తనను సంస్కరించు కొనలేడు.

## ఈ దేహము (ఈపిండము) ఈ మట్టి బొమ్మ

ఇది నేననుకొను నాడు తన్నుతానెట్లు సంస్కరించుకొనగలడు. ఈ దేహము సాధనకై నాకు లభించినదని నమ్మి నప్పుడే నీలో సంస్కరణ రాగలదు. ఇక శరీర విషయము గూడనిదే "వ్యవసాయపు పనిముట్లు వంటిది దేహము". ఈ దేహము భగవంతుని "సేద్యమునకు ఉపకరించు పనిముట్టేయని తలంచవలెను. ఈ దేహమను పనిముట్టు చెడిన యెడల దానిని తప్పక సరిచేయవలెను. సాధన కొరకు ఈయబడిన వస్తువే ఈ

దేహము. అందువలన మన దేహము నుండి మనలను వేరు పరచుకొని దోష విముక్తి కొరకు ప్రయత్నించవలెను. ఈ దేహమనునది పనిముట్టు. నేను వేరు. దీనికి నేనే యజమానిని. దీని చేత యుత్కృష్టమైన సేవా కార్యములను చేయింతును. అని బాల్యము నుండియే దేహము వేరు – ఆత్మ వేరు అను వృత్తిని మానవుడలవరచు కొనవలెను.

మన దేహము మనోబుద్ధుల నుండి మనము వేరుగా నుండియే, వాని గుణ దోషములను పరిశీలింపవలెను. (గలము), ఒకొక్కడు "నా జ్ఞాపక శక్తియేదో కొంత తగ్గిపోయినదండీ" దీనికేదైనా యుపాయము చెప్పగలరా, అనుటలో తాను వేరు, జ్ఞాపక శక్తి వేరు అని స్పష్టమగుచున్నది. నా జ్ఞాపక శక్తి చెడినదనుట వారికున్న సాధన సామగ్రిలో ఒక పనిముట్టు చెడినదనియే కద! వారి భావన. చివరకు మరణ సమయమున పూర్ణముగా నష్టమగునది దేహమే కద! కాని లోపలి ఆత్మ వస్తువు మాత్రము చెక్కు చెదరకుండును. అది నిర్దోషము, నిరోగముగ నుండును. దీనిని మనము గ్రహించినచో చాల చిక్కులు తొలగిపోవును. ఇది గ్రహించదగినది. (విషయము) దేహమే నేను అనుభావన సర్వత్ర వ్యాపించినందున "మనుష్యుడు" వివేకము నశించి దేహపుష్టి కొరకు అనేక సాధనలను నిర్మించుకొనుచున్నాడు. ఈ దేహము ఎంత పాతదైనను, జీర్ణమైపోయినను, యేదో యొక యుపాయము చేత దానిని నిలబెట్టవలెనను నిశ్చయముతో నుండును కాని ఎంత కాలము దేహము నుంచగలమని తలంచడు.

ఈ దేహమును, ఈపై తొడుగును ఎంత కాలము నిలుపగలడు. చనిపోవు వరకే గదా! "మృత్యువు (అను) యొక్క వారంటు" వచ్చినంతనే ఒక్క క్షణమైనను నిలువజాలదు. ఐనను ఈ తుచ్ఛదేహము కొఱకు మానవుడు వివిధమైన సాధన సామగ్రులను సమకూర్చుచునే యుండును.

ప్ర. పశు దేహము కంటె మానవ దేహము ఎందులకు విలువైనది?

జ. పశువు దొరికినదెల్ల తినవేయగలదు. స్వార్థము వినా దానికింకొక వృత్తి లేనే లేదు. మానవుని విషయములో నట్లు కాదు. మనుష్యుడు తనచుట్టు నుండు జీవులను రక్షించవలెను. (అను నియమమున్నది). కాన మనుష్య దేహమునకు విలువ వచ్చినది.

ప్ర. ఏ కారణము వలన విలువ వచ్చినదో ఆ కారణమును తెలిసి కొందము.

జ. ఓయీ! నీవు నిగ్రహముతో నుందువని, అందరను కనిపెట్టు వృత్తి నీలో నుండునని కద! నీకీ పెద్దరిక మిచ్చినది! ఇందువల్లనే, మానవ జీవతము దుర్లభము" అన్నారు. జంతువులు మరియొక జంతువును చంపితినునట్లు మానవుడు కూడ నిస్సంకోచగముగా బ్రతుకుట కారంభించిన నిక వాని గొప్పతనమేమున్నది? "తానెక్కిన కొమ్మను తానే కొట్టివేసి కొనినట్లగును". మూలాధారమే కూలిపోవును. ఇంత హద్దుమీరి ప్రవర్తించుటెందులకు? ఈ దేహము మన చేతనున్న ఒక పనిముట్టు వంటిది. దానిని సరియైన స్థితిలో నుంచుటకు అవసరమైన దంతయును మనము చేయవలెను. ఈ దేహము – సాధనయే గాని సాధ్యము గాదు. మనలో ఈ భావము దృఢముగా నున్నచో ఈ శరీరము నంటియున్న దురభిమానము తొలగిపోవును. భగవంతుని దయవలన నేనందించిన ఈ భావములు విలువగలవని" గ్రహింతురు గాక! ఇది మిక్కిలి "ఉన్నతము పవిత్రమునైన" మహా వాక్యము. ఈ బాహ్యాకవచముపై బెరడు, నీ ఎముకల గూడు నీవు కాదు. నాశరహితమైన ఫలమేదో, లోపల సారమేదో అదియే నీవని గ్రహింపనగును. అది నీవు అనుభావము మానవుల హృదయములలో స్ఫురించిన తక్షణమే ఈ దేహము నేను కాను లోపల నున్న ఆ

పరమాత్మయే "నేను" అను ఆలోచన మనస్సున నాటుకొన్నంతనే, ఆనందానుభవము తరంగముల వలె నీలో లేచును.

ఈ మహితత్వముల నిమిత్తము ఈ శరీరమును విసరి పారవేయదము. (ఈశ్వరునకు) విజయభేరిని మ్రోగింతును. ధనికుడు "ఒక వస్త్రము" మైలబడినంతనే, దానిని వదలి (విసర్జించి) మరియొక దానిని ధరించును. అట్లే నేనును చేయుదును. కర్మాచరణకే ఈ దేహము. సత్యాగ్రహముల ద్వారా మనకి శిక్షణ లభించినది దేహము – ఆత్మ వేరు వేరు వస్తువులు. మానవుడీ రహస్యము తెలిసికొన్నచో అతనికి నిజమైన శిక్షణ ఆత్మ వికాసము ఆరంభమగును. మన మందరమును ఈ భావనను హృదయములలో అంకితము చేసికొనుట అవసరము. ఈ దేహము కేవలము నిమిత్త మాత్రము. సాధన ఈశ్వరదత్తమైన ఒక పనిముట్టు. శరీరము యొక్క అవసరము తీరిననాడు దానిని విసర్జించవలెను. చలికాలములో ధరించిన దుస్తులను వేసవి కాలములో తీసివేయుదుము గదా, ఆ విధముగనే దేహమును కూడ విసర్జించవలసినదే. ఆత్మ వికాసము కొరకు మనకీయుపాయమును భగవంతుడే ప్రసాదించినాడు.

## మనస్సు – బుద్ధి

తలంపు – సంకల్పము – బుద్ధి – భావము – ఆలోచన – అనుకొనుట మొదలగునవి వ్యవహారముల ననుసరించి నామ భేదములు మారుచున్నను – అవి మనోవికార మాత్రములని నడుపుచుండు ఈ మనస్సును విషయములను గూడ విచారించి తెలుసు (కొందము) కొనుట "అనివార్యము" ముఖ్యము అని తెలియుచున్నది.

ప్ర. మనస్సనమేమి? దీనికిని నాకును గల సంబంధమెట్టిది?

జ. సర్వవ్యాపకమై - ఎల్లప్పుడును ప్రకాశించెడి 'ఆత్మ' ఏకారణమున, తనను పరులని తెలియజేసెడి శక్తిని ధరించునో, అప్పుడు ఆ శక్తినే మనస్సని చెప్పబడును. ఇది అసలు రహస్యము.

ఆకాశము నుండి పడిన (వాన) వర్షపు జలము తిరిగి తన జన్మస్థానమైన సాగరమును జేరునట్లు సూర్యరశ్మిచే ఆకర్షింపబడి మేఘరూపమున ఆకాశమునే జేరునట్లు, మనము ఏమార్గమున పయనించినను (ధోరణినిని బడినను) తిరిగి మన జన్మస్థానమును జేరవలసినదే. ఇది సత్యము. కన్ను- ముక్కు - చెవి - త్వక్కు జిహ్వాలు - బాహ్యేంద్రియములని గ్రహించుట వలన 'బాహ్యోపకరణము'' లనియును ''మనస్సు, కండ్లకు గానరానిదే బాహ్యాంతర విషయ'మగుటవలన' నంత్ణ కారణము లేక యతీంద్రియము అనియును చెప్పుదురు. కరణమనగా పనిముట్టు. పనిముట్టు జడము. జడమనగా స్వప్రయోజన హీనము. ఇతరము వలన ఉపయోగింపబడు విషయము. అనగా అచేతనము. 'పరప్రకాశము' కావున అంత్ణకరణమైన మనస్సు జడమని నిర్వహింపబడినది. కాని, రెండు నిర్వచనములును యదార్థములే. లోకములో "చేతనము" "అచేతనము" అను రెండు తత్వములే గోచరించుచున్నవి. మనస్సు అచేతనమనునప్పుడు చేతనత్వము తద్భిన్నముగా గలదని చెప్పనొప్పును. అందువలన చేతనత్వమునకు భిన్నమగునదంతయు జడస్వరూపమని చెప్పబడినది. ఉదాహరణ : బండి నడచుచున్నది యనునపుడు బండి నడుచుట యదార్థమైనను బండి జడమగుట వలన 'నడచుట'యను క్రియకు తాను 'కర్త' కాజాలదు. దానిని నడుపువాడొకడున్నాడు. అతడు చేతన స్వరూపుడు. అతని శక్తి మిళితమగుటచే బండి నడచుచున్నదని చెప్పుట సమంజసము.

అంతఃకరణ యొక్క వికారము అనగా పరిణామము యొక్క

కార్యమేది కలదో దానిని వృత్తియందురు. ఈ వృత్తి నాలుగు విధములు. ఇందు నిశ్చయాత్మక మగునది "బుద్ధి". సంకల్ప వికలాత్మకమైనది "మనస్సు". చింతన చేయునది "చిత్తము". నేను నేననునదియైన అభిమానాత్మకమైన వృత్తిని "అహంకారము" అని అందురు. ఒక విషయమును గూర్చి ఆలోచించుచున్నప్పుడు "మనస్సు" వికారమును బొందును. ఆలోచించు విషయములు మారుచుండిన "మనస్సు" యొక్క ఆకృతియు తదనురూపముగనే మారుచుండును. విషయము లెంతెంత శీఘ్రముగా మారుచుండునో "మనస్సు" కూడ నంత త్వరితముగనే నట్టి విషయాకారములుగ మారుచుండును. 'మనస్సు' అనేక విషయాకారములు గల రూపములనే గాక రూపరహిత విషయాకారములను గూడ తీసికొను శక్తి గలది. వీనిలో రూపరహిత విషయములు 'కామక్రోధ ధర్మాధర్మాదులు' జీవితకాల పర్యంతము ఈ విషయముగా 'మనస్సు' పనిచేయుచుండును. ఈ మారుచుండు విషయాకారములనే "చిత్తకృత్తు" లందురు. జన్మమంతయు కలిపి యొక్క మనోవృత్తియే యని గ్రహించవలెను. ఇందు జాగ్ర స్వప్న – సుషుప్తలు మూడును మూడు మనోవృత్తులు. ఈ ఆకారములు మైనపు ముద్ద యందు స్వర్ణరేణువులు హత్తుకొని యుండిన విధముగా మనస్సు నందు హత్తుకొని యుండును.

'జ్ఞానము' అనుభవ జ్ఞానమనియు, స్మృతి జ్ఞానమనియు రెండు విధములు. మనుస్మృతి జ్ఞానమునకు పై విధమగు ప్రక్రియయే యాలంబనము. సర్వ అనుభవములే మనస్సు నందు 'చిత్రింపబడి' గుప్తముగా నిలచి యుండును. మనస్సు సామాన్యముగా రెండు భూమికలు నుండి సంచరించును. అందొకటి "జ్ఞానభూమిక" (ఇట్టి) జ్ఞాన రహితముగా ఆంతరంగిక ప్రోద్బలముచే జరుగు వ్యవహార విధానమే "అజ్ఞాన భూమిక". మానవ వ్యవహారములీ రెండు భూమికల

నుండియే జరుగుచుండును. 'నా మనస్స్యన్యథా కలదు' అందువలన చూడలేదు, వినలేదు అనుటచే మనస్సే చూడునది. వినునది యని చెప్పి నిరూపించుచున్నది యొక స్మృతి ఇంకొక చోట.

మరియు కామము– సంకల్పము – వికల్పము– శ్రద్ధ అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, సిగ్గు, బుద్ధి, భయము మొదలగు సర్వమును 'మనస్సే' అనియు, వెనుక నుండి నీ వీపు పైనెవరైన స్పృశించినచో అట్టి త్రాకుడు, చేతి వలననా లేక కాలివలననా యని గ్రహించుట 'మనస్సు' వలన నేనని స్మృతులు గూడ నిర్వచించుచున్నవి.

నేను మంత్రములను చదువుదును. అని చదువుట కర్మ చేయుదునని చేయుట, ధన, పుత్ర, మిత్ర, పశ్వాది ఇహలోక సుఖాలను గోరుట మొదలుగునవి "మనస్సు యొక్క కార్యములు. మనస్సేజీవుడు. జీవుడే ఆత్మ, మనస్సే ప్రపంచమందుగల సర్వ విషయాదులునై యున్నవి. "మనస్సే బ్రహ్మము". మనస్సునే ఉపాసించుమని, ద్వైతా, ద్వైత సమన్వయ సమ్మిళితము ననునదే.

గాంభీర్యోపదేశము : నా మనస్సు నేను 'సుషుప్త' వ్యవస్థలో నుండగా దూరముగ పోవును. నేను జాగ్రదవస్థలో నుండగా తిరిగి నన్ను చేరును. ఇయ్యది జ్యోతులలో కెల్ల జ్యోతి. ఇది లేనియెడల నెట్టి కర్మయును జరుగదు. భూత, భవిష్య వర్తమానాల చుట్టు ముట్టియున్నవి. సర్వ జీవరాసుల మనస్సులు దీని యందోత ప్రోతముగా గలవు. అట్టి నా మనస్సు శుభము శ్రేయ (దాయ) పేతములగు సంకల్పములను సంకల్పించుగాత.

వేదములందు కామరహితమగు మనస్సు మోక్షమునకు కారణమని చెప్పుచున్నవి. సర్వ కోరికలు చిత్తము నాశ్రయించి యున్నవనియు, అవి విషయాకారముతో పరిణమించిన బంధ కారణ

మనియు అట్లు కాదేని మోక్షము సంపాదించుటకు బంధవిమోచనమే ఉపాయమనియు మనస్సును గూర్చి చెప్పబడుచున్నది.

ఇట్టి "శ్రుతి స్మృతుల ధోరణి ద్రాక్షపాకసాద్రుశమే. అది మనకు సరళముగా లోనికి దిగుచున్నటుల కాన్పించును. కాని గుటకవేయ ప్రయత్నమధ్యముననే, 'కరడుగట్టి' నారికేళ సాదృశమగును. ఎందువల్లనన "మనస్సు భూతపదార్థము" అదియే "మాయ" అని తెలియుము. ఇది యాదార్థమైన అనుభవము లోనికి వచ్చినచో బ్రహ్మ తత్వము తెలిసినట్లే యెంచనగును.

ఇట్లు శాస్త్రములు వైరుధ్యముగా చెప్పుచుండుటచే ఎట్టి మేధావినైనను కలవరపెట్టక తీరదు. ఇందువలననే 'తత్వము శాస్త్రాచార్యోపదేశము' వినా తెలియుట దర్ఘటమని తెలుపబడుచున్నది. ఆత్మ యొక చోట అంత్హకరణముగను, నదియే అజ్ఞానము వలన నేదో యొకటి అనుకొనుచున్నప్పుడు "మనస్స"నియు తెలుపబడుచున్నది. ఈ భేదము వ్యవసాయ దృష్టి ననుసరించి యేర్పడును. మనస్సు ఇది ఇట్టిది అని నిశ్చయాత్మకమగునపుడు బుద్ధి, అనబడును. ఒక ప్రత్యేక రూపమును బొంది దాని యవ్యవస్థతతో "దాదాప్యము" బొందునపుడు "అహంకారము" అనబడును. విషయ చింత వలన, చిత్తము అనబడును. తన సహజ స్వరూపమగు (సామాన్యవ్యవస్థ) అవ్యక్తము విస్మరించి యేదో యొక స్థితి యందుండ వలెనను తలంపును సంకల్పమనబడును. అంత్హకరణ వృత్తులను స్థూలముగా రెండు విభాగములు చేయవచ్చును. అందొకటి నేను అను వృత్తి ఇదియని బయలుదేరిన వృత్తి. రెండువది నేను అనువృత్తిని బుద్ధి లేక అహంకారము అందురు. ఇదియను వృత్తిని మనస్సనియు లేక మమకారము అనియు చెప్పబడును. బుద్ధి వృత్తినే దేహేంద్రియాదులను తానని వ్యాపించును. మమకార వృత్తి "నాది" అని ఇతర వృత్తులను వ్యాపింపజేయును.

కావున జాగ్ర, స్వప్న- సంసారములు మన్ణపరికల్పితములని నిర్ణయించుట నిరాక్షేపణీయము. కాక పూర్తిగా సత్యమై యున్నది. జాగ్రదవస్థయందు దోచు ప్రపంచము మాత్రము. బాహ్య విషయముగను స్వప్నమందు దోచు ప్రపంచము ఆంతర్య విషయముగ దోచును. ఇదియే భేదము. ఈ రెండును మనోవికార జాతములే. ఇవి మనస్సు యొక్క పరివర్తనములు. మనస్సు, బుద్ధి యనునవి అవస్థా భేధములు. ఈ బుద్ధి వ్యష్టిగతముగ, వ్యవహరించు నపుడు 'జీవుడు' అనియును, సమిష్టి రూపమున వ్యవహరించు నపుడు "పరమేష్టి" యనియు తెలుపబడినది.

మనస్సననేమియో! దానికిని నాకు గల సంబంధ మెట్టిదో? మొదలగు సంశయములు గ్రహించుటకు శ్రుతి స్మృతులు మన కందించిన సాధన సామగ్రితో చాల భాగము చూడ గలిగితిమి. ఇందు నాకు గల సర్వ సందేహములకు నివారణోపాయము గాన వచ్చుచున్నది. ఎట్లు దీని నంతను సమన్వయ పరచుకొనిన నాయభీష్టమీడేరునో లేదో చూతముగాక.

# పరమాత్ముని శక్తి

## పరమాత్ముని శక్తి

"దేహా సక్తి భయము" ఉన్నంత వరకు నిజమైన రక్షణ లేదు. అంత దనుక ఒక విధమగు భయమే పట్టుకొని పీడించును. "నిద్ర వచ్చి కన్నులు మూతబడినా పాము వచ్చి కరచునో, దొంగ లెక్కడ నుండి దెబ్బ కొట్టుదురో" అను భయమే కలవరపెట్టును. నీవెవరిపై భారముంచి నిద్ర పోవు చున్నావో, నీవు నిద్రించునపుడు ప్రపంచపు యొడిలో నున్నావని గుర్తింపుము. నిన్ను నీవు రక్షించుకొన గలుగునది మెలకువతో నున్నప్పుడు గదా! నిద్రించునపుడు నిన్ను రక్షించునదెవరు?

ఒక మహాశక్తిపై విశ్వాసము పెట్టుకొని నేను నిద్రింతును. ఏ శక్తిపై విశ్వాముంచి ''పులి – గోవు'' మొదలగు జంతువులు నిద్రించుచున్నవో ఆవిశ్వాసము తోడనే నేనును నిద్రించుచున్నాను. "పిల్లవాడు తల్లి యొడిలో నిర్భయముగా నిశ్చింతగా నిద్రించును. అప్పుడతడు "ఈ పృధ్వికెల్లా నేనే పాదుషా ననునట్లు ఆనందించును. మనము గూడ ఆ విధముగనే విశ్వమాత యొడిలో ప్రేమ – వివేకము, విశ్వాసములతో నిద్రించు అభ్యాసము చేయుదము గాక! నా జీవితమిట్లు నిలబడుటకు "ఏ శక్తి" ఆధారము వలన నడచుచున్నదో, ఆ శక్తితో నా కంత కంతకు పరిచయము పెరుగు చుండవలెను. పోను పోను నాకా శక్తి స్ఫుటముగా గోచరించును. ఆ శక్తిపై నా విశ్వాసము పెరిగిన కొలదియు నా జీవితమంత కంతకు సురక్షితమగునట్లు "ఆ మహా శక్తియే" తోడ్పడగలదు. ఈ శక్తిని గూర్చిన నాయనుభవముతో పాటు నా వికాసము కూడ వృద్ధి పొందును అనునది కొంతవరకు

చిత్రింపబడినది.

## పరమాత్మని గూర్చిన విశ్వాసము

ఆత్మకు చావులేదు. దానిని చంపగలవాడు గాని పాతిపెట్ట గలవాడు గాని లేడు అని సోక్రటీసు చెప్పియున్నాడు. దేహ (సిద్ధ) స్థితమైన ఆత్మ యొక్క విచారణ మనస్సులోనికి రానంతవరకు మనుష్యుడు సాధారణ క్రియలలో లీనుడై యుండును. ఆకలియైనప్పుడు తినుట, దప్పికయైనప్పుడు నీరు ద్రావుట, నిద్రవచ్చినప్పుడు నిద్రించుట ఇంతకు మించి వానికేమియు తెలియవు. ఈ విధముగా దేహావసరములను తృప్తి పరచుకొనుటలోననే నిమగ్నుడై ఆతడుండును.

"నూతి వైపునకు ప్రాకిపోవు బిడ్డను వెనునుండి వివేకముతో కాపాడి చూచుచుండు తల్లివలె, ఆత్మ కూడ మన వైపు దృష్టి నిలిపి ఓర్పుతో మన పనులన్నిటిని చూచుచుండును. 'ఉపద్రష్ట' లేక 'సాక్షి' లేక 'సర్వసముడు' (సర్వమును చూచువాడు) అని యందుము. ఆతడు ఈ స్థితిని చూచుచుండును గాని ఆత్మ సమ్మతి నీయదు. అంతవరకు దేహము నేననుకొనుచున్న 'జీవుడు' క్రమ క్రమముగా జాగరూకుడగును. అయ్యో! నెనింత వరకు 'పశువు'వలె జీవితము గడుపుచున్నానే అను వివేకము వానికి కలుగును. మానవునిలో ఇటువంటి వివేకముదయించినప్పుడు, అతడు అడుగడుగున ఉచితానుచితముల యోచించి, వివేకముతో పనులు చేయనారంభించును. అతనిలో "ఆత్మ వివేచన ప్రారంభమగును. జీవుని యందీ నైతిక భూమిక ఏర్పడినప్పుడు ఆత్మ కేవలము తటస్థముగా చూచుచుండక లోపలి నుండియే తన యామోదమును తెలుపుచుండును. జ్ఞానమను వాటిలోనుండి వినబడుచుండును. అనగా ఆమోదము తెలుపునది యగును. అట్టి స్థితిలో ఈ జీవుడు 'భోగమయ జీవితమును విసర్జించి

“నైతిక జీవితమును” పునాదిగా చేసికొనును. తన కర్తవ్య కర్మ ద్వారా హృదయ మాలిన్యమును కడిగివేసికొనుటకు ప్రయత్నించును. ఈ పనిని చేయుచు అలసి పోవును. ఆ సమయమున జీవుడు “ఓ ఈశ్వరా! నా ప్రయత్నమింతకు మించి పైకి పోలేకున్నది. నాకు శక్తిని – బలమును – మరి కొంత ప్రసాదింపుము” అని ప్రార్థించును. ఈ యనుభవము మనస్సుకు కలుగనంత వరకును “ప్రార్థనలోని రహస్యము తెలిసికొనలేరు. తన శక్తి చాలదను జ్ఞానము కలిగినప్పుడు “ద్రౌపది వలె” పరమాత్మను పిలువవలెను. పరమేశ్వరుని కృప సహకారము అను స్రోతస్సు నిత్యమును ప్రవహించునే యున్నది. దప్పిగొన్నవారు గ్రహింపక దానిని బావి నుండియే నీరు త్రాగుదురు. లోటు పడినవాడు అడిగి తీసికొనవచ్చును. ఇట్లుగా పరమాత్మ మరింత సన్నిహితుడగును.

ఇప్పుడు బాగుగా నున్నది అనుటతో ఆగక అతడు సహాయము చేయుటకే పరుగెత్తుకొని వచ్చును. భక్తుని యుత్సాహము తగ్గినంతనే భగవంతుడు అతని సహాయార్థము వచ్చును. యజమాని కొంచెము తలుపు తెరచినచో సూర్యుడు తన పూర్ణ తేజస్సుతో లోనికి జొరబడి అంధకారమును పారద్రోలును. అట్టిదే పరమాత్మ స్థితి. తన సాయము నర్థించి నంతనే ఆతడు చాచిన చేతులతో జీవుని వద్ద వాలినాడన్న మాటే! భీమానది ఒడ్డున పండరీ పురమున నడుమున చేతులు గట్టుకొని స్థిరముగా నిలచి యున్న ఓపాండు రంగా! నీవు నాకు సహాయము చేయుము. నీ ఆశ్రయమే నా కవసరము అని ప్రార్థించుము. అప్పుడు ఆ దయామయుడు, పరమాత్మ – పరమేశ్వరుడు అసంపూర్ణమును సంపూర్ణముగ చేయగల ఆ ప్రభువు పరుగెత్తుకొని వచ్చును.

ధర్మవ్యాధునకు మాంసము అమ్మి పెట్టుట, కబీరునకు బట్టలు నేసి పెట్టుట, సక్కుబాయికి పిండి విసిరి పెట్టుట మొదలగునవి మనకు దృష్టాంతములే గదా! దీని పైమెట్టు యేమనగా, ఈశ్వర ప్రసాదముగా

మనకు లభించిన ఫలమును కూడ మనమనుభవించకుండ ఆతనికి అర్పణ చేయుటయే. నీవిచ్చిన ఫలమును నీవే స్వీకరింపుము అనవలయును.

ఆ విధముగా ఈశ్వర ప్రసాదముగా లభించిన సమస్తము, నీ సమస్త సంపదను, మూలధనమును ఆయనకే అర్పించి వేయుము. నీ వలన జరుగవలసిన పనులన్నిటినీ ఆ పరమేశ్వరునే నిర్ణయించు కొననిమ్ము. నీ చిత్తమున కలుగు సమస్త సంకల్పములను, బాధ్యతలను ఆ ప్రభువు పైననే యుంచుము. ఇట్లుగా నడచిన వాడు జీవితములో కలుగు లాభనష్టములు – మోసములు – అస్థిరత్వము, విసుగుదల మొదలగునవన్నియు చివరకు పరమాత్మ రూపమే అయిపోవును. భగవంతుడే నా జీవితమునకు మహేశ్వరుడగును. ఈ విధముగా మనో వికాసము వృద్ధి చెందిన, జీవిత మంతయు పరమేశ్వరమయ మగును. ఇక సందేహము అను తెర ఒకటి మిగిలిపోవును. అది కూడ తొలగిపోగానే జీవుడు, శివుడు పరమాత్మ ఒక్కటియే అని తెలియనగును.

తరువాత చిత్తమునంటి యున్న మాలిన్యమును కడిగి వేసి కొనుటకు మానవ ప్రయత్నము చాలక! మనము ప్రేమ, భక్తితో పిలిచినపుడు 'ఆ' అనాధనాధుడు మన సహాయార్థము పరుగిడి వచ్చును. అటు తరువాత 'ఫలమును' కూడ పరమ్మాతకే అర్పించి అతనిని భోక్తగా చేయవలయును. చివరకు మన సంకల్పము లన్నిటినీ అర్పించి జీవితమంతయు హరిమయము చేసుకొనవలెను. ఇదే మానవుని అంతిమ లక్ష్యము.

కర్మ – భక్తి – సాధనలను రెక్కలతో వివరించు సాధకుడు చివరి మజిలీని చేరవలెననునది తేలికగా గ్రహింపనలవి గాని విషయమగుట వలన, విషయ కాఠిన్యము వలనను 'నా మేధస్సు యొక్క

అల్పత్వము, క్రమ          తీరుతెన్నులు స్ఫుటములు లేక చెప్పినదే చెప్పుట తటస్థించి యుండును. విషయము పరమార్థ సంబంధ మగుట చేతను 'నమిలినగాని రుచి తెలియదు అను నియమము ననుసరించి, నమిలి నమిలి నెమరు వేసిన గాని అందుగల భావము జీర్ణించుకొనుట సాధ్యముగాని దగుట వలనను (చేతను) నాయల్పత్వము ననుసరించి నాయోపిన కొలది తెలుపసాహసించితిని.  ఇందు పూర్తిగా బ్రహ్మతత్త్వము ఇమిడి యున్నది. ఇక శాస్త్రానుభవ సమ్మతమైన ఈ సమన్వయమును తప్పక  విచారించుటకు  గడుంగుదుము.

# కృషి ఫలితము

## కృషి ఫలితము

వేదాంత చరిత్ర యననేమి? అను ప్రశ్నకు చక్కని జవాబు. "స్వీయ చరిత్ర" యని నిరాంటకముగా చెప్పవచ్చును. అది ఎవరి చరిత్ర యని ప్రశ్నించుట అర్ధవిహీనము. ఎవరు చదువుదురో వారి చరిత్రయే. ఇది రెండు భాగముల సంపుటి. ఒక్కటి నేను అను విషయమునకు సంబంధించినది. రెండవది : "నేను కాని" దాని విషయమునకు సంబంధించినది. శాస్త్రములు (వేదములు) 'నే' నను పదార్థము 'ఆత్మయనియు' నేను కాని విషయ మంతయు 'అనాత్మ' యనియును నెరుక పరచుచున్నవి. జంతువు తాను జీవించుచున్నను జీవించు చున్నట్లెరుగదు. మానవుడటులనే జీవించుట పరమార్థమని తలంచుట తటస్థించెనేని 'ఆతడును పశుతుల్యుడే. సందియము లేదు. జీవించి నంత కాలము జీవితమునకు సంబంధించిన వ్యవహారమనివార్యమైనను, నాకీ వ్యవహారమెటుల కలిగినది నేనెవరు? జీవించుటననేమి? ఇక ముందేమగును? అను ప్రశ్నలు తట్టిన జీవి కొంత వరకు ధన్యుడని చెప్పనొప్పును.

'స్వీయ చరిత్ర' అనగా ఎవరిది వారిదే గాని అందరకు నన్వయించు నట్టిదిగా నుండునా? ఇటులుండుటకు వీలుపడునా? అను సందేహమునకు 'నీవాత్మవు' యని జీవునకుప దేశించుచున్న శ్రుతి – స్మృతుల వలనను, ప్రతి జీవియు ఎవరికి వారుగ నేను అని వ్యవహరించుట వలను, నేను, నీవు, వాడు– అది అను పదములు సర్వనామములు నేనను పదముల కర్థము సూచించుచున్నవగుట చేతను,

సర్వనేనులకు సంబంధించిన విషయమని నిరాతంకముగా చెప్పనగును.

అందువలన పై ప్రశ్నలు కలిగిన ప్రతి జీవియు, తన చరిత్రకాధార మగు వేదాంత శాస్త్రము చదువుట కర్తవ్యడగును. ఈ చరిత్ర విషయాంశములను తెలియగోరు వారికి జాతి – మత – కుల – గోత్రాదులడ్డురావు. మోక్షము పొందుటనునది సర్వజీవులకు జన్మ హక్కై యున్నది. ఇది శాస్త్ర సమ్మతము. కాని ఇట్టి హక్కు తమ తమ అర్హతలను బట్టి కలుగుననుటలో భేదాభిప్రాయము లేదు. దీనికి మూలాధారములు "భక్తి శ్రద్ధలు". ఇట్టి లౌకిక వ్యవహారములోని హక్కులు భుక్త పరచుకొను నియమ క్రమములు అనివార్యములు అనినప్పుడే "పరమార్థ భూతమగు" హక్కునకివెంత నీతి నియమము లుండు వలయునో గ్రహింపుడు. దీనిని బట్టి చూడగా "శిక్షయే" "కర్మ సిద్ధాంత రహస్యము". దీని పర్యవసాయము మనోవికారముగా పరిణమించి "సుస్వరూపముగ నవతరించును. దీనిని బట్టి "బ్రహ్మతత్వ విచారణార్హత" సర్వసంగ పరిత్యాగ మనియు, విరాగమున్నగాని కలుగదని గదా!

ఇది యొక వరుస క్రమము. ఈ వరుస యందు ముందు కర్మ భాగము సూచించబడినది. పిమ్మట శోకము నుదహరించిరి. (ఇది గీతా వాక్యము). శోకము వలన భక్తి జనించుట అభివృద్ధి గాంచుట జరుగును. శోక సమయము లందే దేవుని స్మరించుట – ధ్యానించుట జరుగును. గాని సుఖ సమయము లందు తలంచక పోవుటయే ఇందులకు నిదర్శనము. ఈ ప్రకారముగా భక్తి మార్గము సూచించబడినది. ఈ నియమానంతరమున ప్రాతిపదికగా విరాగము సూచింపబడినది. ఇట్టి నియమిత క్రమము నెచ్చుట మల్లంఘించినను లేక అవిశ్వాసమునకు లోనైనను, "మానవ గమ్యస్థానము"నకు దూరస్థులగుదుము అని నొక్కి వక్కాణింప నగును. ఇచటనొక ఆనందకర

విషయము స్ఫురించినది. కావున దాని నిందు పొందుపరచు చున్నాము. వేదాంత విచారణకు విరాగము ప్రాతిపదికయని తెలుసుకొంటిమి. విద్యుక్త కర్మాచరణ హృదయ గత మాలిన్యమును పారద్రోలి మానవుని వైరాగ్యోన్ముఖునిగా త్రిప్పును.

ఇట్టి స్థితి యందు నిష్కర్షగా కర్మ (యందుగాని) వలనగాని, సంతాపము వలన గాని (సంతానము), ధనము వలనగాని "అమృతత్వము" పొందబడ జాలదనియు, త్యాగ మొక్కటియే యని తెలిసిన బలము నిచ్చును. జ్ఞానము వలన గాని, "మోక్షము" లభించదనియు, అట్టి జ్ఞానము పొందుటకు కొన్ని అర్హతలున్న వనియును గ్రహింపవలెను. "నాన్యః ఫంథా అయనాయ విద్యతే" అని విద్య వలన జ్ఞానము పొంద తగినదే గాని మరియొక మార్గమున పొందుటసాధ్య మనియును, వేదమనగా 'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః" అను ఉపనిషద్వాక్యముచే జనించిన "జీవ బ్రహ్మైక విజ్ఞాన నిశ్చితార్థుల గుదురనియు" శ్రుతులు ఘోషించుచున్నవి.

గృహస్థు జ్ఞానము పొందరాదను నియమము లేదు. కాని విరాగమునకు జ్ఞానానుభవము చక్కని చేయూత నొసంగు మార్గము. వేదాంతర్గత జ్ఞాన సముపార్జనకు విరాగము ముఖ్యాంగమని తేలినది. దాని యుపకరణములు 'శమదమాదులు' ఈ సద్గుణ సంపత్తి యంతయు త్యాగ పరిణామ స్వరూపమే. ఇవన్నియు మనస్సును కుళ్ళబొడిచి అనగా సంస్కరించి, ఇచ్ఛవచ్చినట్లు ఎగురకుండునట్లుగా అధర్మము అను రెక్కలను కత్తిరించుటకే ఏర్పడినది.

ఇట్టి సంస్కారము వేద చోధితము. కర్మాధారము. ఇతర విధానములు మన స్సంస్కార జనితములు. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశు

చ్ఛ॥ అని గీతాచార్యులు చెప్పియున్నారు. బ్రహ్మతత్వోపదేశమిందు గుప్తముగా నిమిడియున్నది. సర్వధర్మములను వదలుము. నన్నే శరణు బొందుము. మీకు మోక్షము నిత్తును అని ఆతడు అభయహస్త మిచ్చెను గదా! ఇదియే ముందు సర్వధర్మములను వదలుమని హెచ్చరిక గదా! స్వధర్మములను త్యజించుట అసంభవము. మరియు స్వధర్మములనిన అవియేవియో మొదలు తెలియవలయును. అట్లు తెలియని యెడల త్యజించుటెట్లు? అసలు ధర్మమన నేమి? ఒక వస్తువును పట్టుకొని వదలని దానిని వస్తు ధర్మ మందురు. అగ్నికిష్టము స్వధర్మము, లోకమును ధరించునది ఆత్మ. అటులనే జీవము ధరించునది. కామము కాయమును వీడి, జీవముండదు. కావున జీవతత్వము నశించ వలయు నన్న దాని ధర్మమగు కామము నశించివలెను. జీవతత్వ నాశమే "బ్రహ్మత్వము". దానిని పొందుటకు వర్ణాశ్రమ ఆచారమే శరణ్యమని వేదాను శాసనము. వర్ణాశ్రమాచారములను విసర్జించిన యెడల స్వధర్మములను వాని అర్థములను ఇంకెట్లు సాధించగలము. వర్ణాశ్రమాచారములు లేని ధర్మమును త్యజించుటకు నంత సబబే. ఇట్లుగాక ధర్మ శబ్దమునకు వేరొక మార్గముకకుదురునేమో చూతము.

---

# నమ్రత - ధంభ శూన్యత

## నమ్రత - ధంభ శూన్యత

వీటన్నిటినీ సాధించుటకు నైతిక సాధనయను బలీయమైన 'పునాది' కావలెను. సత్యా సత్య వివేచన చేయుచు ఎల్లప్పుడును సత్యమునే గ్రహింపనగును. సదాచార విచారణ ద్వారా సారమునే గ్రహించుచుండవలెను, చిప్పలను పారవైచి, ముత్యములనే గ్రహించునటుల. ఈ విధముగా జీవితము, ఇటుపై స్వప్రయత్నము, "ఈశ్వరుని కృప", వీని బలముతో పురోగమించ వలెను. ఈ సాధనలతో మన దేహము నుండి "ఆత్మను వేరు చేయు నభ్యాసమును చేసినచో అది చాల సహకారి యగును.

దేహమొక కవచము. అది యొక తొడుగువలె వేరు చేసిన వేరు కాగలదు. దేహము నుండి ఆత్మను వేరు చేయవలె నన్న ఆలోచన కలిగినపుడెల్ల "శ్రీరామకృష్ణ పరమహంస" జీవిత చరిత్రయే నా కన్నులకు గట్టినట్లుగా కనుపించును. దేహము నుండి తాను పూర్తిగా వేరనియును, దానికిని తనకును ఉన్న సంబంధము తెంపిన తెగిపోవునదే యనియును ఆ మహాత్ముని చరిత్రయే స్పష్టము చేయుచున్నది. సత్యాసత్య వివేకముతో ప్రవర్తింపకున్న "దేహాత్మల పృధ్ధకరణ శక్యము గాదు. ఈ వివేకము– ఈ జ్ఞానము మన రోమరోమములకును వ్యాపించవలెను. 'జ్ఞాన' మనగా 'జిజ్ఞాస' యనగ తెలియకోరికయని అర్ధము చెప్పుదురు. కాని ముద్ద నోటిలో బెట్టుకొనునంతనే భోజనము కాదు. నోటిలో బెట్టుకున్న ముద్దను నమలవలెను. అది గొంతు నుండి జఠరమునకు పోవలెను. పోయి పచనమై దాని రసము రక్తముగా మారి శరీరము నందెల్ల ప్రవహించి

దేహమును పుష్టి మంతము చేయ వలెను. అప్పుడే అది నిజమగు భోజనము అనవలెను. అట్లే కేవలము బుద్ధిగత జ్ఞానము వలన ప్రయోజనము లేదు.

అవివేకము, అజ్ఞానము – జీవిత మంతయు వ్యాపించ వలెను. దాని సంచారము హృదయములో కనబడవలెను. "అజ్ఞానము" చేతులు– కాళ్ళు– కన్నులు మొదలైన ఇంద్రియముల ద్వారా ప్రకటితము కావలెను. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములకును వివేకముతో అన్ని పనులను చేయగల స్థితి గలుగవలెను.

ఇందుచేతనే "పండితులు" జ్ఞానమునకు చక్కని నిర్వచనము నిచ్చినారు. ఈ గుణములను జ్ఞానమని చెప్పి యూరకుండలేదు. దీనికి విరుద్ధమైన దంతయును 'అజ్ఞానమని సృష్టీకరించిరి. జ్ఞానోపార్జనకు చెప్పబడిన సాధననే (సద్గుణ) జ్ఞానమందురు. కాని వట్టి పాండిత్యము జ్ఞానమన బడదు. సద్గుణమునే జ్ఞానమందురు. సాధన – సాధ్యము రెండును నొక్కటియేనని "జ్ఞానదేవుడు" ఈ గుణములను పరిశీలించి చెప్పినాడు. ఆయన వర్ణించినవి పఠన యోగ్యములు. వానిని మననము చేసి మనము హృదయాంకితము చేసికొనదగి యున్నది. ఈ మధుర భాషణములను చదివి చవి చూచినందులకు నేను ధన్యనైతినని తలంచితిని. ఈ మధుర భాషణములను నేనలవరచుకొను శక్తిని ప్రసాదింపుమని 'జగజ్జననిని" ప్రార్థించు చున్నాను. అంతకంతకు వికాసమును పెంపొందించు కొనుచు దేహము నుండి "ఆత్మ" వేరని తెలిసికొనుచు అందరును తను జీవితములను "ఈశ్వరమయము" చేసుకొనుటకు ప్రయత్నము చేయుదము గాక.

## ప్రకృతి పరిశీలన

సృష్టి స్థితి లయములు లోకాలోకములు దేశకాల కలనలు,

ధర్మాధర్మములు, జీవులు మొదలగు సర్వ సారమే ప్రశ్నోత్తరముల మధ్య ఇమిడియున్నది. అజ్ఞానము వలన సంసారము ముగింపు జరుగును. (జరుగదు) 'జీవుడొక ధర్మి' అనేక ధర్మములను ధరించుచున్నవాడు. అట్టి స్వధర్మములను త్యజించిన యెడల స్వస్వరూపమున మిగులుదురు అని గ్రహించ వలెను. అజ్ఞానము నశించి 'తానాత్మను' అని తెలిసికొనిన జ్ఞానికి సర్వసందేహములు నశించి, అనగా హృదయ గ్రంథులు తెగి అభయనమృతత్వము లభించును. అని శ్రుతి స్మృతులు తెలుపుచున్నవి.

సర్వసంగ పరిత్యాగము వలన సూక్ష్మముగ విచారించిన 'అమృతత్వమే మిగులును. అదియే మోక్షము'. మోక్షమను వాక్యార్థము చాల నిగూఢ మైనది. బాహ్యముగ వర్ణాచారము లందుగల "సంగమము" వదులుట స్థూలము. వీనికి పునాదులు కాగల అన్న ప్రాణ మనో విజ్ఞాన ఆనందమయ కోశము(లు) అంతర్లీనమై యున్న బాల్యాది దశలు. జాగ్రత్, స్వప్న, సుషుప్త్యాది అవస్థలు 'అహంకార మమకారములు అనగా నేను, నాది అనుటలు. సర్వమును త్యజించుట సూక్ష్మ భాగములు. సంగ మనగా కలియుట (ఏకమగుట) దాతాత్మ్యము చెందుట. త్యజించుట యనగా తాదాత్మ్యమును వీడుట, నిరసించుట, కాదనుట అని తెలియవలెను. అట్లు తెలియుటయే నిషేధించుట. స్వధర్మమును వదలిన దాని ఫలమగును. అజ్ఞాన నివృత్తి ఆత్మ సాక్షాత్కరము కలుగగలవు. తాను సంగము లేని వాడననెడి జ్ఞానము "జీవులకు మోక్షము". ఇట్లు తెలియ గలిగిన వానిని "జ్ఞాని" యందురు.

పరతత్వ విచారణ వలన నీ యజ్ఞానము నశించును. అంతట నీ యథార్థ స్వరూపము బయట పడును. నీవే సత్య జ్ఞానానంద స్వరూపుడవని తెలియగలిగిన పురుషార్థ సిద్ధిని పొంది యజ్ఞాన బంధము నుండి విముక్తుడవై ఈ సంసార పరిభ్రమణము నుండి విరమించ గలిగిన నీ సహజానంద రూపమున వెలుగొంద గలవు. బ్రహ్మమును

తెలిసిన వాడు బ్రహ్మ యగును. బ్రహ్మ జ్ఞాని పరమపదమును పొందును. ఆత్మ తత్త్వజ్ఞాని శోకమును దాటును. పురుషుడు అజ్ఞాన జనిత జీవ భ్రాంతిని వీడిన 'ఈశ్వరాను గ్రహము'ను బడసి అట్టి యనురాగ స్వరూపుడగును.

ఆచార్యుని కృపాతిశయమున జ్ఞానానుభవమును పొంది స్వస్వరూపమున వెలుగొందు మని వేదములు హెచ్చరించు చున్నవి. ఇందుకు సాధనమును కనుగొందము.

వైద్యుడు రోగి యొక్క ప్రకృతిని బట్టి ఔషధమిచ్చునట్లే. భగవంతుడును ప్రకృతి నెల్ల పృధఃకరణ చేసి అందు దేని కే రోగములున్నవో నిరూపించి ఈ ప్రకృతి విభజన చక్కగా చేసినాడు.

రాజనీతి శాస్త్రములో విభజన సూత్రమని గొప్ప సూత్రమున్నది. ఎదుట నున్న శత్రువుల దళమును చీలదీయ గలిగినచో వారిని త్వరలో జయించవచ్చును. భగవంతుడు గూడ చేసిన పని యిదియే.

నా యొక్క నీ యొక్క జీవులన్నింటి యొక్క సర్వ చరాచరముల యొక్క ఈప్రకృతిలోను మూడు గుణములున్నవి. ఆయుర్వేదములో కఫ – వాత – పిత్తములున్నట్లు ఈ ప్రకృతిలో సత్వ – రజ – స్తమములను మూడు గుణములు గలవు. ఈ మూడు గుణముల సంపుటియే అంతయు నిండియున్నది. ఒక దాని గుణము తక్కువైన మరొక దాని గుణము హెచ్చుచుండును. ఇదే భేధము. ఈ మూడు గుణముల నుండి ఆత్మను వేరు చేయు విధానము – నిగ్రహము. నిగ్రహము ద్వారా రజస్తమోగుణములను జయించి చివరకు సత్వ గుణమును చేరవలెను.

## తమోగుణ వివరణ

మొదట తమోగుణమును తీసికొందము. ఆధునిక సమాజ

స్థితిలో తమోగుణము యొక్క భయానక పరిణామములు మనకు కనిపించు చున్నవి. దీని ముఖ్య పరిణామము సోమరితనము. దీని నుండియే నిద్ర, మరపు పుట్టును. ఈ మూడు విషయములను జయించినచో తమో గుణమును జయించి నట్లేనని భావింపుము. ఈ మూటిలో సోమరితనము మిగుల భయంకరమైనది. ఉత్తమోత్తములు కూడ సోమరితనము వలననే పనికిమాలిన వారగుచున్నారు.

సమాజము యొక్క శాంతి భద్రతలను పూర్తిగా నశింపజేయు 'శత్రువు' తమోగుణమేను. చిన్న వారి నుండి పెద్ద వారి వరకు ఇది పాడు చేయును. ఈ శత్రువు అందరిని తినివేయగలదు. మనలను వశపరచుకొనుటకిది పన్నాగములను పన్ను చుండును. ఏ కొంచెము అవకాశము చిక్కినను ఇది మనలో ప్రవేశించి తీరును. తినవలసిన దాని కంటే ఎక్కువ తిందువా! నడుము వాల్చమని నిన్నది వత్తిడి చేయును. అట్లు నడుము వాల్చితివా నీ కన్నులలో సోమరితనము తాండవమాడుచుండును. దీనిని మనము వశపరచుకోనంత వరకు మన ప్రయత్నములన్నియు వ్యర్థములేనని గ్రహించవలెను. కాని మనము సోమరితనమున కలవాటు పడితిమా! వృద్ధత్వము రాగానే విశ్రాంతి కావలెనని కోరుదుము. సోమరితనమునకు ఏ మాత్రమును తావులేని జాగరూకతను మనము సంపాదించవలెను.

శరీరమునకు సోమరితనము అబ్బినచో మన బుద్ధులు కూడ నశించును. దీని వలన మితిలేని దుఃఖము కలుగును. సోమరితనమును పోగొట్ట గలిగినచో మన దుఃఖములన్నిటినీ కాకపోయినను, పెక్కింటిని దూరము చేసికొన గలము. ఒక వైపు తుప్పు పట్టి పనికిరాని మనుష్యులున్నారు. శ్రీమంతుల ఇంద్రియములు పనిలేక తుప్పుపట్టు చున్నవి. రెండవ వైపున మితిమీరి పనిచేయు వారు కలరు. ఇట్లు శ్రమ చేయుట వలన బీదల శరీరములు అరిగి శిథిలమై పోవుచున్నవి. అందుచే

చదువుకొన్న విద్యాధికులు రకరకములగు పన్నాగములను పన్నుచున్నారు. "శరీర శ్రమతో కాలము నెందులకు వృధా పుచ్చవలెను" అని కొందరందరు. కాని వృధాగా నిద్ర ఎందులకు? భోజనము చేయుటతో సమయము నెందులకు వృధా చేయవలయునని మాత్రము ఎవ్వరును తలచరు. ఈ విధముగా సమాజములో రెండు తెగలవారు తయారైనారు. ఎడతెరిపి లేకుండగా కష్టించి మరణించు రకమొకటి, ఇక్కడి పుల్లను అక్కడ పెట్టకుండగా గడుపుకొను రకమొకటి గలవు.

సోమరితనము పోవలెనన్న శరీర పరిశ్రమ చేయవలెను. దీనిని జయించుట కొకటే యుపాయము. దీనిని ఆచరణలో నుంచక పోయినచో ప్రకృతి దండించక మానదు. రోగముల ద్వారా గాని, ప్రమాదము వలన గాని, ఏ విధముగా నైనను 'శిక్ష' ననుభవించ వలసినదే యగును. శరీర ధారులము గనుక శ్రమ పడవలసినదే. దానికి తగిన ప్రతిఫలము తప్పక లభించును. ఉత్తమమైన ఆరోగ్యము శ్రమపడుటచే లభించును.

ఇందుల కొకటే యుపాయమున్నది. అదే మనగా, అందరును శ్రమచేసి సోమరి తనమును వదులుటయే యుపాయము. దు్ఃఖము సోమరితనమున కలుగు చున్నది. అందరును శరీర శ్రమ చేసినచో దుఃఖము తొలగిపోవును.

## తమోగుణమును జయించుట

సోమరితనమును జయించుట తెలిసి కొంటిమి. ఇక నిద్రను జయించుట రెండవది. నిద్ర వస్తుతః పవిత్రమైనదే. సేవ చేసి అలసిపోయిన సాధు సజ్జనుల నిద్ర సాధనయే యగును. అదియే యోగ నిద్ర. (ఇదియే యోగము) ఇట్టి శాంతి నిచ్చు గాఢ నిద్ర అదృష్టవంతులకే లభ్యమగును. నిద్ర గాఢముగా నుండవలెను. నిద్ర యొక్క మహత్వము

దాని పరిణామముపై ఆధారపడి యుండును. నిద్ర సెజ్జ యొక్క వైశాల్యమును దానిపై మనుష్యులు పరుండు కాలము మీదను ఆధారపడి యుండును. నిద్ర పోవు సమయము కొంచెమైనను, ఆ నిద్ర గాఢ నిద్రయైనచో ఉత్తమ పరిణామము కలుగును. చంచలత్వముతో మూడు గంటలు చదివిన దానికంటె, తదేక నిష్ఠతో అరగంట చదువుటే ఎక్కువ ఫలము నిచ్చును. నిద్ర విషయము కూడ నింతే. రోగి ఇరువది నాలుగు గంటలును మంచము మీదనే పరుండి యుండును. మంచమునకు వానికిని ఎడ తెరిపిలేని సహవాస మున్నను, నిద్రకును వానికిని సంబంధ మేమియు నుండదు.

మరణానంతరము వచ్చు యమయాతనలు మనకు తెలియవుగాని, దుస్వప్నములు వెంటాడుటచే నిద్ర పట్టనివాడు పడు యాతన ఇంతింత కాదు. వేదకాలమునాటి ఋషులు పనికి మాలిన నిద్ర మాకు వలదనిరి. విశ్రాంతి కొఱకే నిద్రించ వలయును కాని దుస్వప్నములు, చెడ్డ బావనలు పట్టి పీడించు నిద్ర వలన విశ్రాంతి ఎక్కడిది? కాగా గాఢ నిద్ర పట్టుటెట్లు? సోమరి తనమునకు చెప్పిన యుపాయమే దీనికిని వర్తించును.

కాగా కొంత కాలము గ్రంథ పఠనము మీద దృష్టి, దీక్ష నిలిపినచో కొంత ఉపయోగ పడును. శరీరముతో నిరంతరము అలసి పోవునట్లు యేదో యొక పని చేయుచుండ, అప్పుడు ప్రక్క మీద వ్రాలగనే మనుష్యుడు మైమరిచి, శవము వలె పడి నిద్రపోవును. నిద్ర యనగా "చిన్న మృత్యువే" కమ్మని నిద్ర పట్టవలెనన్న శరీరము అలసిపోవలెను.

కాని పరమ పురుషార్థమును సాధించవలసిన ఈ జీవితమును నిద్రయే మ్రింగి వేసినచో ఇక పురుషార్థములను సాధించుటెట్లు? జీవితములో సగభాగము నిద్రతో గడచినచో మనమిక పొందదగిన దేమున్నది? చాల సమయము నిద్రతో గడచి పోయినచో తమోగుణము యొక్క మూడవ గుణమైన 'మరపు' సహజముగనే వచ్చి చేరును.

నిద్రాసక్తినితో దక్షత – జాగురూకత మృగ్యమగును. అందువలన 'అజాగ్రత్త' ఉత్పన్న మగును. అధిక నిద్ర వలన మరల సోమరితనమును, దాని వలన 'మరపు'ను పెరుగును. విస్మృతి పరమార్ధమును నశింప చేయును. ప్రాపంచిక దృష్టితో చూచినను విస్మృతి వలన ముప్పు వాట్టిల్లును.

కాని ఇప్పటి సమాజములో మరపు సామాన్యమైన విషయముగా మారినది. ఎవరినో కలసి కొనవలెనను కొందుము. వెళ్ళమను కొందుము. ఎవరైనా, ఆపనికి వెళ్ళలేదేమని ప్రశ్నించగా, అరే ఆ విషయమే "మరచి పోతిమి" అందుము. మరపునకు చికిత్సయే లేనట్లు మానవులు ప్రవర్తించు చుందురు. కాని ఈ పొరబాటు పారమార్థికముగను. ప్రాపంచికముగను చాల హానికరము. నిజమునకు 'మరపొకపెద్ద జాడ్యము'. దాని వలన బుద్ధిలో పురుగు పుట్టి డొల్ల చేయును. మానసికమైన 'అలసత్వము' మరపునకు కారణము. మనస్సు జాగురూకతతో నున్నచో మరపుండదు. సోమరిగా పడియుండు వానికి మరపను రోగము రాకమానదు. మరపు మృత్యువునకు పర్యాయపదమే. మరపును జయించవలెనన్న, సోమరితనమును, నిద్రను వశపరచుకొని శరీర శ్రమ చేయుచు సంతతము మనస్సును మేలుకొలుపుచు మెలకువతో నుండ వలెను. ఈ రీతిగా మనము తమోగుణమును జయించు ప్రయత్నము చేయుదము గాక!

## రజోగుణమును జయించుటలో స్వధర్మ నిర్వహణ

ఇక రజోగుణముపై దాడి జరుపవలెను. ఇది కూడ ఒక భయంకరమైన శత్రువు. ఇది తమోగుణము యొక్క రెండవ వైపు. ఈ రెండును పర్యాయ పదములే యనవచ్చును. మితిమీరిన నిద్రపోవువారు నిద్రలేవగానే యిష్టము వచ్చినట్లుగా తిరుగ నారంభింతురు (పరుగెత్తి)

తిరిగి పడుకొనవలెననుకొనును. ఇట్లు తమోగుణము నుండి రజోగుణము, రజోగుణము నుండి తిరిగి తమోగుణము కలుగుచుండును.

ఒకటి యున్న రెండవది కూడ వచ్చినదన్న మాటే. నిప్పుల మధ్యనున్న రొట్టెవలె మానవుడు తమోగుణ, రజోగుణముల మధ్య పడి యుండును. మానవుని ఇటు రమ్ము, నిన్ను తమోగుణము వైపునకు తన్నుదునని రజోగుణమును, నా యొద్దకు రమ్ము నిన్ను రజోగుణము వైపునకు గెంటుదును అని తమోగుణము ఈ రెండును, పరస్పర సహకారముతో మనుష్యుని నాశనము చేయును. పెక్కు రకములగు పనులను చేయ వలయునను పేరాస మానవాతీతమైన పనులను, అద్భుత కార్యములను చేయవలయునను అపారమగు ఆసక్తి రజోగుణమునకు ప్రధాన లక్ష్యము. రజోగుణము వలన అపారమైన 'కర్మాసక్తి' మనుష్యుని ఆవహించును. లోభాత్మకమైన 'కర్మాసక్తి' దాని వలన తదుపరి వాసనావికారముల వేగము హెచ్చును. అది అరికట్ట నలవికానిది యని తెలియవలెను. పక్షి ఆకాశములో ఎగురుచున్నట్లుగా మనము కూడ ఎగురవలెను. చేప నీటిలో నున్నట్లే మనము గూడ నీటిలో జలాంతర్గామిని నిర్మించుకొని నీటిలో తిరుగవలెననియు ఈ విధముగా నరజన్మ మెత్తియును పశుపక్ష్యాదులను అనుకరించుటలోనే కృతార్థత కలదని భావింతురు. గాఢముగా రజోగుణము యొక్క చేష్టలిట్లుండును. అనేక వాసనలనెడి పెను భూతము మనలో కుదురుకొని యున్నదా యనునట్లు 'చిత్తము' అదే పనిగ తిరుగుచుండును. రజోగుణము కలవాడు ఉన్న దానిని యున్నది యనుటను సహింపడు. అంతయును తారుమారు చేయవలెనని తలంచును. మానవుడు ఇవన్నియు రజోగుణ ప్రభావము వలననే చేయుచుండును.

'రజోగుణము' యొక్క రెండవ పరిణామమును పరిశీలింతము.

అది యేదనగా మనుష్యుని బుద్ధికి స్థిరత్వము లేదు. రజోగుణము కలవాడు తాత్కాలికములగు ఫలములనే కోరును. అందువలననే కొంచెము ఏ విఘ్నము కలిగినను వాడు వెంటనే అంగీకృత మార్గమును పొందలేడు. అతడు యొకదానిని స్వీకరించును. వేరొకదానిని విసర్జించును. అతని నిశ్చయములు క్షణక్షణమును మారుచుండును. ఇది వరకే వియును చేజిక్కక పోవుటయే దీని పరిణామము. "రజ్ఞ సంచలవద్ధ్రువం" రజోగుణ ప్రధానమగున వన్నియును చరాచరములు. 'అనిశ్చితములు'. చిన్న పిల్లలు గోధుమ గింజలను పాతిపెట్టి వెంటనే మరల వానిని పెల్లగించి, మొక్కలు వచ్చినవేమో యని చూచినట్లే. ఆ విధముగనే రాజసుడు కూడ ఫలము అప్పటికప్పుడే కనుపించకోరును. అంతలోననే యాతడధీరుడై పోవును. ఒకచోట గట్టిగా కాలూని నిలుచుట వానికి తెలియనే తెలియదు. ఇక్కడొక చిన్నపని నెరవేర్చును. అక్కడొక గౌరవమును పొందును. వెంటనే మూడవ చోటికి ప్రయాణ మగును. గౌరవ ప్రతిష్ఠలే వానికి ముఖ్యము. ఒక చోట నుండి పనిచేయు నలవాటు వాని కుండదు. ఇందువలన రజోగుణము కలవాని స్థితి చాల భయంకరముగ నుండును.

ఈ గుణము గల మనుష్యుడు అన్ని పనులలో నేనున్నా నను. స్వధర్మము వాని కుండదు. ఇతర కర్మల నన్నిటినీ వదలుటయే నిజమైన "స్వధర్మా చరణము". కర్మయే రజోగుణమునకు "రామబాణము". తన శక్తిని మానవుడు వివిధ కార్యములలో ప్రవేశపెట్టక దానిని ఏకముఖముగా తెచ్చి ఒక కార్యములోననే చక్కని పద్ధతిలో వినియోగించిన కొంత సులభమగును. ఇందువలననే స్వధర్మము చాల మహత్వము గలది. నిరంతరము స్వధర్మమును గూర్చి చింతన చేయుచు సమస్త శక్తిని చొప్పించ వలెను. స్వధర్మమున కిదియే యొరపిడిరాయి. దాని విశిష్టత ఇది. ఫలమునకై చూడక సహజ ప్రాప్తము

విసర్జింపరానిదియైన స్వధర్మమును నెరవేర్చుకొనుచు తద్వారా చిత్తశుద్ధిని పొందవలెను. చిత్తశుద్ధిని అపేక్షించని కర్మకలాపములు ఈ సృష్టిలో నెంత జరిగినను ఉపయోగము లేని వగును. స్వధర్మము నిశ్చయించుటెట్లనిన స్వాభావికమైనదని సులువుగా చెప్పనగును. అది సహజమైనది గనుక దానిని వెదుకవలెను ఆలోచన చిత్రమైనది. మనుష్యుని జన్మతోనే వాని స్వధర్మము కూడ జన్మించును. దాని కొరకెవ్వరును వెదుకనక్కర లేదు. మనకు పూర్వము నుండియు వచ్చుచున్న స్వధర్మమను ప్రవాహము మన తరువాత కూడ ప్రవహించును. అట్టి ప్రవాహములో మనము పుట్టి పెరిగి జీవించు చున్నారము. ఇతరుల మధ్య మనము పెరుగుటచే వారి సేవయును రెండు కర్మలు మనకు లభించుచున్నవి. ఇవి నిత్యానుభవములే గదా! నాకు ఆకలి దప్పికలున్నవి గనుక ఆకలి గొన్నవారికి అన్నము పెట్టుట, దప్పికగొన్న వారికి దప్పిక దీర్చుట సహజ ధర్మములు. "ఇది సేవా రూపము". ఎవరైనా "నా ధర్మమేమి' యని వెదుకుచున్నచో కొలదిగనో, గొప్పగనో వాడు పరధర్మములో గాని, అధర్మములో గాని పడియున్నాడనుట నిశ్చయము. ఇక సహజ ప్రాప్తమైనది 'సేవ' అని ప్రధానముగా గనబడుచున్నను అది నాకుపకరించ వలెను గదా! ఆ సేవలో నిమగ్నుడనై యుండుటయే శోభాకరము, అదే నన్నుద్ధరించగలదు. దీనిని వదలి మరియొక సేవ కొరకు వెదకినచో మొదటిది జారిపోవును. రెండవది చేజిక్కదు. అప్పుడు సేవావృత్తికే దూరమై పోదుము. చిత్తమున కేకాగ్రత కుదురుటయే దీనికి (కారణము) సాధన.

స్వధర్మ నిర్వహణ పట్ల మనమెంత శక్తిని వినియోగించినను అది స్వల్పమేయని తలంచవలెను. ఆ శక్తిని స్వధర్మ నిర్వహణలో వినియోగించినచో పరుగులు గంతులు వేయు రజోగుణము నశించును. దాని చంచలత్వ మంతయు కాలి క్రింద పెట్టి రాచినట్లగును.

రజోగుణమునిట్లుగా వశపరుచుకొనవలెను.

## సత్వగుణము దానిని జయించుట

ఇక మిగిలి యున్నది సత్వగుణము. దీని నుండి ఆత్మను వేరుచేయుటెట్లు? సూక్ష్మముగా పరిశీలింతము. సత్వగుణము నొక్కసారిగా నిర్మూలింపరాదు. రజస్తమో గుణములను పూర్తిగా నాశనము చేయ వలెనేగాని సత్వగుణము యొక్క భూమిక వేరు. దీనిని గాయపరుప వలెనేగాని "చంపరాదు". రజస్సు తమస్సు గుణములు నశించిన తరువాత శుద్ధ సత్వము మిగిలి యుండును. ఈ శరీరమున్నంత వరకును మనము ఇందేదో యొక స్థితి యందుండక తప్పదు.

ప్ర. ఇట్లు రజస్తమోగుణములను వదలిన తరువాత మిగిలిన సత్వగుణము నుండి వేరగుటననేమి?

నేను 'సాత్వికుడను' అను దురభిమానము మానవునిలో ప్రవేశించినపుడు అది 'ఆత్మను' శుద్ధ సత్వము నుండి క్రిందికి లాగును.

లాంతరు వెలుగు బాగుగా అంతటను వ్యాపించవలెనన్న అద్దము లోపలి మసిని పూర్తిగా తుడిచివేయవలెను. ఇంకను మన్ను మిగిలి యున్నచో శుభ్రముగా తుడిచివేయవలెను. ఈ విధముగనే 'ఆత్మప్రభను' కట్టి చుట్టును పేరుకొని యున్న రజస్తమోగుణములను తుడిచివేయ వలెను. ఈ విధముగా ఈ రెండు గుణములను తుడిచివేయుగా స్వగుణమగు అద్ధము మిగిలి యుండును. ఈ సత్వగుణమును కూడ దూరము చేయవలెనన్న అద్దమును బ్రద్దలు కొట్టమని కాదు. అద్దము పగిలిన లాంతరు అను పనిముట్టు చెడిపోవును. జ్యోతి యొక్క ప్రకాశము వ్యాపించవలెనన్న అద్దము అవసరము. ఆ ప్రకాశమున మన కనులు మిరిమిట్లు గొనకుండ వలెనన్న ఒక కాగితపు ముక్కను అద్దముపై

అడ్డము పెట్టుటయే యుపాయము. సత్వగుణమును జయించ వలెనన్న దాని యందు మనకుండు దురభిమానమును, ఆసక్తినీ తొలగించుకొనుటయే. దాని కొక పద్ధతిగ ఉపాయమునుపయోగించి, సత్వ గుణమును అహంకార రహితముగా చేసికొనవలెను.

ప్ర. కాగా ఈ సత్వగుణము వలన కలుగు అహంకారమును జయించుటెట్లు?

జ. దీని కొక యుపాయమున్నది. మనలో సత్వగుణమును స్థిరపరచుకొందము గాక. అంత్యసమయము వరకును 'సాత్విక కర్మనే' మనము చేయుచుండవలెను. అది స్వాభావికమై పోవును. ఈ పద్ధతి నవలంభించిన దురభిమానము తొలగిపోవును. సత్వగుణము మనలో నుండు అతిధిగా నుండరాదు. అది మన ఇంటి మనిషిగా నుండవలెను. మనవొుక మంచిపని చేసినచో దాని వలన మనకు దురభిమానమేర్పడును. ఇది ఎందువలన గలుగుననగా మంచి పనులు చేయునలవాటు అతనికి సహజముగా లేదు. కాబట్టి ఈ విధముగా మన పనులలో సత్వగుణము నిరంతరమును ప్రకటితమగు చున్నచో అది మనకు స్వభావసిద్ధమైపోవును. సింహమునకు తనపట్ల శౌర్యము, దురభిమాన ముండునాయన్న, ఆ స్పృహయే దానికుండదు. ఈ విధముగనే సాత్విక వృత్తి గలవాడను అను స్మృతి కూడ లేనట్లుగా నీలో సాత్వికవృత్తి సహజముగ గలవానిగా చేసికొనుము. సత్వగుణ మతని రోమరోమము లందు వ్యాపించ వలెను.

ఈ విధముగా సాగిన మన స్వభావము సత్వగుణమైపోవును. "నేను సాత్విక కర్మను" చేయుచున్నాను అను అభిమానముండదు. అది యొక యుపాయము. సత్వగుణమును గూర్చిన ఆసక్తిని గూడ వదలుట, అహంకారము- ఆసక్తి రెండును వేరు వేరు విషయములు.

దీనిలో భేదము కొంచెము సున్నితమైనది. అందువలన దృష్టాంతము ద్వారా ఇది త్వరగా తెలియదు. నేను సత్వగుణుడను అను అహంకారము పోయినను, ఆసక్తి మాత్రము నిలిచియుండును. సత్వగుణము నెడల గూడ నిటువంటి ఆసక్తి యుండునని అందరెరుంగ వలెను. ఉదాహరణము. భూతదయను తీసికొనుడు. ఈ గుణము చాల ఉపయోగకరమైనది. కాని దీని యందు కూడ ఆసక్తి యుండ రాదు. “మహాత్ములీ సత్వగుణము వలననే ఇతరులకు మార్గదర్శకులైరి. వారిలో నున్న దయ వలన వారి శరీరములు ఎల్లరకు నుపయోగపడు చుండును. మహాత్ములు దేహశక్తిని విడిచి పెట్టుదురు. అట్లే మనము సత్వ గుణమును మనలో ఇంకునట్లు చేసుకొనవలెను.

మొదట అహంకారమును తరువాత ఆసక్తిని జయింపుము. సాతత్వము వలన అహంకారము జయింపబడును. ఫలాసక్తిని వదలి సత్వగుణము వలన లభించిన ఫలమును గూడ “ఈశ్వరార్పితము” చేయుట వలన ఆసక్తిని జయింపవచ్చును. జీవితములో సత్వగుణము జయింపబడిన, తరువాత ఒకప్పుడు ‘సిద్ధి’ రూపములోను వేరొకప్పుడు ‘కీర్తి’ రూపములోను దాని ఫలితము కనబడును. ఆ ఫలమును గూడ తుచ్ఛముగా భావింపుము (భావింపవలసినదేను). భోగము కంటె త్యాగమే ఎక్కువ మధురమైనది. ఈ విధముగా ‘సత్వగుణము’ను ఎల్లప్పుడును ఆచరణలో నుంచుట ద్వారా ‘నేను సత్వగుణుడను’ అను అహంకారమును జయించి తటస్థముగా నుండి ఫలములను ‘ఈశ్వరార్పణము’ చేసి దాని యాసక్తి నుండి గూడ విముక్తిని పొందవలెను. అప్పుడే సత్వగుణముపై గూడ ‘విజయము’ కలిగినదని చెప్పనొప్పును.

# ఆత్మజ్ఞానమునకాధారము - భక్తి

## ఆత్మజ్ఞానమునకాధారము - భక్తి

చివరకు చెప్పవలసిన దొకటున్నది. ఉత్తమ సత్వగుణుడవు కావచ్చును. అహంకారమును జయించవచ్చును. ఫలాసక్తిని వదలవచ్చును. అయినను శరీరమున్నంత వరకు మధ్య మధ్య రజస్తమముల దాడి నీపై జరుగుచునే యుండును. ఈ గుణమును జయించినట్లే తోచును. గాని, తిరిగి వాని తీవ్రత పెరుగుచునే యుండును. అందువలన నిరంతరమును జాగరూకతతో నుండవలెను.

"సముద్ర జలము కెరటముల ద్వారా వేగముగా వచ్చి గట్లను కోసికొని లోనికి ప్రవేశించి నట్లే" రజస్తమములు ప్రవాహ వేగమున మనో భూమిలో ప్రవేశించి "అఘాతములు" కలుగ చేయు చుండును. అందువలన నీలో యేమాత్రమును తూట్లు పడకుండా, గట్టి బందో బస్తును చేసికొనుము. రజస్తమములపై పహరానుంచుము. ఎంత యవధానముతో, దక్షతతో ప్రవర్తించినను "ఆత్మ జ్ఞానము - ఆత్మ దర్శనము' కలుగ నంత వరకును "ప్రమాదము కలదని తెలిసికొనుము". అన్ని విధముల ప్రయత్నించి ఆత్మజ్ఞానమును సంపాదింపుము. మెలకువతో మెలగినంత మాత్రమున, ఆత్మజ్ఞానము కలుగనేరదు. మరెట్లు కలుగును? అభ్యాసము చేతనా? కాదు. దానికొకటే యుపాయము. అది నిజమైన హృదయముతో భగవద్భక్తి గలిగి యుండుట వలన రజస్తమో గుణములను జయించవచ్చును. అంతమాత్రము చేత ఆత్మజ్ఞానము కలుగనేరదు. అది కలుగనంత వరకును జీవితమునకు కృతార్థత లేదు. చివరకు కావలసినది

భగవత్కృపయే. సత్య హృదయముతో చేయు భక్తి సాధన ద్వారా భగవంతుని కృపకు పాత్రులు కావలెను. ఇది వినావేరు మార్గము లేదు. (కనబడదు గూడ) ఇది భక్తి యొక్క "సరళ మార్గము" ఏకైక మార్గము.

రజస్తమో గుణములను నిగ్రహముతో త్యజింపుము. సత్వ గుణము వికసింపజేసికొని దాని యందలి ఆసక్తిని జయింపుము. ఈ విధముగా చేయు ప్రయత్నములు, పూర్తిగా ఫలవంతములగుటకు ఆత్మజ్ఞానము అవసర మనియు, భక్తి లేనిచో ఆత్మ జ్ఞానము కలుగుట అసంభవమని చెప్పవచ్చును. కాని భక్తి మార్గము ప్రయత్న మార్గము నుండి వేరైనది. ప్రయత్నముతో ఆత్మ జ్ఞానమును భక్తిలో జోడించినపుడు పూర్ణతత్వము సిద్ధించును. భక్తి ప్రయత్న మార్గములో నొక భాగమే. ఆత్మజ్ఞానము భక్తి సాధనలకు అంగములు. జాగ్రత్త గల వారి యొద్దకు 'వేదనారాయణుడు' తనంత తానే వచ్చును. జ్ఞానము భక్తి కూడ వచ్చును. భక్తి, జ్ఞానములు వేరుకావు. ఈ రెండు తత్వములును ప్రయత్న మార్గమునకు 'మాధుర్యమును' చేకూర్చునవి. కనుక ఏకాగ్రతచిత్తముతో భక్తి జ్ఞానముల స్వరూపములను 'చిత్రించుటను' విందుము గాక! నేను జీవితమును ముక్కలు చేయజాలను. భక్తి, జ్ఞాన, కర్మలను వేరు వేరుగా భావింపజాలను. నిజమున కవి వేరుకానే కావు. వీనికి తోడుగ 'తపశ్చర్య' కావలెను. తాపమును సహించి కష్టపడకుండ వంట ఎట్లు చేయగలము? (జరుగును). ఇట్లే ఏ పనిగాని చేయవలెనన్న కర్మ – జ్ఞాన – ప్రేమలు మూడును అవసరమేనని దీని వలన ఋజువగుచున్నది. మనము చేయు పనులన్నియు ఈ మూడు గుణముల పైననే ఆధారపడి యుండును. తర్కదృష్టితో జూచిన కర్మ – జ్ఞాన– భక్తులను వేరు వేరుగ జూడవచ్చును. ప్రత్యక్షముగా వీనిని మనము విడదీయలేము. ఈ మూడును కలసిన యొక విశాల వస్తువే యగును. వీనిలో కూడ భక్తిలో గుణాధిక్యత లేదని నేనన‌ను. ఏ కర్మ జ్ఞానములో నైనను భక్తి కలసి నప్పుడే అది

సులభమనిపించును. అనగా అందు కష్టము లేదని కాదు. కాని ఆ కష్టము కష్టమని పించదు. మీదు మిక్కిలి ఆనందదాయక మగును. అప్పుడు "శూలము" పుష్పము వలె దోచును. భక్తి మార్గము సులభమగుటలో భక్తి వలన కర్మ బరువనిపించదు. భక్తిచే కర్మలోని కాఠిన్యత పోవును. ఎన్ని కర్మలు మనమాచరించినను వానిని చేయుచున్నట్లుగనే యుండదు.

సుధన్వుడను రాజు సల సల కాగుచున్న నూనె పాత్రలో నుండి కూడ నవ్వుచునే "కృష్ణా! హరి! గోవిందా! విష్ణుయని హరి నామస్మరణ చేయుచుండెనట. దీని అర్థమేమన అంతులేని కష్టములు వచ్చిపై బడినను, భక్తి ప్రభావము వలన వారినవి బాధింపవు. "నీటిపై దేలు నావను నెట్టుట కష్టముగాదు కాని దానిని భూమి మీద ఈడ్వవలెనన్న నెంతయో కష్టమగును. నావ క్రింద నీరుండినచో నావ సులువుగ దాటిపోగలదు. ఈ విధముగనే "మన జీవిత నౌకకు" అడుగున భక్తి యను నీరున్నచో దానిని ఆనందముతో నడుపుకొని పోగలము. కాని జీవితము "శుష్కమైనచో మార్గమంతయు" కంటకమయము. శిలా కంటకమయము అయి గోతులతో గుట్టలతో నిండియున్నచో జీవన నావ నీడ్చుకొని పోవుట చాల దుష్కరము. "భక్తితత్త్వము" నీటి వలె మన "జీవితనౌకను" ఒడ్డున జేర్చును.

భక్తి మార్గము వలన సాధనలో సౌలభ్యమేర్పడును. నిరంతర సత్వగుణ సాధన వల వానితో తానేక రూపమై నేను సత్వగుణుడను అను అహంకారమును సత్వ గుణ ఫలాసక్తిని భక్తి ద్వారా జయించు ప్రయత్నమే 'సాధన'. ఈ సాధన ద్వారా నిరంతర ప్రయత్నము చేయు చున్నచో ఒకప్పుడు ఆత్మదర్శన మగును. అంత వరకును మన ప్రయత్నము పూర్తి కానేరదు. ఇందు పరమ పరుషార్థము ఇమిడి యున్నది. ఆత్మ దర్శనమన నవ్వులాటగాదు. దానికై నిరంతర ప్రయత్నము

ప్రవాహమువలె పారుచుండవలెను. ఇవి వినా పరమార్థమునకు వేరొక సాధనయే లేదు. పరమార్థమునకున్న "షరతు" లివియేయని తెలియనగును. అధీరత నిరాశలనుండి ఎన్నడును భక్తి (గాక) తప్ప నిన్నుద్ధరింప జాలదు. భక్తి మార్గములో విసుగుదలకు తావేయుండరాదు. భక్తి సాధనలో పోను పోను ఉల్లాసమును, ఉత్సాహమును కలుగుటకు చక్కని భావములు వ్యక్తపరుప బడియున్నవి.

## సేవ్యుడు – సేవకుడు

ఈ విశ్వములో మన కసంఖ్యాకములగు వస్తువులు కనబడుచుండును. వీనిని మూడు భాగములుగా చేయుదుము. భక్తుడు నిద్రలేవగనే మూడు వస్తువులతని దృష్టికి గోచరించును. ఆతని దృష్టి భగవంతుని వైపునకు తిరుగవలెను. అప్పుడతను పూజకు కావలసిన (వస్తు)వన్నియు సిద్ధము చేసికొనును. "నేను సేవించు భక్తుడను. అతడు సేవ్యుడైన "భగవంతుడు, ప్రభువనని ఈ రెండు భావము లెల్లప్పుడును అతని మనస్సున పట్టి యుండ వలెను. ఇక మిగిలినది దృష్టి. అది యతని పూజకై యుపయోగించు సాధన సామాగ్రి పుష్పములు.
గంధము, ధూప దీపములు ఈ సృష్టి యంతయు నున్నవి మూడే వస్తువులు. ఒకరు సేవకుడైన భక్తుడు, రెండు సేవ్యుడైన పరమాత్మ. మూడు సేవకు సాధన భూతమైన ఈ సృష్టి. ఈ శిక్షయే మనము తెలియదగినది.

తపశ్చర్య – కర్మ సాధన అన్నియు పరమేశ్వరుని సేవకు సాధనలే యగును. మనము పుష్పములు గంధము, ధూపదీపములు మరి కొన్నిటిని నైవేద్యము అని అనుకొన వలెను. ఈ మూడు వస్తువులే భక్తి రూపమున త్యాగ సాధనకు మార్గమగుచున్నవి. సేవాకార్యము లధికమైన కొలది 'ఆశ్రమ వాసి'కి ఆనందమధిక మగును. ఈ యనుభవము సర్వత్ర

మనకు కలుగుచుండ వలెను.

జీవితము సేవా పరాయణమై పోవునట్లు చేసు కొనవలెను. అనుక్షణము మార్పు చెందునది, అనంత రూపములతో అలంకృత మైనది సృష్టినే పూజా సాధనముగను, సేవా సాధనగను చేసుకొన వలెను. మనము చేయు ప్రతి కార్యమును "పురుషోత్తముని" పూజయే యనునట్లుండ వలెను. సేవ్య పరమాత్మయే పురుషోత్తముడు. సేవకుడైన జీవుడు అక్షర పురుషుడు. కాని సాధన రూపమగు సృష్టి మాత్రము క్షరము. ఇది క్షరమనుటలో చాల నర్థమున్నది. రోజు రోజునకును క్రొత్త క్రొత్త పుష్పములు సేవకై దొరకును. ఆ విధముగ నేను నూతన శరీరమును ధరించి ఈశ్వరసేవ చేయు చుందును. నేను నిత్య నూతన రూపములు నొందుచు వాని ద్వారా ఆయన పూజ చేయుదును. ఈ నశ్వరత్వము వలననే సృష్టికీ రూపము వచ్చినది. సృష్టి యొక్క నశ్వరత్వములోననే దాని 'యమరత్వము'. సారాంశమిది. నశ్వరత్వమే సృష్టి యొక్క "క్షరత్వము". అనగా సాధనల యొక్క నూతనత్వమనియే అర్థము. ఈ విధముగా క్రొత్త క్రొత్త సాధన సామగ్రి నిచ్చు (1) ఈ సృష్టి = (2) సనాతన సేవకుడు – (3) సేవ్య పరమాత్మ. ఈ మూడు మనకు గనుపించు చున్నవి. ఇక వీని మధ్య ఆట సాగనిమ్ము! ఆ పురుషోత్తముడు క్రొత్త క్రొత్త సేవా కార్య సాధనలను ఇచ్చి నా వలన ప్రేమ పూర్వకమైన సేవను పొందుచున్నాడు. నాచే ఆటలాడించు చున్నాడు. ఇట్టి భావనలతో జీవిత యాత్రను సాగించిన ఎంతయో ఆనందము లభించగలదు.

## సేవయే – భక్తి

మనము చేయు ప్రతి కార్యమును భక్తి మయముగా నుండవలెను. గంటయో – అరగంటయో – మనము పూజ చేయుట మంచిదే. ఉదయ, సాయంకాలములు సూర్యప్రభ శోభిల్లుచుండగా 'చిత్తమును

స్థిరపరచుకొని' కొంత సేపు ప్రపంచమును విస్మరించి, ఆ అనంతుని గూర్చిన చింతన చేయుట ఉత్తమమైన కార్యము. ఈ సదాచారము నెన్నడును మరువరాదు. కాని ఉదయము మొదలు సాయంకాలము వరకును చేయు కార్యములన్నియు భగవంతుని పూజగా జరుగవలెను. ఆతడు "సేవ్యపురుషోత్తముడు. నేనతని సేవకుడును. ఈ సృష్టి యంతయు సేవకు సాధనము. ఈ రూపములో నొకసారి (విలోకించిన) దర్శించగలిగినచో ఇంక కావలసినదేమున్నది. అప్పుడు మన వలన "అఖండమైన" సేవ జరుగును. 'నేను' అనునది ఏ మాత్రమును మిగలదు. నేను -నాది-కూడ తుడిచిపెట్టుకొని పోవును. ఇక ఉన్న దంతయు పరహితార్థము కాగలదు. భగవంతుని కొరకే అహంకారములను వదులుకొని జీవితమును 'హరిపరాయణము' గావించుకొని భక్తిమయ జీవితమును గడపుమని మనకు 'ఉపనిషత్తులు బోధించుచున్నవి. ఇక జీవితములో మరే విషయమును గూర్చిన చింతయే యుండదు.

# జ్ఞాన లక్షణములు

## జ్ఞాన లక్షణములు

కర్మతో జ్ఞానమును జోడించవలెనని మనమింత వరకు తెలిసికొంటిమి. కాని దానితో 'భక్తిని' కూడ కలిపినచో ఎంతయో మేలనునది (తృప్తిలేదు) (ఇది గీతావాక్యము). దీనిని బట్టి కర్మ – జ్ఞానము – భక్తి వేరువేరని తలంచరాదు. మనకు బోధపడుట కొరకే (వేరు వేరు) (మార్పులు) మాటలతో చెప్పియున్నారు (చెప్పుకొందము)– జ్ఞాన మనునదే 'భక్తి'. భక్తి నెచ్చట నుండియో తెచ్చి సాధనలో కలుప పనిలేదు. జ్ఞాన విషయము గూడ నింతియే.

ప్ర. ఈ జ్ఞానము ఎట్లు కలుగును?

జ. సర్వ పురుష దర్శనము వలనని ఇంగితము బోధించుచున్నది. సేవ చేయు సనాతన సేవకుడవు. సేవా పురుషుడవు నీవు. ఆ పురుషోత్తముడే సేవ్య పురుషుడు.

అనంత రూపధారిణి, వివిధ సాధన దాయినియైన సృష్టి కూడ పురుషుడే యనునట్టి తృప్తి కలిగి యుండుట మానవుడు సేవా సాధనలందును. ఉత్కృష్టముగాను నిర్మలముగా నుంచి వానిచేత పనులను జరుపుకోవలెను.

నేనక్షర పురుషుడను. ఆతడు పురుషోత్తముడు. సాధనరూపమైన కృషి కూడ పురుషుడే. సర్వత్ర యొక చైతన్యమే మిగిలి యున్నది– యను దృష్టి కలిగినపుడు మన కర్మలోనికి జ్ఞానము కూడ వచ్చి చేరినట్లే. మొదట జ్ఞానమును కలుపుకోవలెను. తరువాత భక్తిని. భక్తిని కూడ

కలిపినచో దాని నుండి అపూర్వమైన జీవరసాయనము తయారగును. ఈ సర్వసృష్టిలో నెక్కడ చూచినను ముగ్గురు పురుషులే ప్రత్యక్షమగుచున్నారు. ఒక్కరైన పురుషోత్తముడే ఈ మూడు రూపములు ధరించు చున్నాడు. వాస్తవమునకు ఈ మూడును కలసి ఒక్క 'పురుషుడే'. ఇది కేవల మద్వైత స్థితి. కర్మ, భక్తి జ్ఞానము. ఈ మూడు రూపములు ఏకమై పోవును. జీవుడు – ఈశ్వరుడు – సృష్టి. ఇవన్నియు యొక రూపమే. కర్మ, భక్తి, జ్ఞానముల మధ్య ఎట్టి వైరుధ్యమును లేదనితెలియ నగును.

"ఒక రాతిని" "తొలిచి". దేవళమును నిర్మించి ఆ దేవళములోననే విగ్రహమును సృష్టించి, ఆ విగ్రహము నెదుట ఒక భక్తుని, ఆతడు సమర్పించు పండ్లను గూడ ఆ రాతిలోననే యేర్పరచును. ఒక మహాశిలలోననే ఇన్ని రూపములను యేర్పరచిరే. భక్తుని విషయము గూడ నిటువంటిదే. స్వామి, సేవకుడు అను అనుబంధములో నున్నప్పటికిని ఏకత్వమెందు కుండరాదు? పూజా ద్రవ్యమగు బాహ్య సృష్టి వేరుగ నున్నప్పటికిని అది ఆత్మ రూపము నేల పొందరాదు? కర్మ, జ్ఞానము. భక్తి ఈ మూడింటిని కలిపి 'ఒక విశాల' జీవన ప్రవాహము నేరుప వచ్చును. స్వామి, సేవకుడు, సేవా ధర్మములు అన్నియు ఏకరూపములే కద! ఇక భక్తిని – ప్రేమగా చెప్పు విషయములు గమనింతము.

ఇట్టి పురుషుడు జ్ఞానియై యున్నను పదునారణాల భక్తుడై యుండడు. ఎవరిలో జ్ఞాన మున్నదో వారిలో ప్రేమ కూడ నుండును. పరమేశ్వరుని గూర్చిన జ్ఞాన – ప్రేమ – భక్తి వేరు వేరు కానేరవు. "కాకరకాయ చేదు' అను మనోవృత్తి యున్న చోట దానిపై ప్రేమ పుట్టదు. ఇట్టి స్థితిలో గూడ ప్రేమను నిలబెట్టుకొను వారు కొందరుందరు. చేదు ననుభవించుపట్ల మనస్సు విసువు జెందును గాని తియ్యదనము మాట

స్ఫురింపగనే చేదుయెడ గల వైమనస్యము తొలగి పోవును. వెంటనే ప్రేమ ప్రవాహమువలె వెల్లి విరియును. పరమేశ్వర సంబంధమగు జ్ఞానమ కలుగుటయు, ప్రేమ యుత్పన్నమగుటయు నొక్కటియే యని గ్రహింప నగును. జ్ఞానము కలుగుట, ప్రేమ కలుగుట యను నీ రెండు క్రియలును భిన్నములు కావని తెలిసికొనుము. భక్తి – జ్ఞానము ఇవి యొక వస్తువు యొక్క రెండు పేరులని గ్రహింపుడు. ఇవి విరుద్ధములుగా నుండవు. ఇవి కర్మ, భక్తి, జ్ఞానము కలసిన ఒక రమణీయమ్మైన రూపమగును. ఈ రూపము నుండి ప్రేమ, జ్ఞానమయమయిన అద్భుత సేవ సహజముగ గలుగును. ప్రేమ ఎంత కష్టమైనను సహించగలదు. సేవ ద్వారా అది ప్రకటితమగును. ప్రేమ యొక్క బాహ్యరూపమే సేవ. ప్రేమ సాధనల మూలమున నలంకృతమై నృత్యము చేయును. ప్రేమ యున్నచోట జ్ఞానము ఉండి తీరును. ఎవరికి నేను సేవ చేయుచుంటినో, వారికెట్టి సేవ ప్రియమో – అది ముఖ్యముగా తెలియవలెను. అది లేని యెడల సేవ (అసేవ) దుస్సేవయే యగును. సేవ్య వస్తువును గూర్చిన జ్ఞానము ప్రేమ కుండవలెను. ప్రేమ యొక్క ప్రభావములను కార్యములు ద్వారా వ్యాపింపజేయుటకు. జ్ఞానమవసరము. దాని మూలమున ప్రేమ యుండ వలెను. అది లేనిచో జ్ఞానము నిరుపయోగము. ప్రేమతో చేయు కర్మ సామాన్య కర్మ కంటె భిన్నముగ నుండును. ఈ పని చిన్నదేయైనను దీనికెంత సామర్థ్య మున్నదో చూతము. నీ జీవిత కార్యములన్నిటి యందును భక్తి – జ్ఞాన – ప్రేమల సమ్మిళితము చేయుము దానినే మహాత్ములు యోగమందురు.

దేవీ సంపద లేక యోగము జీవిత ప్రణాళిక యెట్లుండవలెనో మన జన్మము నెట్లు సఫల పరచుకొనగలమో భక్తి తత్వమును అనేక రీతుల విచారణ చేసినారము. సగుణ నిర్గుణ, భక్తి రూపములను భక్తుల యుత్తమ లక్షణములను (పోల్చి) తెలిసికొన్నారము. కర్మ భక్తి ఈ రెంటి

స్థితిని పరిశీలించినారము. ఇక జ్ఞానమను మూడవ విభాగమును తరచి తరచి దాని కొరకై త్రిగుణములను జయించి ఆత్మను వేరు చేయుట. చివరకు "సర్వజగత్ప్రభువును" దర్శించుట యెట్లో చూచినారము. సంపూర్ణముగా జీవిత శాస్త్రమును అవగతము చేసికొన్నారము. పూర్ణతత్వము పొందితిమి. దాని తరువాత నిక మిగిలిన దేమియును లేదనియే భావింపు చున్నాను.

కర్మ – జ్ఞానము – భక్తి వీని మూటిని విడదీయుటకు సహింపరు. కొందరు కేవలము కర్మ వైపునకే మ్రొగ్గియుందురు. మరికొందరి ధోరణి జ్ఞానము వైపునకే మరలును. జీవిత మనగా ఒక్క దానికే ప్రాధాన్య మీయుటంత సమంజసము గాదు. కర్మయే భక్తి. భక్తియే జ్ఞానము. జ్ఞానము కర్మ అను అనుభవమును పొంద వలయునననుదే నా కోరిక. "మధురమును చవిచూచిననే దాని తీపిని తెలుసుకొన గలము". ఆ విధముగనే జీవితములోని ప్రతి క్రియ యందును పరమార్థము నిండి యున్నట్లు గ్రహించి ప్రతికార్యము నందును సేవ – జ్ఞానము. ప్రేమ, భక్తి మయములు కావలెను. జీవిత విభాగము లన్నిటిలో కర్మ, జ్ఞాన, భక్తులు నిండియుండునట్లు 'సాధన' చేయుటయే 'దైవీ సంపద' యని గ్రహింపనగును. జీవితము నెల్ల పరమార్థమయము చేయుమను మాట చెప్పుట చాల సులభము. ఈ భావన ఆచరణలోనికి రావలెనన్న శుద్ధమైన భక్తి, జ్ఞానములతో హృదయమును వికసింప చేసుకొనుము. సాధన చేయవలెను. ఈ 'ఉత్కృష్ట స్థితినే' యోగమందురు. దీనితో నీ జీవితము చరమ దశను పొందును.

ఈ విధముగా మనము చేసిన సాధనలోనో, మనకు వాటి నుండి కలిగిన అనుభవములోనో, ఎన్ని సద్గుణములు మనలో ప్రవేశించినవో దీనిని పరిశీలించుటకు ఈ పై వాక్యములే దారి చూపును. జీవిత కళ ఎంత పురోగమించి వృద్ధి చెందినదో 'కొలచి' చూచుకొనుమని మనకు

తెలియజేయు చున్నది. దీనినే 'దైవీ సంపద' యందురు. వీనికి వ్యతిరేకమైన వృత్తులను "ఆసురీ సంపద" యందురు అని తెలియవలెను.

---

# ప్రళయము : శాస్త్రము

## ప్రళయము : శాస్త్రము

కాగా కామ, క్రోధ, లోభ, మోహముల నుండి తప్పుకొనుటకు 'శాస్త్రీయమైన' 'సంయమ' మార్గమును పట్టుకొనవలెను. మహాత్ముల అనుభవమే "శాస్త్రము". ప్రయోగముల ద్వారా (సాధన) మహాపురుషులకు లభించిన అనుభవముల ద్వారా లభించిన ఫలితములే శాస్త్రముగా ఏర్పడినది. నీవీ సంయమ సిద్ధాంతము నాశ్రయింపుము. వ్యర్థముగా బుద్ధి భేదము నెందులకు కల్పించెదరు. కామ, క్రోధ, మోహ, లోభములు కావలసిన దాని కంటె బెత్తెడు హెచ్చుగనే ప్రపంచమున నున్నవి. మీరు సంతానము నెంత వృద్ధి పొందించినను మనుష్యుడే పృథ్విపై నుండి నామ రూపములు లేకుండా నశించిపోవు రోజు రానే వచ్చును. శాస్త్రజ్ఞులు, విజ్ఞాన వేత్తలు నొక్కి చెప్పుచునే యున్నారు. భూమి నెమ్మదిగా చల్లబడుచున్నది. ఒకప్పుడీ భూగోళము చాల యుష్ణముగా నుండెడిది. అప్పుడు దాని మీద జీవరాసు లేవియు యుండెడివి కావు. అప్పటికి ప్రాణికోటి పుట్టనే లేదు. పృధ్వి పూర్తిగా చల్లబడి పోయి జీవరాసులన్నియు లయమయిపోవు సమయము ఎప్పుడో రానున్నది. కాని దీనికి ఒక లక్ష సంవత్సరములు పట్టును. "పరమేశ్వరుడు" అవతారమెత్తునది ధర్మరక్షణ కొరకే గాని, జన సంఖ్య నిలబెట్టుటకు గాదు. ధర్మ పరాయణుడై, పాపభీతి, సత్యనిష్ఠ కలవాడు ఒకరైన నున్నంత వరకు చింతింపవలసిన పనిలేదు. సర్వేశ్వరుని దృష్టి వానిపై నుండనే యుండును. ధర్మచ్యుతులు వేలకొలదిగా నున్ననేమి? (రెండును సమానమే) భవిష్యత్తును గురించి బెంగపడవలసిన పనిలేదు. నీనైతిక శక్తిని పెంచు కొనుము.

నిన్నాశ్రయించిన కామ క్రోధాదులను విదిలించి పారవేయుము. సంసార మనెడి సముద్రమునకు దూరముగా గట్టుపై నిలబడి ఆ సముద్రము యొక్క సౌందర్యమును దర్శించుటలో ఆనందమున్నది గాని ఆ సముద్రములో మునిగి ముక్కులందు నోటియందు నీరు నిండిన వారికి సముద్రమేమి ఆనందమిచ్చును. మహాత్ములు సంసారపు సాగరపు టొడ్డున నిలబడి చూచి ఆనందమును చూరగొందురు. అట్లే సంసారమున నున్నను నిర్లిప్తముగా నుండుటను పుణ్యవృత్తిని జీవితమున వ్యాపింప జేయనిచో ఆనందము కలుగనేరదు. కనుక, తామరాకున నుండు నీటి బొట్టువలె నిర్లిప్తముగా నుండుము. మరల సంసార విషయముల మీదికి మీ మనస్సును పోనీయక జాగ్రత్త వహింపుము.

## కట్టుబాటు గల నడవడి

యజ్ఞము - జ్ఞానము - తపములను మనము వేరు వేరుగ తలంచితిమి. కాని నిజమునకు వీనిలో బేధము లేదు. ఎందువలననగా సృష్టి సమాజము శరీరము భిన్న భిన్న సంస్థలు కానేరవు. సమాజము సృష్టికి వెలుపలలేదు. శరీరము కూడ సృష్టి వెలుపలిది కాదు. ఈ మూడును కలియుటచే ఒక భవ్యమైన "సృష్టి సంస్థ" నిర్మితమగు చున్నది. అందుచేతనే మనము చేయు నిర్మాణాత్మక శ్రమ యంతయు, ఇచ్చు దానము లన్నియు, చేయు తపస్సంతయు కలిపి చూచినచో విశాల సృష్టిలో "యజ్ఞము" అనవచ్చును. సేవా కార్యములలో మనము ఫలాపేక్షను యేమాత్రము రానీయ రాదు. ఏలనన : ఆ ఫలమును (ఋణమును) మొదటనే పొందితిమి. ఆ ఋణము మనపై బడియుండుటచే ఆ ఋణమును తీర్చుటయే మన కర్తవ్యము. యజ్ఞము వలన సృష్టిలో సమత్వము ప్రాప్తించును. తపస్సు వలన శరీరములో సమత్వము సిద్ధించును. ఈ విధముగా మూడు సంస్థలలో సమత్వము

నెలకొనుటకు ఈ కార్యక్రమము (ఈ విధము) తోడ్పడును. దీని వలన దోషములు తొలగి పోవును. సేవ కొరకుగా గ్రహింపబడు ఆహారము పవిత్రమైనది. సేవకై శరీరము నిలుచుటకు గాను దానిపై వేయబడు 'ఆహుతి' యజ్ఞమే యనబడును. ఈ విషయములన్నింటినీ ముఖ్యముగా శ్రద్ధ యుండవలెను. సేవనెల్ల ఈశ్వరార్పణము చేయు భావము మనలో నుండ వలెను. ఈ భావము మనలో నుండవలెనన్న ఇది చాల గొప్ప విషయము. జీవితము సేవామయము కానంత వరకు ఈశ్వరార్పణ బుద్ధి కలుగనేరదు. ఈశ్వరార్పణమను ప్రధాన వస్తువును విసర్జించిన యెడల ముందునకు సాగనేరమని గ్రహింపవలెను.

# ఉత్తరార్థము మర్త్యులు - మర్త్యలోకము

మానవులమై పుట్టి భూలోకమున నివసించు చున్నారము గానీ, భూలోకమును గురించి అందు నివసించు మానవ జీవితమును గురించి కొంత సమీక్షింతము. ఏలనగా మనకు కొంత తెలిసియున్న దానిని బట్టి తెలియని దానిని గురించి తెలుసుకొనగలమేమో చూతము.

ఈ చిత్ర జగత్తులో భూమండలమునకు మర్త్య లోకమని పేరు. "మర్త్యులు" అనగా మానవులు. మానవులుండునది గాన మానవ లోకమని, మర్త్యలోకమని పిలువబడుచున్నది. మానవుడు సదా బాహ్య ప్రపంచములోని వివిధ వస్తు జాలముతోను, తోటి మానవాది ప్రాణులతోను సన్నిహిత సంపర్కము గలిగి తద్వారా గలిగిన సంఘటనల శుభాశుభ ఫలములను అనుభవించు చుండును. ఏ ప్రాణియు బాహ్య ప్రపంచముతో సంబంధము లేకుండగా క్షణమైనను నుండ జాలదు. సంపర్కము లేకుండుటనివార్యము. అయినను నిర్మల, నిర్దుష్ట మనోబుద్ధులు గలవాడే చతురతతోను దృఢచిత్తముతోను ప్రపంచములో కుమ్మరి పుర్వువలె వ్యహరించగల మానవుడే సుఖించగలడు. అటుల ప్రవర్తించలేని మనుజుడు, ప్రపంచ మాయలలో చిక్కి దుఃఖ భాజనుడగు చున్నాడు. ''వినుము'' ప్రతి మనుజుడును ఎల్లప్పుడు సుఖ సంతోషములతో నుండ వలెననియే కోరుకొనును. అట్టి వానికి

దుఃఖము ఆజన్మ శత్రువు. ఈ శత్రువు సదా వీనిని అంటిపెట్టుకొని యుండి వేధించు చుండును. మానవు లందరు నీ సంసార దుఃఖము

ఏదో విధముగ అనుభవించ వలసిన వారలే. అంత మాత్రమే కాదు. సుఖములను కోరి చేయు కార్యకలాపము లన్నియును దుఃఖ మయముగనే పరిణమించును. ఈ కోరికలు అనుభవించిన తీరునవి కావు. ఎన్నిటి ననుభవించినను (కోరికలు) పెరుగుచుండునే గాని చల్లారవు. ప్రజ్వరిల్లు అగ్నిలో నెయ్యిబోసి చల్లార్చజూచుట ఎంత అవివేకమో అనుభవించి కోరికలు తీర్చుకొనవలె ననుకొనుటయు నంత అవివేకమేను. సర్వ భూతములయందు రాగద్వేషములు లేని సమభావము గలవారికి సర్వత్ర సుఖము లభించును. బుద్ధిహీనుడు వదలలేనిది 'విషయ తృష్ణ'. అది శరీరము జీర్ణించినను జీర్ణింపబడదు. అది దుఃఖమున కాటపట్టు. తన క్షేమమును కోరుకొను వారు తృష్ణను (ఆశ) విడువ వలెను. స్త్రీ భోగము ఎంత అనుభవించినను తీరునది కాదు. ఇంద్రియములు చాల బలమైనవి. ఎంత జ్ఞానము గల వానినైనను తృష్ణలో పడద్రోయగలవు. అందుచేతనే తల్లి, చెల్లెలు, కూతురు అని కూడ ధైర్యముగా నుండ రాదు. కాన వారితో ఏకాంతముగా విహరింపరాదు.

ఈ మానవ శరీరము అంతము కాక ముందే ఆత్మ క్షేమమునకు ప్రయత్నించ వలెను. మానవుడు బ్రతికిన నిండు నూరేండ్లు బ్రతుకును. ఇంద్రియ నిగ్రహములేని వానికి బాల్యము ఇరువది యేండ్లును, కౌమారము నలుబది యేండ్లును గడచి ముసలి తనము వచ్చి దేహము స్వాధీనము కాక మిగిలిన సంవత్సరములలో ఎంత అనుభవించినను తీరని కామము యింటి యందు, ఇల్లాలియందు, పిల్లల యందు, బంధువుల యందును విడువరానిదైన మోహము మనసును పట్టి వీడవు. వీటన్నిటి కంటె మించినది "ధనాశ". ధనము సంపాదించుట కొరకు ప్రాణమునైనను విడువ సిద్ధపడును. మనము (మనస్సు) ప్రియురాలి విరహ స్వభోగములను, పిల్లల ముద్దు మాటలను దీనులైన

తల్లిదండ్రులను మనోహరములగు భవనములను, ధనార్జన కొరకు ఉపయోగించు వృత్తులను తలంచుచు కాలము గడుపుదురు. పట్టుకాయలోని పురుగు అందులోనే బంధింపబడి నశించినట్లు కామ భోగములు – జిహ్వారసములు అనుభవించినవి తలంచుచు ఎంత కాలము గడచినను విరక్తి కలుగనేరదు. తన ఆయువంతయును తన శరీర సుఖములకు, తన కుటుంబ పోషణమునకును వినియోగించును. శారీరకమైన వ్యాధులు, మానసికమైన వేదనలు, బందుగుల వలన, జంతువుల వలన కలుగు బాధలనే తలంచును గాని తన ఆత్మను గురించి కాని, 'భగవంతుని' గురించి కాని, తలచుటకు మనస్సు ప్రయత్నించదు. ఇవ్వి దోషములని తెలిసినవాడు కూడ ఇంద్రియములను వశపరచు కొనలేక కోరికలు చల్లారక కుటుంబ భారముతో శ్రమపడి మృతినంది మరల మరల జన్మించు చుండును.

అంతియేగాని మనుష్యులు అన్యోన్య ఆకర్షణకు వశపడక ధన లోభమునకు లొంగకుండ మనస్సును అరికట్టలేరు. అందుచేతనే చెవితో, నాలుకతో, ముక్కుతో, కంటితో, చర్మముతో అనుభవించు విషయములను అవసరమైనంత వరకే అనుభవించ వలెను గాని సంగముతో వదలలేక అనుభవించ రాదు. దానినే విడువవలెను. అన్ని పదార్థముల లోపలను వెలుపలను వ్యాపించియున్న "నారాయణ తత్త్వము" గుర్తింప వలెను. బాహ్య వస్తువులను భోగసాధనలుగా కాక నారాయణాత్మకముగా భావించి సంగము వీడి బంధము వదలించు కొనవలెను. ఈ తత్వము నెరుంగుట, ప్రేమించుట కష్టసాధ్యము. శరీరమును – శరీరమునకు చెందిన వానిని ప్రేమించుట, తన కొరకే గద!

ఇక 'ఆత్మ'. ఇది కనపడునదికాదు. ఇది శరీరము కాదు.

ఇంద్రియములు కావు. శరీరమున్నంత కాలము యుండునది ఆత్మయే. అది లేనినాడు శరీరమే యుండదు. అది అందరకు తెలిసిన విషయమే కద! తనను తాను ప్రేమించుటనునది సహజ సిద్ధము. ఆ 'ఆత్మ'యే శ్రీమన్నారాయణుడు. కావున వానిని ప్రేమించుటలో కష్టమేమున్నది.

చరాచర జీవులు (శరీములు) సర్వ పదార్థములు. వానిలో కనబడునవి కనబడనివి అంతయును వాని సంకల్పము చేతనే నిలచున్నది, పెరుగుచున్నది, లయమగుచున్నది. అందుచే దీని నెరిగిన వాడు ఏ వస్తువును చూచినను, అనుభవించినను తనలో నున్న (ఆత్మను) శ్రీమన్నారాయణుని స్మరించు చుండవలెను.

ఈ గుర్తింపు పొందుటకు 'ఆచార్యుల ఉపదేశమే సాధనము' దీనిని మనము తెలిసికొనిన మన దృష్టి పథమున కాన్పించు సర్వభూతములందును దయ కలుగును.

మన నడవడిలో సర్వభూత దయ కలిగినవాడు మనయందు నిక్షిప్తముగా నుండు 'ఆసురీ భావము' తొలగిపోవును. భగవానుడు సంతోషించును. ఈ ఎరుక లేక ఆచరించు – ధర్మ – కామ. భోగ శాస్త్రములు సత్యమును తెలుసుకొనుటకు సాయపడక వ్యర్థములే యగును. అంతర్యామియగు భగవానునిచే నియమింపబడినవే. కాన వానిని వాని కొరకే వినియోగించుటే సబబు అని ఎరిగి సర్వ పదార్థములు – సర్వభావములు అని ఎరిగి తాను చేయు ప్రతి పనిని కడకు తన రక్షణమును 'వాసుదేవునందు సమర్పించుటయే సర్వ వేద సారము'. అదే సన్మార్గ దర్శనము అని తెలియ వలెను. ఇంక వేరు ప్రయోజనమును కోరక "భగవత్ పాదారవింద సేవయే తాను చేయు సకలమునకును ఫలముగా భావించవలెను. భాగవత సేవ వలననే ఈ జ్ఞానము లభించును. దీనిని తెలియవలెనను శ్రద్ధ యున్నచో బాలురు స్త్రీలు

గూడ ఈ జ్ఞానార్జనను సముపార్జించవచ్చును.

దేహము – ఆత్మ అను రెంటి యొక్క స్వభావమును మనము బాగుగా గుర్తించ వలెను. ఆత్మ కనబడదు. దేహము కనబడును. ఈ రెండును కలసియే యుండును. అది మనము వేరని గుర్తించలేము. పుట్టినది, ఉన్నది, పెరుగుచున్నది, మారుచున్నది, తరుగుచున్నది, నశించునది ఈశరీరమే. దీనినే భావ వికారము లందురు.

కనుపించు ప్రతి పదార్థమునకును ఆరు వికారముల కలవు. ఇవి యన్నియు 'పరమేశ్వర' రూపములేయైనను, కాలమే ఈ మార్పును కలిగించుచుండును. అందుచేతనే (నిత్యము) అనిత్యము అందుము. త్రికాలము లందును పుట్టుట, పెరుగుట, నశించుటయను మార్పులు లేనిది 'ఆత్మ'. అందుచేతనే దీనిని 'అవ్యయము' అందురు. ప్రకృతి సంబంధము లేనిదగుటచే రాగద్వేషము లుండవు. అది అత్యంత సూక్ష్మమైనది. అది అన్నిటిలో వ్యాపించి యుండును. కాని ఏవియు దానిలో వ్యాపించి యుండవు.

ఈ శరీరములలో వేరు వేరుగ నుండే ఆత్మలు అన్నియు యొకే ఆకారము గలవి. జ్ఞానము కలది ఆత్మ. తనంత తనను తానే ఎరుంగగలిగినవి. ఆత్మ ఈ దేహేంద్రియములకు ఆధారమై అవి ప్రవర్తించుటకు కారణమైనది. ఈ లక్షణములు గలిగిన ఆత్మ దేహము కంటె స్వభావము వేరై దేహముననే యుండును. నేను అని వ్యవహరింపబడునది ఈ ఆత్మయే. మనమీ విషయమును గుర్తించలేక ఈ దేహమునే నేను అనుకొనుచున్నారము. ఈ దేహమునకు చెందిన వన్నియు నావి అనుకొనుచున్నారము.

యోగ సాధనచే దేహముతో కలసియున్న ఆత్మను వేరు చేసి గుర్తించినప్పుడు 'స్వస్వ రూపము' తెలియును. పరబ్రహ్మ ప్రాప్తి కలుగును.

ఈ శరీరముతో కర్మవశమున చేరియుండు వాడు 'జీవుడు'. ఆ జీవుడు ప్రతి శరీరమున వేరువేరుగ నుండును. ఆ జీవుడే 'ఆత్మ'. ఆ 'ఆత్మ'నే నేను అందుము. వానిని విమర్శించి వివేకముతో గుర్తించవలెను. నేను తెలుసుకొన్నాను. 'నేను కోరుచున్నాను' అనుట వలన అవి ఆత్మకు చెందినవి కావు, ఇవన్నియు బుద్ధి యొక్క వ్యాపారములనియును, బుద్ధి, మనసు నేను కంటె వేరని గుర్తించవలెను. ఉపాయములచే దేహము యొక్క స్వభావములను గుర్తించుచు, జీవితమును సాగిం
చుచున్న సత్త్వ, రజస్తమో గుణములను అరికట్టగలము. దానిచే పరతత్త్వముపై ప్రీతి గలుగును. భగవంతుని పైనను ప్రేమ, ప్రీతి కలుగును. వాని పరిచర్య యందు ఆసక్తి కలిగిన రాజస, తామస భావముల ప్రకోపము తగ్గును.

సద్గురు శుశ్రూష చేసి దాని వలన కలుగు భక్తి జ్ఞాన బలముల చేత భగవానుని ఆరాధన, కథాగానము వానిపై శ్రద్ధయు, వాని గుణములను కీర్తించుట, వాని విగ్రహములను పూజించుట, సర్వేశ్వరుడు సర్వ భూతముల యందున్నాడని గుర్తించుట, అన్ని భూతములను శక్తి కొలదిగా తృప్తి పరచుచుండుట యను సాధనచే, ఈ విధముగా సేవ చేసి కర్మబంధమును వీడి 'భగవత్' భాగవత సేవచేసి తాను భగవత్ సాయుజ్యమును పొందవలెను.

దుఃఖకరమైన సంసార చక్రమును శిధిలము చేయుటకు ఆనందకరమైన దేహమును చేరుటకు, "తనలో నున్న ఈశ్వరుని భజించుట కంటె వేరు మార్గము లేనే లేదు. భగవదుపాసన బహు సులభమైనది. అందరి ఆంతరాత్మల లోనను, లీనమై యుండువాడు భగవానుడే. అతడు మనలోనను నున్నాడు అని వానిని ఎరింగి భజించిన కల్గెడి సుఖము శాశ్వతము, అనంతము.

ఓ మానవులారా! స్వార్థమును గూర్చి ఆలోచింపుడు. స్వార్థమనగా నేను చేయుచున్నాను అనునదే (ఆత్మ)నని గుర్తింపుము. కర్మలను చేయుచు ఆ కర్మవలన నేను, నాది అను మోహముచే శరీరమును పొందుచు కర్మవలన మరల మరల జన్మించుచు 'చర్వితచర్వణముగా' సాగించుచున్నారము. కాని చేసెడి కర్మ లన్నియును ఆర్జించిన ధర్మార్థ కామములన్నియు 'సర్వాత్ముడై వ్యాపించియున్న' శ్రీహరిచే నియమింపబడిన వేయని గుర్తించి శ్రీహరి కొఱకే చేయవలెనని, యే కోరికలు లేక ప్రేమతో చేయవలెను. దీనికిని నిర్మల ప్రేమ, భక్తి యుండవలెను. మనము సంపాదించ వలసినది ధనము, సౌఖ్యము గాదు. "ఏకాంత భక్తి" భగవంతుని యందుడవలసిన ఏకాంత భక్తి యనగా 'అంతటను వానినే దర్శించుట' యని తెలిసి కొనుటయే. ఐన ఇందాశ్చర్య మేమున్నది? ఆశ్చర్యమేను.

ప్రతి మనుజుడు, ప్రతి నిమిషము తాను సుఖపడుటకు అవసరమైన ప్రయత్నమును చేయుచునే యుండును. ఈ సుఖ, దుఃఖములకు కారణుడైన ప్రభువు ఒకడున్నాడని గ్రహింప జాలడు. అంతయును తన చేతిలో నున్నట్లు భావించి ప్రయత్నములు సాగించును. విఫలమైనచో దుఃఖించును. సఫలమైన గర్వించును. ఇట్లుగా కార్యకలాపములు సాగించుచు జీవితమును గడుపుచురాగా, ఒక్క దినమున అక్కటా! మృత్యువు నోటబడును. అంతటితో వాని ఆశలయన్నియును అంతరించుచున్నవి. ఈ విధముగా ఈ యుగపు మనుజులు భోగోపకరణములను సమకూర్చు కొని, భోగకాములై స్వస్వరూప జ్ఞానము లేక పశుత్వమునకు దిగజారుచున్నారు.

## అయ్యో భారతీ !

భారత మాత తన బిడ్డలు ఇటుల నైతిక పథమున నుండి దిగజారి

పోవుటను జూచి కడు దీనముగ విలపించుచున్నది. అయ్యో! ఈ భారత భూమి మహాపుణ్యభూమి. ఇందు అవతార పురుషులు, త్రికాలజ్ఞులు, యోగీశ్వరులు, మహాత్ములెందరో ఉదయించినారు. కారణజన్ములై సర్వతో ముఖముగా హైందవ జీవితమును కాలానుగుణముగా దిద్దుచు వచ్చిరి. అట్టి పవిత్ర భూమి యందు, ఆధ్యాత్మిక సాంఘిక ధర్మ నిర్మూలనము చేయుచు ఎందరో బాలబాలికలు గుణహీనులై ఎన్నియో కుటుంబములు నాశనము లైనవి.

అతివృష్టి - అనావృష్టిచే సస్యములు నాశనమైనవి. ప్రజలకు తినుటకు తిండిలేక పశువులకు మేతలేక అభావమైన వ్యాధులెన్నియో పీడింప, దుఃఖించుచున్నారే కాని 'భగవన్నామస్మరణ' చేయువారరుదైనారు. "ఈ వెర్రి వ్యామోహము నుండి నాబిడ్డలను దప్పించువారెవరు?" అని భారతమాత కేకలిడుచున్నారు.

మనుజుడు శబ్దాది విషయములను చింతించుచు విషయముల యందాసక్తులగు చున్నారు. అట్టి ఆసక్తిచే దాని యందతనికి కోరిక జనించుచున్నది. ఈ కోరిక వలన కోపము పుట్టుచున్నది. దీని వలన "అవివేకము" దాని వలన మరపు, మరపు వలన బుద్ధి నాశనము క్రమముగ సంక్రమించి బుద్ధి నాశనముచే పూర్తిగా చెడిపోవుచున్నాడు. విషయ చింత ఎంతటి అనర్థములకు దారి తీయుచున్నదో గ్రహింతురు గాక.

**కొన్ని సందేహములు**

1. నేనెవరు?
2. నన్నీ చిత్ర జగత్తుకు దెచ్చినదవెరు?
3. ఈ జగత్తు స్వరూప స్వభావము లెట్టివి?

4. ఈ జగత్తునకు రాకుండటకు సాధనమేది?

సెబాస్! ఉత్తమోత్తమమైన ప్రశ్నలు స్ఫురించినవి. తత్వ విచారమంతయు ఈ నాలుగు ప్రశ్నలలోననే ఇమిడియున్నది. ఈ ప్రశ్నలకు ముందు ఈ జగత్ స్వరూపమును గురించి కొంత తెలుసుకొందము. దృశ్యమానమగు నీజగత్తంతయు నొక్కటియేయగు 'అఖండ బ్రహ్మాండము'. అందు పరమేశ్వరుడే ఆత్మగా నుండి సమస్త జీవ సమూహములతో గూడిన వస్తు జాలమంతయు ఆయన శరీరభూతమే. మనము శరీరం ధరించి, సర్వమును మన సొత్తుగా భావించి స్వప్రయోగార్థము ఉపయోగ పరచుకొన్నట్లే భగవంతుడు తన శరీర భూతములైన సకల జీవాత్మలను - సర్వవస్తు జాలమును - చిద - చిత్ - పదార్థములు సత్యములేయై పరబ్రహ్మకు శరీరమగుటం చేసి, పరబ్రహ్మ శరీర యుక్తుడై బాహ్యాంతరముల నుండి, సర్వవ్యాపకుడై సర్వత్ర నిండియుండి సకల జగత్తును నడిపించుచున్నాడు.

## "సృష్టి" కార్యము

పురుషోత్తమునకు ప్రకృతి - జీవులు - మృత్యువు - శరీర భూతములు మొదలగు సర్వభూతముల యందుండునట్టి "అంతరాత్మ" శ్రీహరియే యని "శ్రుతి వాక్యము". సకల ప్రాణుల హృదయము లందును తానాత్మగా, జంగమ - స్థావర రూపమైన సమస్త సమూహమునకును 'ఆత్మ భూతమై' పరమాత్మను విడచి యుండునది యొక్కటి యును లేదు. వైదిక భాషలో అచిత్ అనగా జ్ఞాన శూన్యమైనది. ఈ జగత్తు నందు పరిదృశ్యమాన మగు సకల వస్తు జాలములకు "అచిత్" అని పేరు. దీనికే అవ్యక్తము - ప్రకృతి యనియు మాయ యనియు నామాంతరములు గలవు.

'చిత్' అనగా ఆత్మ. ఆత్మ - చేతనుడు అనగా జ్ఞానానంద

స్వరూపుడు. కాని మనబోటి జీవాత్మల జ్ఞానానందములు ప్రకృతి బంధము వలన సంకోచమునకు గురియై యున్నవి. 'పరబ్రహ్మ' మనగా 'బృహ్మితత్వము' పెద్దతనము గలవాడని అర్థము. (శరీరమును బట్టి) 'బృహ్మితత్వము ఎవని యందు అంతములేని, అతిశయము లేనిదై యుండునో అతడే 'పరబ్రహ్మ' సర్వజ్ఞుడును - సర్వశక్తుడును అగు పురుషోత్తముడే పరబ్రహ్మ. ఆ బ్రహ్మమే ఏకోనారాయణుడు, శ్రీమన్నారాయణుడు. కాన చతుర్ముఖ బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు నుండు జగత్తు ఒక్కటియే యైనది. ఏ విధముగ పరిచ్ఛేదము లేనిదియగు బ్రహ్మాండము ఒక్కటే. సకల చేతనాచేతనములుగా గలిగిన, పరబ్రహ్మ స్వరూపమే ఈ బ్రహ్మాండము. ఇదియే విరాట్స్వరూపము. ఇట్టి బ్రహ్మాండములు అనేక కోట్ల సంఖ్యలలో పరబ్రహ్మ యొక్క శరీరముగ, ఆయన నంటికొని యున్నవి. కావుననే పరమాత్మ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడని తెలియబడుచున్నాడు.

ప్ర. ఈ బ్రహ్మాండము మనకు వేరు వేరుగా దోచుచున్నదేమి?

జ. అట్లు గాదు. పృథ్వి - జలము - వాయువు - తేజస్సు - ఆకాశము ఇవన్నియు లోకముతో కలసి యుండుటను, మనము విని యున్నాము. ఇవన్నియు కూడ ఒక్కటగు 'అఖండ బ్రహ్మాండము' పరమాత్మ శరీర భూతములగు 'చిద - చిత్తు' లను తన స్వంత ప్రయోజనముల కెట్లు నియమించి ఉపయోగపరచుచున్నాడో జూతము. ఈ కనబడు జగత్తు మొదలు (సత్తు) పరబ్రహ్మము ఒక్కటేయై, రెండవది లేనిదై యుండును. ఆయన శరీర భూతములగు 'చిదచిత్' పదార్థముల నన్నింటిని గుర్తించవలను పడనంత సూక్ష్మాతి సూక్ష్మావస్థను బొందింపచేసి, భగవంతుడు వాటి నన్నింటినీ తనయందు లీనము చేసికొనుచున్నాడు. తానే అనేకము కావలెనని తలంచును. తక్షణమే ఆ చిత్తు 'స్థూలాకారముగ పెరిగి నామ రూపములతో బయటికి వచ్చును. అప్పుడు పరమాత్మ,

జీవాత్మలను ప్రకృతిలో జేర్చి తన వీర్యము నందు విడచును. అంతలో సకల చేతనా చేతనములతో గూడిన 'బ్రహ్మాండ జగత్తు' కానబడును. కాన సంహార కాలముననను, సృష్టి కాలమందును – భగవంతుడు చిదచిత్ విశిష్టుడై చేతనా చేతనములన్నియును సామరూప విభాగములు లేనివై యుండెను. సృష్టికి తరువాత నామరూపముల విభాగములు గలవయ్యెను. కారణావస్థ యందుండు సూక్ష్మములగు వనియు, స్థూలములగు నవియు, చేతనా చేతన పదార్థములు శరీరముగా గలవాడు పరమ పురుషుడొక్కడే. కాన కారణము కంటె కార్యము వేరైనది. అప్పుడు ఇప్పుడు చిద చిత్ విశిష్టుడైన వాడు శ్రీమన్నారాయాణుడేనని తెలియనగును.

ఆ నారాయణుడే సృష్టికి కారణము. ఆయనయే కార్యము. కార్యమే జగత్తు. కావున ఈశ్వరుడొక్కడే కారణము. జగద్రూపమున కానుపించు పరమేశ్వరుడే కార్యము. సంహార కాలమనగా ప్రళయము. ప్రళయము వెనుక మరల పరమేశ్వరుడు. 'సృష్టి చేయవలయునని తలంచు వరకు ఈ మధ్య కాలమందు అతిసూక్ష్మ దశలో నామ రూప విభాగ అనర్హమై యుండును. చిదచిత్తులతో గూడియుండు పరమాత్మ తప్ప మరేమియు నుండదు. భగవంతుడంతయును తన గర్భమందిముడ్చుకొని యుండును.

## సృష్టి కాలమనగ

ఈ బ్రహ్మాండము నంతను పరమేశ్వరుడు ఒక్కమారుగనే సృజించెను. కాని అంతటితో సృష్టికార్యము ముగియదు. పునరపి జననం పునరపి మరణమ్ అని పుట్టిన వన్నియు గిట్టుచుండును. మరల ప్రళయము జరుగనంత వరకు సృష్టి జరుగచునే యుండును. ఆ కారణము చేతనే ప్రారంభము మొదలు ప్రళయము వరకు నుండు

కాలమునే సృష్టి కాలమందురు. కాన చిదచిద్విశిష్టుడగు పరబ్రహ్మము ఒక్కటే తత్వము. చూచితివా. మణుల మాల యందు దారము లేనిచో మణులు నిలువ జాలవు. మణులకు ఆధారమైనది దారము. మణులకు స్వతహాగా నిలబడు శక్తి లేదు. దారము ఆధారముననే అవి నిలబడుచున్నవి. లేనిచో చెల్లా చెదురై పోవును. మణులు అనేకరకములున్నను దారము మాత్రము ఒక్కటే. జగత్తు నందు ప్రాణికోట్లన్నియును 'మణులు'. పరమాత్మ మణుల కాధారమైన దారము. సూక్ష్మదృష్టికి గాను పించదు. అటులే భగవంతుడును స్థూలదృష్టికి. చర్మచక్షువులకు (గానుపించదు) గోచరించదు.

ప్ర. నేనెవరు? అనునది మొదటి ప్రశ్న. నిన్ను నీవు చూచుచున్నావా?

జ. చూచుచున్నాను.

ప్ర. నిన్ను దేనిగా చూచుచున్నావు అను సందేహము మొదటి ప్రశ్న.

ప్ర. నిన్ను నీవుగా చూచుచున్నావా?

జ. చూచుచున్నాను.

ప్ర. నిన్ను దేనిగా చూచుచున్నావా?

జ. శరీరముగా చూచుచున్నాను.

అది సరికాదు. శరీరము నీవు కాదు.

ప్ర. కరచరణాద్యవయవములో?

జ. కాదు

ప్ర. మనస్సో

జ. కాదు.

ప్ర. బుద్ధి.

జ. బుద్ధియు గాదు.

ప్ర. ఇక మిగిలినదేమున్నది?

జ. మరి యొక ప్రశ్ననడిగెదను.

ప్ర. ఈ శరీరమెవరిది?

జ. నాది.

ప్ర. మంచిది. కరణచరణాదులెవరివి?

జ. నావి.

ప్ర. ఈ ముక్కు ఎవరిది?

జ. నాది.

ప్ర. ఈ శరీరమెవరిది?

జ. నాది.

ప్ర. ఈ ఇల్లెవరిది?

జ. నాది.

కనుక శరీరము – అవయములు – ముక్కు మొదలగు అవయవములన్నియు వేరని యేర్పడు చున్నది గదా? కావున నా ఇల్లు – నాతల – నాకాలు – నా భార్య – నా సొమ్ము అనువన్నియు వేరు. నా అనువాడు వేరుగద! అందుచే యివన్నియు గలవాడు వస్తువుల కంటె వేరైన వాడు. కావున పై వానిలో నీ వేదియును గాదు.

ప్ర. అగుచో నేను ఎవరు?

"స్థూల – సూక్ష్మ శరీరముల కంటె నీవు వేరైనవాడవు. వినుము. "సోక్రటీసు" గొప్ప తత్త్వవేత్త. ఆతడు ప్రతివాని వద్దకు వెళ్ళి వారి వారి ప్రతి అవయవములను జూపి "నీవును నీయవయములు నొక్కటేనా! అని ప్రశ్నించెను. అట్టి విచారణ వలన స్థూల సూక్ష్మ శరీరముల కన్న భిన్నమైనది వేరొకటున్నది. అదియే నేను అని సిద్ధాంతము చేసెను.

ఈ శరీరము దీనికి చేరిన అవయములు – మనస్సు – బుద్ధి (ప్రాణము) మొదలైన వాని కంటే వేరైన వాడే ఆ నేనను వాడు యని యంటివి గదా! ఆతడు మనకు గోచరింపడే! వాడు ఈ శరీరములోననే యున్నాడు. క్రమ సాధన చేసినచో వాని నెరుంగ గలము. ఆ నేననువాడు మన శరీరములో లేనియెడల నేమగును?

నా యనువాడు శరీరములో లేని యెడల శరీరము నశించి పోవును (చచ్చును). అప్పుడు 'పీనుగ' అది ఎందుకును పనికిరాదు. అది కొన్ని గంటలలోననే పైకిగొనిపోబడి 'దహనము చేయుటో లేక భూపతనము చేయుటో, సముద్రములో గాని, నదులలోగాని త్రోసి వేయుటలో లేక కుక్కనక్కలో తినివేయుటో జరుగును.

ప్ర. ఆ నేనను వానికి చావు లేదా?

జ. లేదు.

'నా' యను వానికి చావు లేదు. పుట్టుక లేదు. శరీరమునకే జరామరణములు. కావున శరీరము శాశ్వతముగాదు అని గ్రహింపుము. నా అనువాడే శాశ్వతమైన వాడు. వానికి చావు పుట్టుకలు లేవు. నశించు స్వభావము గల శరీరమునకు శాశ్వతమైనయునికి లేదు. అట్లే శాశ్వతమైన 'జీవాత్మకు' నాశనము లేదు. ఈ రెంటి యొక్క 'నిర్ణయమును' తత్త్వవేత్తలు తెలుసుకొనుచున్నారు.

"ప్రాణులు శరీరములకే చావు పుట్టుకలా? అనగా "అట్లు కాదు".

దృశ్యమాన జగత్తులో గోచరించు ప్రతివస్తువునకు స్థిరమైన యునికి లేదు. క్షణ క్షణము వికారమొందు చుండును. కొంత కాలమునకు నశించును. అనగా వేరు వేరు దశలను పొందును. నాశనము గూడ. అవస్థా విశేషమేను. మన శరీరము కూడ నట్టిదే. ఎప్పటి కప్పుడు మారుచుండును. మన శరీరములకు 'షడ్భావ' వికారములున్నవి. అది యేమనగా పుట్టుట – ఉండుట – పెరుగుట (పరిణతి). ఒక దశనుండి మరియొక దశకు మారుట. తరుగుట – నశించుట – వీనిలోనే శరీరము ప్రతి క్షణము మార్పుచెందుచున్నది. శరీరమునకు బాల్యావస్థ, యౌవ్వనావస్థ, వృద్ధావస్థ కలుగుచున్నట్లే ఆత్మకు మరియొక శరీరమును పొందుట తటస్థించు చున్నది. ఇట్టి విషయమున జ్ఞాని భ్రమ జెంది దుఃఖింపడు. ఇందు వలన మనము గ్రహించునదే మనగా ప్రపంచములోని పదార్థములను మన ఇంద్రియముల ద్వారా అనుభవించి పొందగలిగిన 'సుఖము' తాత్కాలికమైనదే కాని నిత్యమైనది కాదు. కానేరదు. పదార్థముల వలెనే అది యిచ్చు సుఖము గూడ మార్పు జెందును. అంతలోననే మారి మనలను వ్యసనములు ముంచును. ఈ పదార్థములన్ని మన మనోవికారములను రగుల్ప చేసి మనకు చాంచల్యము కలుగ చేయును. మనము వాని నలక్ష్యము చేసి, వానిపై వ్యామోహము పెట్టుకొనకుము. అవి మనము కోరకయే మన మీద పడుచుండును. అంతలో నా వస్తు స్వరూపమే మారిపోవును. నా వస్తువు ఇచ్చు సుఖమో దుఃఖమో అదియును మారును. వీనినే సంసారములో సుఖదుఃఖములందురు. ఇవే ద్వంద్వములు. రాకపోకలు గలిగియున్నవి. ఇంద్రియముల యొక్క శబ్ద – స్పర్శ – అదిగా గల విషయ సంయోగములు ఒకప్పుడు శీతలముగను, మరియొకప్పుడు ఉష్ణముగను, ఒకప్పుడు సుఖమును వేరొకప్పుడు దుఃఖమును

గలుగజేయును. బాహ్య పదార్థములను మన ఇంద్రియముల ద్వారా అనుభవించుట వలన మనకు గలుగునది కేవలము సుఖము కాదు. కొంత సుఖము నిచ్చి అంతలోననే దుఃఖమున ముంచును.

దీనినే గీతాచార్యులు బోధించినారు. కాని వీని యందు సమబుద్ధిగలిగి మనము సహించి యుండవలెను. ఇది దుఃఖము శ్రమ సుఖము కేవలము సుఖమే యైనచో మరల దుఃఖము కలుగ కూడదు. ఇవి చుట్టముల వలె రాక పోకల గలవి. అనిత్యములు గావున దీని యెడల ప్రీతి – మమకారము – ఆసక్తి గలిగి యుండరాదు. శాశ్వతమైన సుఖము దేని వలన కలుగుచున్నదో దానిని తెలిసికొందము. నిత్య వస్తువు వలన, నిత్య సుఖము లభించ గలదు. ఆ నిత్యవస్తువుచే మనకు లభించగల సుఖదుఃఖములను "తితిక్ష" అనుచున్నారు. "తితిక్ష" అనగా ఓర్పు. అనగా సమభావము గలిగి వాని నోర్చుకొన గలుగుట. "తితిక్ష" యనునది శమదమాది సద్గుణములలో నొకటి. ఇంతవరకు మనము శరీరము యొక్కయు మన మనుభవించు బాహ్య పదార్థముల యొక్క స్వరూప స్వభావములను నొకింత తెలుసుకున్నారము. నిన్ను – నీవు తెలిసికొనుటకు ఇంత మాత్రము చాలును.

---

# ఆత్మ

## ఆత్మ

ఇక 'నే' నను వాని గురించి తెలిసికొందము. తనకు తనను తెలియపరచునదేదో 'అనగా' తనను తాను చింతన చేయునదే 'నేను'. ఇది జ్ఞాన స్వరూపముగా ఉన్న తన్ను తెలుసుకొనునది. దీనినే 'ధర్మభూతజ్ఞాన'మని వ్యవహరింతురు. ఈ రెంటిని 'దీప ప్రభా న్యాయము' అందురు. దీపము తనకు తను ప్రకాశించుచు పరిసరముల గల వస్తువులను గూడ ప్రకాశింపజేయును. ఆ నేను అనునదే జ్ఞానానంద స్వరూపుడైన 'ఆత్మ' (చేతనుడు).

ఆత్మ అనగా శరీరము కాదు. శరీరములో హృదయ కమలము నుండి నడిపించునదేదో యదియే 'ఆత్మ'. ఆత్మ జ్ఞానానంద స్వరూపము. శరీరము, ఇంద్రియములు అజ్ఞాన స్వరూపములు – ప్రకృతి నీచమైనది. ఆత్మ శ్రేష్ఠమైనది, ఉత్తమమైనది. దీనిని స్మృతులు చక్కగా వర్ణించినవి.

పంచభూతములు రూపముగను, మనస్సు మొదలగు ఇంద్రియ రూపముగాను, మహత్తత్త్వ రూపముగాను, లేక అహంకార రూపముగాను నీ రెండు ప్రవృత్తుల మిశ్రమము జీవరూపముగను త్సృష్టమైనదొకటి. అదే ఆత్మ రెండవది నికృష్టమైనది ప్రకృతి, శరీర భూతముగ గనుపించునది. జీవ, ప్రకృతి సాన్నిధ్యము హీన ప్రకృతి. ప్రకృతికి కారణమగుచు ఈ రెండును విడిపోయిన ప్రకృతి చలనమునకు భంగము కలుగును. ఆ కారణము వలన ఆత్మయే ప్రకృతి యొక్క గమన శక్తికి కారణము కాదు. చలన జీవములు ప్రకృతి యందే అంతర్లీనమై

యుండును. ఆత్మ సాన్నిధ్యము వలన ప్రకృతిలో చలన శక్తికి ప్రవృత్తి కలుగు చున్నది. అదియెటులనిన, ఇనప పొడికి స్వయముగ చలన శక్తి లేదు. కాని ఆయస్కాంత సాన్నిధ్యముచే దానికి చలనము కలుగుచున్నది.

అటులనే ఆత్మ సాన్నిధ్యముచే ప్రకృతి యొక్క చలన బీజములు వృద్ధినందుచున్నవి.

ఆత్మయేకార్యమును చేయునది కాదు. గ్రహించును, గాని చేయలేదు. చూచును గాని ఉదాసీనముగా నుండును. అనుభవించును గాని తగుల్కొనదు. ప్రకాశింప జేయును గాని మార్పు జెందదు. ఏయే మార్పులు శరీరము నందు గోచరించుచున్నవియో అవి అన్నియు ఆత్మ సాన్నిధ్యముచే సూక్ష్మ శరీరము నందుత్పన్న మగునవియే గాని ఆత్మయందు గాదని "శ్రీభాష్యకర్తలు" అనుగ్రహించిరి. జీవుడు సంసార బంధమున దగుల్కొనుటకు ఉత్తమ– అధమ – జన్మలను పొందుటకును కారణములు తెలుపబడినవి. ప్రకృతి యొక్క గుణములతో ఆయా గుణముల వల్ల బుట్టిన ప్రాపంచ పదార్థముల తోటి సంయోగమే జీవునకు – జీవికి – సంబంధ హేతువగుచున్నది. పురుషుడు (ఆత్మ) వాస్తవముగ నిర్వికారుడై, జన్మవర్జితుడై, దృగ్రూపుడై యున్నను దృశ్యమగు దేహేంద్రియము లందు సంయోగము గలిగి యుండుట వలన సంసారిత్వమును బడయుచున్నాడు. కావున సంసారిక ప్రవృత్తులందు కర్తృత్వము "జీవాత్మ" కు స్వస్వరూప ప్రయుక్తమైనది గాదు. ఉపాధి వలన గలిగినదని తెలియుచున్నది.

# ఉపాధి

సాంసారిక ప్రవృత్తులు=ఉపాధి యననేమియో తెలిసికొందము. జీవుడు (ఆత్మ) కర్మానుభవమునకై శరీర సంబంధమును బొంది, అందుమూలమున స్వస్వరూపము ప్రకటితము గాకుండగా అనగా! సంకోచము గలిగియుండు దశ సంసారావస్థయనబడును. అప్పుడు చేయు స్వకర్మలు సాంసారిక ప్రవృత్తులన బడును. స్వరూప ప్రవృత్తములైనవి కావు.

ఇక 'ఉపాధి' అనగా ఏ పదార్థములో చేరి యుండిన, ఏ కార్యము కలుగుచున్నదో ఆ పదార్థము వలన ఆ కార్యము 'ఉపాధి'యనబడును. జీవుడు పాంచభౌతిక శరీరములో నుండి స్వభావ సిద్ధమగు సుఖ ద్దుఃఖములను అనుభవింప గోరును. అనగా స్త్రీ భోగము, అన్నపానాదులు మొదలైన భోగముల నుద్దేశించు సర్వ వ్యాపారములకును కారణమైనది శరీరము. కాబట్టి శరీరము ఆత్మకు 'ఉపాధి'. ఈ ఉపాధి వలన ప్రేరేపింపబడినవి జీవాత్మ చేయు సర్వ ప్రవృత్తులు. జీవాత్మకు స్వస్వరూప సిద్ధమైనవి కావు. పరబ్రహ్మ మొదలు గడ్డి పోచవరకు గల పదార్థములన్నియును భగవదధీనమైన 'సమష్టి' చేతనా చేతన ప్రవృత్తుల వలననే పుట్టుచున్నవి గాన, అన్నియు భగవదధీనములైనవియే. కావున సమస్త ప్రపంచమునకును పుట్టుటకును, గిట్టుటకును కారణమైన యజమాని పరమాత్మయేయని నిశ్చయముగా నెరుంగవలెను. భగవంతుడు సమస్త చేతనా చేతన పదార్థములన్నిటికిని 'శేషి' మన మందరమును శేషభూతులమేయగుదుము. ఇంత వరకు ఆత్మయొక్క స్వరూప స్వభావములను తెలిసికొన్నారము. ఇట్టి స్వరూపానురూప స్వభావముగల 'ఆత్మలు' అనేకములు గలవు. అవి లెక్కకు రానివి. అవి

మూడు విధములుగా నున్నవి.

1) బద్ధులు 2) ముక్తులు 3)నిత్యులు.

ఈ మూడు విధములైన ఆత్మలకు గల భేదములను తెలిసికొందము.

1.బద్ధులు : అనగా ప్రకృతితో (అచిత్తు) గలిగిన సంబంధము వలన అజ్ఞానముచేత అనంతములైన పుణ్యపాప కర్మములను చేయుచుండునట్టి వారై ఆ కర్మల కనుగుణమైన నానా విధ చిత్రములైన దేహములందు నేనను బుద్ధియును, నాదియను బుద్ధియును చేసిన దుర్వాసనల వలన స్వతంత్రులై తమ నిజ స్వరూపానురూప స్వభావములను మరచి, తమ తమ కర్మాను గుణముగ సంభవించెడు సుఖ దుఃఖ పరంపరలను అనుభవించుచు, మారిమారి పుట్టుచు, చచ్చుచు నుండు ఆత్మలకు 'బద్ధులు' అని పేరు.

ముక్తులు : అనాదియైన, ప్రవాహ రూపమైన కర్మచే గలిగిన సంసార బంధమున నడచుచుండగా 'భగవత్కటాక్ష'ముచే గలిగిన సత్త్వోద్రేకముచే బద్ధాత్మ కొకప్పుడు మోక్షమందు రుచి కలుగును. అప్పుడు సదాచార్యుల నాశ్రయించి, భగవంతుని విషయమైన 'జ్ఞానము' కలవారై 'మోక్షము' కొఱకు ప్రయత్నించును. అయ్యో! ఎన్ని యోనులలో జన్మించితినో? ఆహారాదులలో నెన్ని భేదములనుభవించితినో శైశవము, బాల్యము, యవ్వనము, తరుణము, వృద్ధాప్యము ఈ దశలలో ఎన్ని విధములుగా బాధలు పడితినోయని విచారించి, అట్టి అజ్ఞానమును నశింప చేయవలెనను వివేకమును బొంది "జ్ఞానోదయమై' సదాచార్యుల నాశ్రయించును.

స్వధర్మానుష్ఠానమును వదలక ఫలమునందాసక్తి కర్తృత్వము

నందు, కార్యము నందు సంగము విడచి, ధర్మానుష్ఠానమును అనుష్ఠించును. ఇందు ముముక్షువన నేమియోయన, ముముక్షువగు జీవాత్మ మోక్ష ఫలమునందాసక్తి కలవాడు. ఇక ముముక్షువగు జీవాత్మకు స్థిరముగ నాలుగు ప్రక్కలకును వ్యాపించి యున్న సంసార రూపమగు వృక్షమును అత్మ జ్ఞానముచే 'దృఢమైనదగు విషయ వైరాగ్యమను ఆయుధముచే ఛేదించి, తద్వారా పునరావృత్తిరహిత' మోక్షప్రాప్తికి సాధనమైన ఆత్మ అధ్యాత్మ సాక్షాత్కారమును గురించి ప్రయత్నించును.

ఎవని నుండి అనాదియైన సంసార వృక్షము యొక్క ప్రవృత్తి వ్యాపించునో, అట్టి ఆదిపురుషుడు – ఆ పరమాత్మ 'పథమును' ఈ ముముక్షువు వెదుకనా రంభించును. అదెట్లన, ఆ పరమాత్మనే శరణు బొందుటచే క్రమముగ దేహాత్మాభిమానము పోవును. దాని వలన 'భోగాసక్తి' యనబడు దోషము హరించును. ఆత్మ సాక్షాత్కార ఆసక్తి కలుగును. దాని వలన సుఖ దు్ఃఖాది ద్వంద్వముల కతీతుడై నాశరహితమైన 'పరిశుద్ధాత్మ' సాక్షాత్కార సిద్ధినిపొందును. (వినుడు) ఇట్టి భావములతో, వైరాగ్యము గలవాడై స్వధర్మానుష్ఠానము చేయుచురాగా, ప్రాచీన కర్మ నశించి,  భక్తి, జ్ఞానము, వృద్ధియగును. ఈ భక్తి మూలముగ భగవదనుభవము లభించును. భగవంతుడే ఉ పాయోపేయములు అని విశ్వాసము గలవాడై తత్సాధనచే సంసారముచే గలిగిన సుఖదు్ఃఖాదులు నశించి నిజ స్వరూపమును సాక్షాత్కరించుకొన గలుగును. అప్పుడు కర్మ రాహిత్యము కాగా 'శరీర పతనానంతరము'న జననమరణముల నుండి విముక్తుడై శుద్ధాత్మ స్వరూపముతో వైకుంఠమున ప్రవేశించి 'భగవత్కైంకర్యమను దాస్యము చేయుచు బ్రహ్మానందము ననుభవించును. ఆ ఆత్మలకే ముక్తులు అని పేరు.

రెండవ భాగము : స్వధర్మమనగా నేమియో తెలిసికొందము. స్వధర్మమనగా తమ తమ వర్ణాశ్రమములకు విధ్యుక్తమైన కర్మలు. ఈ

కర్మలను నేను చేయుచున్నాను అను తలంపు గాని, ఈ కర్మ ఫలమును నేనను భవింతునను సంకల్పముగాని, ఈ కార్యము నాది యను మమకారము గాని, యేమాత్రము లేక చేయవలయును. ఇది యంతము భగవంతుడే అంతరాత్మగా నుండి ఈ శరీరముచే చేయించు చున్నాడు, అని తలంచుచు సర్వము 'శ్రీభగవదర్పణ మస్తు' (శ్రీ కృష్ణార్పణమస్తు) అని భగవంతున కర్పణ చేయవలెను.

నీవు దేహధారణకై చేయులౌకిక వ్యాపారములను అనగా ఏది తినినను త్రాగినను తదితర కార్యము లేవి చేసినను శాస్త్రోక్తముగా నీవు చేయునట్టి యజ్ఞ, దాన, తప్ణ ప్రభృతి కర్మలను నీకు శేషియగు శ్రీమన్నారాయణుని యందర్పణ బుద్ధితో నాచరించవలెను. కావున ముముక్షువు తాను చేయు సమస్త కార్యములను పరమేశ్వరార్పణ బుద్ధితో ఆరాధనగా భావింప వలయును. ఫలితమును గోరక కార్యములను భగవదర్పితము చేయవలెను. అట్లు చేయుట వలన కలుగు ఫలితమును గూడ భగవదర్పణ చేయవలెను.

ముక్త పురుషుడు మోక్ష దశయందు పరమాత్మ యొక్క ధర్మములను అనగా అతని గుణములను పొందుచున్నాడు. వీరు సృష్టిలో జన్మింపరు. ప్రళయమున నశింపరు. అనగా బాధ నొందుట లేనివారై, సంసార చక్ర పరిభ్రమణము నుండి విడువడి పరమానందము ననుభవించు చుందురు. ఆయన ఆకారముతో నుందురనిన, నాలుగు బాహువులు శంఖ చక్రములతో గూడిన భగవదవతార చిహ్నములు గల ఆకారమును పొందుదురు. అది దివ్యమైన అప్రాకృత శరీరము. ఇదియే ముక్త పురుష విషయముగా గ్రహించవలెను.

ఇక నిత్యులు ఒకప్పుడును సంసార బాధలేక వైకుంఠమునందు శ్రీమన్నారాయణుని కైంకర్యాది పరిచర్యలు చేయుటయే ప్రయోజనముగా

గలవారై యున్న గరుడాళ్వారులు, విష్వక్సేనాళ్వారులు, ఆది శేషులు మొదలగు భగవత్పరిజన పరిచారకులు. వారికే 'నిత్యులు' 'సిద్ధులు' అనుపేరు. వీరలను 'నిత్యులు' అనుట భగవత్ జ్ఞానమునకొకప్పుడును కొరత లేకుండుటేనని తెలియవలెను. వీరు వైకుంఠనాధునకు సమస్తమైన 'శేషవృత్తి యందు సంబంధము గలవారై (సంబంధించిన వారై) కైంకర్యపరులందరికినీ ఉపమానముగా నుండుటం చేసి సిద్ధులను బిరుదు పొందగలిగిరి. కావున ఈ నిత్యసూరులు భగవంతునకు చేయు శేషవృత్తిలోకములో నున్న దేహులందరు (జీవులు) (ప్రజలు) ఆదర్శముగా గ్రహించి అందరును సాధన చేసి సిద్ధిని పొందవలెనని గ్రహించవలెను. ఇదివరలో నేనెవడను అను ప్రశ్నకు సమాధానము పూర్తిగా తెలిసికొంటిమి. ఇప్పుడు నీవెవరవు అను ప్రశ్నకు సమాధానము తేలిసికొంటిమి. నేను జ్ఞానానంద స్వరూపుడగు ఆత్మను, కర్మవశమున ఈ శరీరములో ప్రవేశించితినని తెలిసికొనగలిగితిమి.

ప్ర. నన్నీ చిత్ర జగత్తునకు దెచ్చిన దెవరు?

జ. వినుము, నిన్నీ చిత్ర జగత్తునకు దెచ్చినది పరమేశ్వరుడని గ్రహింపుము. ఆయన చాల గొప్పవాడు. ఆయనతో సమానమైనవాడు గాని, పైవాడుగాని, మరెవ్వరును లేరు. ఆయన స్వరూప శక్తి, గుణ సామర్థ్యములను గురించి తెలిసికొందము. ఆ పరమేశ్వరుని స్వరూప, రూప, గుణ, విభవ ఐశ్వర్యాదులను వర్ణింప మానవ మాత్రులకు సాధ్యమా! వేద పురుషుడే ఆ పరబ్రహ్మతత్వమును పూర్తిగా తెలుసుకొనగోరి వేదపత్రములను దొర్లించుచు పోగా ఎచ్చటను తుదిమాటలు గానుపించక అనంతమైన దియును, లెక్కలేని కల్యాణ గుణములు కలదియును నగు 'పరబ్రహ్మము' ఇంతమాత్రమని వాఙ్మనస్సులచే పరిచ్ఛేదింపదగినది కాదని తెలియబరచెను. మరియు దేని వలన పృథివ్యాది సమస్త భూతములు పుట్టుచున్నవో దేని వలన

పుట్టిన వన్నియు సురక్షితముగా రక్షింపబడుచున్నవో దానినే పరబ్రహ్మముగా నెరుంగుమని 'శ్రుతులు' వక్కాణించినవి. పరమేశ్వరుడు అనంతుడు. అనగా ఆద్యంతములు లేనివాడు. జ్ఞాన స్వరూపుడు. దేశకాల విభేదములు లేక ఎల్లప్పుడును సదైక రూపముతో నుండు వాడు భగవంతుడొక్కడే సత్యమని తెలియుము.

ప్ర. జ్ఞాన స్వరూపుడనగా?

జ. జ్ఞానముచే నీ జగత్తులో నెక్కడెక్కడ నేది జరిగినను గ్రహించగల శక్తిమంతుడు. చేతనుల హృదయాం తరాళమున బుట్టి అతిరహస్యమైన తలంపులను గూడ గ్రహింపగలవాడని తెలియవలెను.

ప్ర. అనంతుడన?

జ. జగత్తంతటను (యు) లోపలను వెలుపలను అంతటను వ్యాపించి సర్వాంతర్యామిగా నుండువాడు. భగవంతుడు లేని ప్రదేశము ఈ జగత్తునందు సూదిమొన మోపినంత చిన్న స్థలమైన నుండజాలదు. పరబ్రహ్మ సర్వాంతర్యామిగా అంతను నిండి యున్నాడు. అతడు నిఖిల దోష వివర్జితుడు. సకల కల్యాణ విభూషితుడు. అభయలక్షణుడు. ఆయాకార్య జాతము(లలో) లందు నామ రూపాది వికారములతో సంబంధము లేనివాడై యున్నాడు. అందుచే పరబ్రహ్మము, కారణావస్థ యందు సూక్ష్మగ నుండి చిద-చిత్ పదార్థములను శరీరముగా గలిగియున్నను వాని దోషములు ప్రకారికి సంబంధించవు. (శరీరమునందుండు దోషములు శరీరికి సంక్రమించవు)

ఆకాశము : అన్ని వస్తువులలో కలసి యున్నను స్థూలమగుటచే, వాని స్వభావములచే నంతటను సకల శరీరములందును వెలుగుచున్న 'పరమాత్మ' ఆయా శరీర గుణదోషములచే అంటబడక యున్నాడని 'శ్రీభాష్య' మందున్నది.

'జీవాత్మ పరమాత్మలు' ఒక్క శరీరమునే ఆశ్రయించియున్నవి. దానిలో నొకటియగు 'జీవాత్మ' కర్మఫలమును అనుభవించుచున్నది. రెండవదగు 'పరమాత్మ' అట్లు కర్మ ఫలముల ననుభవింపక ప్రకాశించు చున్నది. 'జీవాత్మ పరమాత్మలు' ఒకటిగా శరీరమునందుండినను 'జీవాత్మ' మాత్రమే దేహ సంబంధములగు ద్ఃఖ దోషములకు హేతువగు చున్నది. పరమాత్మను గురించి యన్ననో యట్టిదిగాదు. మరియునది 'నియమన' రూపములగు నైశ్వర్యమును బట్టి యుండునదియు నగుటచే ప్రకాశము కలుగజేయు నదియైయున్నది.

'అణోరణీయాన్ మహతో మహీయాన్' అణువునకంటె సూక్ష్మమైనవాడు, అన్నిటి కంటె పెద్దదగు వానికంటె పెద్దవాడు. పరబ్రహ్మ కొక్కనికే సంపూర్ణత్వము గలదు. ఆ సంపూర్ణత్వమును ఎవరును పూర్ణముగా తెలిసికొన లేరు. పూర్ణముగా నెవరును వర్ణింపలేరు. వేదార్థ సంగ్రహముననిదే తెలుపబడినది. శ్రీ భగవద్రామానుజులవారు 'భగవత్తత్వమును' ఇట్లు వర్ణించియున్నారు.

స్వభావత్ణ దోషవిరోధములైన అనంత జ్ఞానానంద స్వరూపుడును, స్వభావికములైన అనవధిక, అతిశయ అపరిమిత, ఉదారగుణ సాగరుడును, నిమేషాది కాలము, విభాజ్యమైన సర్వోత్పత్తి, స్థితిలయాది సర్వకాలకృత పరిణామములచే అంతటను నిండిన మహావిభూతి, స్వలీలాపరికరములై స్వాంశభూతములైన, బద్ధ-ముక్త నానావిధ చేతనములను, దద్యోగ్యమైన విచిత్ర పరిణామశక్తియగు చేతనేతర, జడప్రవృత్తి యందును అంతర్యామియై సర్వ శరీరములందు నుండువాడు 'పర బ్రహ్మముగా' గ్రహింపవలెను. ఇట్లు వేదార్థ సంగ్రహమున ఇదే చెప్పియున్నారు.

జీవులు అసంఖ్యాకులై నందున సృష్టి యందువై

చిత్ర్యమేర్పడినదనుట వలనను ఏర్పడు జీవులు సంఖ్యలో అనేకులైనను వాని స్వరూప గుణములలో భేదము లేదు గదా! జ్ఞానేచ్ఛాద్వేష ప్రయత్న, సుఖ దుఃఖములను గలిగి యుండుట ఎల్లజీవులకును సమానమే.

జీవుల స్వరూపములలో పరస్పర భేదము లేదు. (నిస్సంశయము.)

ప్ర. అట్టియెడ, జీవుల కొఱకై యేర్పడు శరీరములలో నింత భేదమేల? దీనిని తెలుసుకొందము.

జ. "ఎనుబది నాలుగు లక్షల" యోనిజ-అయోనిజ, వర్గములలో (నెంతరూప భేదమున్నది.) ఒక్కొక్క యోనికి సంబంధించిన కోట్ల కొలది శరీరములలోనను పరస్పరమెంతో రూపభేదమున్నది. ఒక్కొక్క తల్లిదండ్రులు కేర్పడిన 'కవల' సంతానములో శరీరములలో గూడనెంతో భేదము చూడగలము. ఒక శరీరము సూక్ష్మమైనదిగాను, మరియొకటి దుర్బలముగను, ఒకరిది యున్నతకాయము, మరియొకనిది 'హ్రస్వము', ఒకని దేహము శ్యామల వర్ణము, ఇంకొకనిది గౌరవర్ణము ఇంతటి వైచిత్ర్యమునకు కారణమేమియో తెలిసికొందము. పరమేశ్వరుడు సూక్ష్మమగు ప్రకృతిని స్థూలము చేసి దానిని దృశ్యమాన ప్రపంచ రూపములుగ మార్చును. ఇదియే ప్రధానముగ భగవంతుడు చేయు సృష్టికార్యము జీవులు కర్మలొనర్చుటలో భేదము, వైచిత్ర్యముండుట సహజము. ఆయా కర్మలకు దగినటుల ఫలమునిచ్చు సామర్థ్యము భగవంతుని కొక్కనికే కలదు. అందువలన కర్మ వైచిత్ర్యమున కనుగుణమగు ఫలవైచిత్ర్యమును అనుభవింపజేయుటకు దగినటుల చిత్ర విచిత్ర సృష్టి పరమేశ్వరుడు చేయుచున్నాడు అని స్పష్టమగుచున్నది.

ఇటుల చేయుటలో భగవంతునకు పక్షపాతము అవసరము లేదు. జీవులోనర్చు కర్మలలో భేదమున్నది. కావున కర్మానుగుణముగ ఫలమును,

సుఖ ద్ఃఖములను అనుభవించుటకు దగినట్లుగా భిన్నభిన్న శరీరములను రచించుట భగవంతుని కర్తవ్యమగుచున్నది. ఇందు పక్షపాతమునకు తావే యుండదు. ఇది వైదిక కర్మ సిద్ధాంతమున గల వైశిష్ట్యము.

జన్మమునకు - జన్మ ద్వారా అనుభవించు ఫలములకు జీవులొనర్చు కర్మములే కారణము. కర్మల నొనర్చుటలో జీవులు స్వతంత్రులు. కావున నానా విధములగు కర్మలను జీవుడు చేయుటకు నిమిత్త మాత్రముగా భగవంతుడు అనుజ్ఞ దానము చేయును. జీవులు చేయు కర్మలలో నెంత వైచిత్ర్యముండును. ఆ కర్మ వైచిత్ర్యమును ప్రయోజనకరముగ నంగీకరించి 'పరమేశ్వరుడు' ప్రపంచమును విచిత్రముగ సృష్టించు చున్నాడు. ఇందుకు కారణము జీవులు చేయు కర్మలే. (కార్యమున వారను భవించు ఫలము-కారణమున వైచిత్ర్యముండిన గార్యమున వైచిత్ర్యము సిద్ధము) ఈ తత్వమును గ్రహించినది క్రాంతదర్శి మహర్షియే. నన్ను పరమాత్మ ఈ చిత్ర జగత్తునకు యేలదేచ్చెనో? ఈ జగత్ స్వరూప స్వభావములను తెలుసుకొంటిమి. ఇక 'అచిత్' స్వరూప స్వభావములను తెలుసుకొందము.

'అచిత్' అనగా అచేతనము, జ్ఞానశూన్యమైనది. ఇది స్వరూప, స్వభావ, గుణ రూపములచే మూడు విధములైనది.

1) శూద్ధ సత్వము.

2) మిశ్రమ సత్వము.

3) సత్య శూన్యము.

ఈ మూటి స్వభావ, స్వరూప గుణములు వేరుగా నుండుటచే వీనిని వేరువేరుగానే సమీక్షించవలెను. మొదట శుద్ధ సత్వమును గురించి తెలుసుకొందము.

# శుద్ధ సత్వము- (నిత్య విభూతి)

రజో గుణ, తమోగుణములేమాత్రమును కలియని సత్వము 'శుద్ధ సత్వము' అనబడును. ఇది కేవలము జ్ఞానానందాయతమైనది.

ప్ర. అచిత్ గూడ జ్ఞానశూన్యమైనదే గదా! శుద్ధ సత్వము గూడ అచిత్‌లో చేరినదే కద! అదెట్లు జ్ఞానానందాయత మైనది?

జ. అట్లు కాదు. రజస్తమస్సంబంధము వలననే అజ్ఞానము మోహము దుఃఖాదులు కలుగును. రజస్తమో గుణము లేమాత్రము కలియని 'శుద్ధము' కేవల జ్ఞానానంద జనకమై యుండును. ఈ శుద్ధ సత్వమునకే 'పరమాకాశము' అని కూడ పేరు. ఇది నిత్యమై కాలము నతిక్రమించినదై కర్మచే గాక కేవలము 'భగవదిచ్ఛచే' విమాన, గోపుర, మంటప, ప్రాకారాది రూపములుగ పరిణమించునదియై యుండును.

'నిత్యమైనది' యనగా ఆద్యంతములు లేనిది. వికారము లేనిది. కాలము నతిక్రమించినది, అనగా ఇచ్చట కాలము దేనిని ప్రవర్తింపజేయ జాలదు. ఇది శ్రీమన్నారాయణుని నిత్య-ముక్త పరివారముచే సేవింప బడుచుండు దివ్యధామము 'శ్రీ వైకుంఠము' అని సర్వ సామాన్యముగా చెప్పుదురు. శ్రీమన్నారాయణుడే వైకుంఠ నాథుడు. ఈ జగత్తున సృష్టింపబడిన భూతములన్నియు ఒక్క పాతిక భాగమేను. తక్కిన ముప్పాతిక భాగము నాశరహితమై వికార రహితమై స్వప్రకాశరూపముగ నున్నది. దీనికే 'నిత్యవిభూతి' యని పేరు. ఇది విరజానదిచే చుట్టబడి యున్నది. ఈ 'పరమాకాశము' భగవదిశ్చచే విమాన-మంటప-గోపురప్రాకారాది రూపములచే అతి మనోహరముగ నుండును. ప్రకాశమానమైన మణిమయ కుడ్యములచే నావరింపబడి, కల్పవృక్షముచే నవరత్న ఖచిత దివ్య ఆస్థాన మంటపములతోను జాజ్వల్యమానమైన మణిమయ దివ్య భవనములతోడను విరాజిల్లు చుండును. 'ఈ అప్రాకృత'

స్థానము పరమాత్మ యొక్క ప్రత్యేక నగరం. శుద్ధ సత్వ గుణముచే జ్ఞానానందముల కాలవాలమై నిరవధిక తేజోరూపమై యుండును.

ప్ర. నిరవధిక తేజోర్రూప మనగా?

జ. అగ్ని, సూర్యుడు మొదలగు తేజ్ఞప్రకాశములను మినుగురు పురుగులతో సమానముగ చేయగల మహా ప్రకాశముతో వెలుగునది యని గ్రహింప నగును.

ఆ పరమాత్మ స్థానమును సూర్యుడుగాని, చంద్రుడుగాని, అగ్నిగాని ప్రకాశింపజేయ జాలదు. దేనిని బొందిన జీవులు మరల సంసారమునకు దిరిగిరారో అదియే 'పరమాత్మ యొక్క శ్రేష్ఠమైన స్థానము' ఇదియే (సమస్తమైన) ముక్తులైన శుద్ధాత్మలు. అర్చిరాది మార్గమున పోయి చేరు మహాస్థలము. ఇచ్చటికి పోవువారు మరల జన్మనెత్తరు. దీని పరిమాణ మింతని కొలుచుటకు సాధ్యము గాని విస్తీర్ణము గలది. దీని అధోభాగమున లీలావిభూతి యెల్లగానున్నది. దీని ఊర్ధ్వ భాగమున, ప్రక్కలను ఎల్లలు లేవు. 'నిత్యవిభూతి– లీలా విభూతి అనగా అర్థము తెలుసుకొందము.

ప్ర. విభూతి అనగా?

జ. భగవంతుని ఐశ్వర్య సంపద.

ప్ర. నిత్య మనగా?

జ. శాశ్వతమైనది. దీనికి సంకోచ వికారములు లేవు. ఎల్లప్పుడు ఒకేవిధముగ జాజ్వల్యమానముగ ప్రకాశించును. భగవానునకు, నిత్యముక్తులకును ఆనందదాయకముగ నుండును. గాన, ఇది నిత్య విభూతి యని తెలియబడు చున్నది. లీలావిభూతి మిశ్రమ తత్వము. లీలావిభూతి మిశ్రమసత్వాత్మకమై దృశ్య మానమగు జగత్తంతయు

లీలావిభూతి యనబడు చున్నది. భగవంతునిచే తన క్రీడా వినోదార్థము సృష్టింపబడినది. ఇదియు నిత్యవిభూతివలె నిత్యమైనదే. గాని ప్రవాహత్ణ రాకపోకలు గలది. వికారములు గలది. భగవంతుడు చేతనా చేతనముల నొకటిగా గూర్చి ప్రకృతి యోనిలో తన సృష్టి బీజములను వదలి అత్యాశ్చర్యకరమగు నీ లీలావిభూతిని సృష్టించి, అందు తానంతర్యామియై తన శక్తి సామర్థ్యములను బద్ధ చేతనులు తెలుసుకొనునటుల అమానుషకృత్యములను ప్రదర్శించుచు సకల చేతనాచేతనములను ఇంపార రక్షించుచుండును. ఈ అఖండ బ్రహ్మాండమే 'విశ్వరూపము' విరాట్స్వరూపము. ఈ మిశ్రమ సత్వమునకే ప్రకృతి (స్వభావ) యని కూడ పేరు కలదు. దీనినే శ్రీమద్రామానుజుల వారు శ్రీభాష్యమున నిర్వచించిరి.

సృష్టికి పూర్వము నామ రూప విభాగములు లేనిదై కారణావస్థలో నుండునట్టి 'బ్రహ్మమే' ప్రకృతి శబ్దము చే తెలుపబడుచున్నదని ప్రకృతి నిర్వచనము. బ్రహ్మేతర పదార్థము ఎప్పుడును, ఎందును నుండనేరదు. జడము, ఇతరుల కొఱ(కు)కై యుండునది. నిత్యము (సర్వదా) వికారము నందనట్టిది. త్రిగుణ భూయిష్ఠమైనది. కర్తలగు జీవులకు భోగస్థానమైనదిగా నగుటయే ప్రకృతికి స్వరూపమని వివరించి యున్నారు.

ప్ర. జడమనగా

జ. స్వయంప్రకాశము గానిది.

ప్ర. నిత్యమైనది అనగా?

జ. చేతనము వలె నిదియు ఆద్యంతములు లేనిదై స్థిరముగా నుండునది.

ప్ర. అచేతనమనగా?

జ. ఆద్యంతములు లేనిదే గాని అనాదిగా ప్రవాహ రూపముగ పుట్టుచు గిట్టు చున్నది.

ప్ర. వికారము నందునట్టిది అనగా?

జ. ప్రకృతి ఒక దశ నుండి మరియొక దశకు మారునట్టి స్వభావము గలదిగయుండుట, త్రిగుణ భూయిష్ఠమైనది. అనగా సత్వ రజస్తమోగుణముల మూటి స్వభావము గలది. యితరుల యనుభవము కొఱకై యుండి, చేతనులగు జీవులకు, భోగస్థానమైనదిగ నుండుటయే దీని స్వరూపము. అందుచే నీ సృష్టికి బూర్వము కారణా వస్థలో నున్న ఈ కార్య జాతమునే ప్రకృతి యందురు. ఇది కార్యావస్థను బొంది నామరూపాత్మకమై, త్రిగుణాలంకృతమై భోక్తయగు జీవునికాభోగ స్థానమై నొప్పారు చున్నది. జీవస్థానమున నెట్లు అతడు బ్రహ్మమునకు శరీరముగా తెలుపబడినో, అటులనే నీ ప్రకృతి, ఈ ప్రపంచము గూడ ఆ బ్రహ్మమునకు శరీరముగ ప్రతిపాదింపబడినది.

సమస్త చేతన పదార్థములకు ఆత్మయగుట చేత విశిష్టమగు జగమంతయు బ్రహ్మ యొక్క శరీరము. ఈ జగత్తునకు 'పరబ్రహ్మ' అంతర్యామిగా నుండును. 'ప్రకృతేరపి ఈశ్వర శరీరత్వాత్'. కాన ప్రకృతి కూడ ఈశ్వరుని శరీరమేనని నిర్వచనము చేసినారు.

చిద్ అచిత్ పదార్థములు శరీరములు కాగ, పరబ్రహ్మము ప్రపంచము కంటే వేరుకాదని విశదమగు చున్నది. చేతనా చేతన పదార్థములు శరీరమగుటచే, ఆ పదార్థములు విశేషముగా గల బ్రహ్మము సర్వ శబ్దములచే గ్రాహ్యము గావున బ్రహ్మము ఒకప్పుడు తన శరీరమని వేరుగా నిర్దేశించుటకు అర్హముగానంత సూక్ష్మముగా నుండు చేతనా చేతన పదార్థములను శరీరముగా గలిగియుండును. అది కారణావస్థ

యందురు. అది సృష్టికాలమున నామరూప విభాగములు గల చేతనాచేతనములను శరీరముగా గలది యగును. అప్పుడది కార్యావస్థయందు బ్రహ్మమనబడును. అందుచే కారణ భూతమగు పరబ్రహ్మము కంటె కార్యభూతమగు ప్రపంచము బ్రహ్మము యొక్క విశేషణాంశమని ఎరుంగవలెను. మణియందుండు కాంతి మణి కంటె వేరుగా గ్రహింప బడనిదై 'మణియొక్క గుణము' దాని యంశమే యగురీతి చేతనా చేతన పదార్థములగు జీవజగత్తులు బ్రహ్మము కంటె నన్యము గాదని గ్రహింపబడినివై బ్రహ్మమునకు విశేషణములగుటచేనవి పరబ్రహ్మము యొక్క అంశములే యనుట యుక్తము.

తేజస్సునకు-తేజోవంతునకును-శక్తికిని- శక్తి వంతునకును, శరీరమునకు- శరీరికిని వలె జగత్తునకు బ్రహ్మమునకును అంశాంశ భావమున్నట్లు గ్రహింపవలెను. ఒక స్థానమున మాత్ర ముండు అగ్ని యొక్క ప్రకాశము సర్వత్ర వ్యాపించి యున్నరీతి ఈ ప్రపంచమంతయు పరబ్రహ్మము యొక్క శక్తియై అంతటను వ్యాపించి యున్నది.

కాన, బ్రహ్మమే ఈ సృష్టికి కర్త, కర్మయునగును. క్షీరము స్వాభావికముగ దధియగునట్లు తనలో గల విచిత్రశక్తి యోగముచే బ్రహ్మమే జగత్తుగ పరిణమించు చున్నది. ఈ విధముగ సత్వేతర సర్వవస్తువుల కంటె విలక్షణుడై సర్వ సృష్టియు యుత్పన్నమగుచున్నది. భగవంతుడు జీవుల పుణ్యపాపాను గుణముగ వారికనుభవయోగ్యమైన 'సత్తను' సృజించి జీవునకు సుఖ దుఃఖానుభవముల నొసంగు దానిగ నిర్మించెను. ఇది శ్రీరామానుజ భాష్య నిర్వచనము.

# ఇంకొక సూత్రము

## ఇంకొక సూత్రము

భోగము అనుభవించదలచిన వారికి "మోక్షము" పొందదలచిన వారికి వారువారు కోరిన భోగమోక్షములు లభించుటకు మొదటి మెట్టు సాధన సమాగమమే. సత్సంగమే భోగ మోక్ష సమాగమము. (ఎట్లు లభించునన్న) సత్పురుషులతో మాటలాడుటచేతను వారిని ప్రార్థించి ప్రశ్నించి (ధర్మ సాధనలను) తెలుసుకొనుటే (ను) ప్రాణులకు భోగ, మోక్షములకు తగిన ఉపాయమని తెలియవలెను. మోక్షము కోరు వారికి సత్పురుష సంగమము. వారితో మాటలాడి ప్రశ్నించి వారి సద్గుణములను వర్ణించి వారి యందను రాగ మేర్పరచు కొనుట యనునవి వరుసగా లభించిన మోక్ష సాధనములగు సద్గుణముల యందు అనురాగ, మేర్పడును. ఈ గుణ శ్రవణము నందు ప్రీతిచే నీకు భగవానుని యందు ఎప్పటికిని వేరొక ఫలము కోరని భక్తి స్థిరముగ నుండగలదు. అదే మనసున కంటిన కషాయము వంటిదై పూర్వ పాపకర్మ వాసనలను తొలగించుచు అంతమొందించును. మానవులు (మనుష్యులు) మోక్షమునందుటకు సాధనము భక్తియే యని శాస్త్రములలో నిశ్చయ సిద్ధాంతము చేసినారు. ఇట్టి భక్తి గుణత్రయ రహితుడైన సర్వేశ్వరుని యందు దృఢముగా నుండవలెను. భగవంతుని కంటె ఇతరమైన వాని యందు అనురక్తి లేకుండ వలెను. దానినే 'పరభక్తి' 'పరజ్ఞానము' 'పరమభక్తి' యని మూడు విధములుగా విభజించినారు. (మూడు క్రమములు గలిగినవి.)

1) పరభక్తి : భగవంతుని యందు ప్రీతి గలిగి వానినే స్మరించుటయే పరభక్తి యనబడును. ఆ పరభక్తిచే భగవత్ సాక్షాత్కారము

కలుగును.

2) అదియే పర జ్ఞానము. పరజ్ఞానముచే రెప్పపాటు గూడ దానిని వదలి యుండలేని నిరతి శయమగు ప్రీతి జనించును. అదియే పరమభక్తి.

3) పరమ భక్తి : ఇది దృఢముగ నుండవలెను. కావున ఇంకొక ఆలోచన లేక మిక్కిలి ప్రీతితో భగవానుని ఎదురుగ దర్శించుచున్నట్లుగా స్మరించుటయే పరమ భక్తి. ఇదియే మానవులకు శ్రేయము గలిగించు సాధన. ఇట్టి భక్తి కలుగుటకు సాధనము శ్రద్ధ. శ్రద్ధతో పరమాత్మను దర్శించుట వాని గూర్చి తెలిసికొనుట వాని కథలనే వినుట ఈ క్రమముతో చేసిన మానవులు క్షేమము నందుదురు. మోక్షము నందుదురు.

## వేదములు

ఆచార్యులను ఆశ్రయించి జ్ఞానమును పొంది తత్వ విచారణచే వృద్ధి నందిన (భక్తి) సాధనచే పురుషుడు జ్ఞాన వైరాగ్యములతో అతిశయమగు భక్తిని పొందును. దానిచే పంచభూతాత్మకమగు ఈ జీవుని శరీరము బీజము లేనిదగును. దేహ సంబంధము కలుగుటకు బీజము పుణ్యా పాపములనెడి 'కర్మవేగమును' దాని జ్ఞాన భక్తి వైరాగ్యము, దానిని దహించి వేయును. ఈ విధముగ శరీర సంబంధము పోవును. దానిచే సత్వరజస్తమో గుణములు దానిచే కలిగెడి ద్వేషాదులు కనబడకుండ పోవును. మరల దేహి దేహ సంబంధమును పొందదు. దానికి కావలసినవి యేయే సాధనలు చేయవలయునో ఇది వరకు తెలిసికొంటిమి. ఉత్తరార్థమున దానికి ఉపాయములు లభించు ఫలమును గూడ తెలుసుకొంటిమి. సర్వస్వమును పరమేశ్వరున కర్పణ చేయుచు నమస్కరించి మోక్షము గాని సాయుజ్యమును గాని కోరక అనన్య

చింతనయే సాధనగా వహించవలెనేగాని మనము దేనిని కోరరాదని తెలిసికొంటిమి. ఇట్టి సాధన చేసిన మనకేది కావలయునో ఆ సర్వేశ్వరుడే ఈయగలడు. తప్పక పరమాత్మను పొంద గలరు. ఇది సత్యము. సత్యము. సత్యము. ఎందరో తరించినారు. వారిలో నా పరమ గురువులు శ్రీరామకృష్ణ గురుదేవులే ఆదర్శము.

ఏకలవ్యుడు సాధించి తరించినట్లేనేను, అందరును తరించవలెననే సత్య సంకల్పముతో నీ 'సన్మార్గ దర్శనము' మార్గముగా నుపయోగపడగలదని ఆశించినాను.

ఇంకను ప్రహ్లాదస్వామి, మారుతి, ధ్రువుడు మొదలగు వారెందరో తాము తరించి ఆదర్శ పురుషులైనారు. నేను అల్పజీవి నైనను శ్రీహరి పాద పద్మములనే నమ్మి సేవించుచు సాధన మార్గమున పయనించుచు దీనిని ఆ జగన్మాత పాదముల వద్ద పూజా పుష్పముగా సమర్పించినాను. మన్నించి అందరు దీనిని అనుష్ఠించి మోక్షమును పొందురుగాక! యని ప్రార్థించు చున్నాను.

"సర్వం శ్రీ జగన్మాతార్పణమస్తు"